బుధవారం
28•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 262
• పేజీలు : 16 + (24/16) + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

చనాక-కొరాట పనుల్లో వేగం పెంచాలి

- నిర్దిష్ట కాలవ్యవధిలో రైతులకు సాగునీరందించాలి
- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం
- బరాజ్ నిర్మాణ పనుల పరిశీలన

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో నిర్మిస్తున్న చనాక-కొరాట ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంత్రులు టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జోగు రామన్న, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీలు కే కేశవరావు, నగేశ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలాచారితో కలిసి మంగళవారం బరాజ్ పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంప్‌హౌస్, కాల్వల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. భూసేకరణ, ఇతర సమస్యలు ఉంటే కలెక్టర్‌తో చర్చించి, పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోయిన రైతులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలని స్థానికులు కోరగా సీఎం అంగీకారం తెలిపారు. ఫొటో ప్రదర్శనను సీఎం, మంత్రులు తిలకించారు. కార్యక్రమంలో సీఈ భగవంతరావు, ఓఎస్డీ శ్రీధరావు దేశ్‌పాండే, ఎస్సీ అంజద్‌హుస్సేన్, ఈఈ రవీందర్, డీఈ తులసీరాం, గణేశ్, మనోహర్, సీఈ సీడీవో శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమణారావు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లాలో చనాక-కొరాట బరాజ్ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, ఎంపీ కేశవరావు తదితరులు కూడా ఉన్నారు.

టీఎస్ ఆర్టీసీకి మరో రెండు అవార్డులు

ఢిల్లీలో అవార్డులను స్వీకరించిన ఎండీ రమణారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్ ఆర్టీసీకి మరోసారి వాహనాల ఉత్పాదకత, ఇంధన పొదుపులో రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కాయి. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్(ఏఎస్ఆర్టీయూ) ప్రామాణికంగా ఎంపిక చేసే ప్రతిష్ఠాత్మక అవార్డుల్లో భాగంగా ఇవవి వరించాయి. న్యూఢిల్లీలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో మంగళవారం జరిగిన ఎస్ఆర్టీయూ 62వ వార్షిక జనరల్ బాడీ సమావేశంలో మోర్త్(మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హైవే) కార్యదర్శి యుధ్‌వీర్ సింగ్ మాలిక్, మోర్త్ జాయింట్ సెక్రటరీ అభయ్‌దామ్‌లే చేతుల మీదుగా టీఎస్ ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు అవార్డులను స్వీకరించారు. 2016-17 సంవత్సరాల వాహనాల ఉత్పాదకతలో 318.27 నుంచి 328.27(కి.మీ/వెహికిల్/డే) పెరుగుదలను సాధించడమే కాకుండా.. 7500 వాహన రవాణా సంస్థ క్యాటగిరిలో ఇంధన పొదుపులో అత్యధికంగా 5.51 కేఎంపీఎల్ సాధించినందుకు టీఎస్ ఆర్టీసీకి రెండు అవార్డులు దక్కాయి. అవార్డులు రావడం ఆనందంగా ఉందని, ఈ సందర్భంగా కార్మికులందరికీ ఎండీ రమణారావు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు హోళీ పండుగ సెలవు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హోళీ పండుగ సెలవు దినంగా మార్చి 1వ తేదీని నిర్ణయిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అయితే, కొంతమంది మార్చి 2న కూడా హోళీ పండుగను నిర్వహిస్తున్నారు. దీంతో మార్చి 2వ తేదీని ఐచ్ఛిక సెలవుగా ప్రభుత్వం నిర్ణయించింది.

మార్చి 5న విభజన సమస్యలపై సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో మార్చి 5న విభజన సమస్యలపై సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ, ఏపీ ప్రభుత్వ సీఎస్‌లు, రెండు రాష్ట్రాల విభజన సెల్ అధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

రసాయన ప్రమాదాల నివారణ కమిటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రసాయన పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం క్రైసిస్ కమిటీలను ఏర్పాటుచేసింది. మండల, జిల్లా స్థాయిల్లో ఈ కమిటీలను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాస్థాయి క్రైసిస్ గ్రూప్‌లో 18 మంది, మండలస్థాయి లో గ్రూప్‌లో 14మంది సభ్యులుంటారు.

మాట్లాడే పుస్తకాలు!

- ప్రయోగాత్మకంగా 200 స్కూళ్లకు పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 200 ప్రభుత్వ పాఠశాలలకు మాట్లాడే పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. 15 రకాల పుస్తకాల సమాచారాన్ని ఒక ఎలక్ట్రానిక్ డాల్ఫిన్ బొమ్మలో రికార్డు చేస్తారు. వాటి ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తారు.

ముహూర్తం




సూర్యోదయం: 6.39 గంటలకు



సూర్యాస్తమయం: 6.18 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం త్రయోదశి ఉదయం 11.48 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుష్యమి తె. 3.52 వరకు, తదుపరి ఆశ్లేష, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.29 నుంచి 1.56 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.05 నుంచి 12.52 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.32 నుంచి సాయంత్రం 5.08 వరకు.

లోకం పోకడ



వ్యవసాయం అంటే నామోషీపోయింది. మావోడికి చదువే కాదు, వ్యవసాయం కూడా నేర్పిస్తా!

2022 నాటికి డిజిటల్ సాక్షరత

- మానవసౌఖ్యం కోసమే ఇ-పరిపాలన
- ఇ-గవర్నెన్స్ ముగింపు సదస్సులో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్
- తెలంగాణ రాష్ట్ర మీసేవకు జాతీయ అవార్డు
- ఇ-గవర్నెన్స్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావుకు ప్రదానం చేసిన కేంద్రమంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

2022 నాటికి అందరికీ డిజిటల్ సాక్షరతను సమకూర్చాలని, జన్ ధన్, ఆధార్, మొబైల్.. ఈ మూడింటినీ విరివిగా వినియోగించుకోవాలని కేంద్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని ప్రధానమంత్రి కార్యాలయ వ్యవహారాలు, సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, అణుశక్తి విభాగం సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చెప్పారు. పాలనను సరళతరం చేయడం, తద్వారా మానవ జీవనాన్ని సులభతరం చేయడమే ఈ-పరిపాలన ప్రధాన ధ్యేయం కావాలన్నారు. మంగళవారం హెచ్ఐసీసీలో 21వ ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ-పరిపాలనకు కేంద్రం ప్రాముఖ్యం ఇస్తున్నదని కేంద్ర మంత్రి తెలిపారు. సీపీజీఆర్ఏఎంఎస్ పోర్టల్ ఆదర్శప్రాయమైన నమూనాగా నిలిచిందని, ఇదివరకటితో పోలిస్తే ఏడురెట్లు ఫిర్యాదులను స్వీకరించడమే కాకుండా 90 శాతం మేర పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. మూడేండ్ల క్రితం వరకు ఈ విభాగానికి అందిన ఫిర్యాదుల సంఖ్య రెండులక్షలు కాగా, ప్రస్తుతం 16 లక్షలకు చేరిందన్నారు. పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం (డీఏఆర్పీజీ) , సిబ్బంది మంత్రిత్వశాఖ అభివృద్ధిపరిచిన ఉత్తమ పద్ధతులను అనుసరించాలని ఆయన రాష్ట్రాలకు సూచించారు. ప్రభుత్వంలో కిందిస్థాయి ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ పద్ధతిని, సర్టిఫికెట్ల ప్రతులపై గెజిటెడ్ అధికారుల ప్రమాణీకరణను తొలిగించడంతోపాటు, కాలంచెల్లిన 1500పైగా నియమాలను రద్దు చేశామని తెలిపారు. దేశంలో 40ఏండ్లలోపు వారు 70 శాతం ఉన్నారని, వారిసేవలు వినియోగించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర డీఏఆర్పీజీ కార్యదర్శి కేవీ ఈపెన్, అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ముఖ్యకార్యదర్శి శాలినీమిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఇ-గవర్నెన్స్‌లో తెలంగాణకు జాతీయ అవార్డు

ఇ-గవర్నెన్స్‌లో ప్రముఖంగా కృషిచేసిన 19 ప్రభుత్వశాఖలు, సంస్థలను ఇ-గవర్నెన్స్ జాతీయసదస్సు సందర్భంగా అవార్డులకు ఎంపిక చేశారు. మొత్తం ఎనిమిది క్యాటగిరీల్లో బహుమతులను కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అందించారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న మీ సేవకు మూడో క్యాటగిరీలో రెండో బహుమతి దక్కింది. ప్రజలకు తమ ప్రాంతాల్లోనే తక్కువ సమయంలో సేవలందించడం మీసేవ ఉద్దేశం. రాష్ట్ర ఇ-గవర్నెన్స్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ ఈ అవార్డును కేంద్రమంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. మొదటి క్యాటగిరీ ఎక్సలెన్స్ ఇన్ గవర్నమెంట్ ప్రాసెస్ రీ-ఇంజినీరింగ్ విభాగంలో మొదటి బహుమతి కేంద్ర ప్రభుత్వ ఇనాంప్రా సంస్థకు లభించింది.



కేంద్రమంత్రి జితేంద్రసింగ్ నుంచి తెలంగాణ మీ సేవకు వచ్చిన జాతీయ అవార్డును అందుకుంటున్న రాష్ట్ర ఇ-గవర్నెన్స్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు

శాంతిభద్రతల్లో టెక్నాలజీ వినియోగం: డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి



డీజీపీ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాలినీమిశ్రా

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ-గవర్నెన్స్ గుడ్ ప్రాక్టీసెస్ అంశంపై నిర్వహించిన ప్యానల్ డిస్కషన్‌లో పలువురు అధికారులు తమ ఫలితాల గురించి వివరించారు. రోల్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ పోలీసింగ్ గురించి డీజీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హ్యాక్ ఐ, టీఎస్ కాప్ , లాస్ట్ రిపోర్ట్, ట్రాఫిక్ లైవ్, ఈ పెట్టీ కేస్ లాంటి 24 యాప్స్ తీసుకొచ్చామని తెలిపారు. ఫీల్డ్ లెవల్ పోలీస్ ఆఫీసర్లకు టెక్నాలజీ ఉపయోగంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో రాష్ట్రం ముందుస్థానంలో ఉందన్నారు. పోలీస్, ఆర్టీఏ కలిసి తీసుకొచ్చిన ఎం-వ్యాలెట్ యాప్ ప్రజల ఆదరణ పొందుతున్నదని చెప్పారు.

ఈ-పాస్‌తో అద్భుత ఫలితాలు: సీవీ ఆనంద్



సీవీ ఆనంద్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాలినీమిశ్రా

పారదర్శకత, జవాబుదారీతనం, సత్వర ఫలితాలే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పౌరసరఫరాలశాఖలో చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. సదస్సులో ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కనీస మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నట్లు చెప్పారు. 2016 వానకాలం, 2017 యాసంగిలో రూ.11వేల కోట్లను 15లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేశామని తెలిపారు. ఈ-పాస్ విధానం అమలుతో 12 నుంచి 15శాతం బియ్యం ఆదా అవుతుందని చెప్పారు.

డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను కేటాయించండి

- రక్షణ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కేంద్రంగా తెలంగాణ
- అనువైన పరిస్థితులున్నప్పటికీ రాష్ట్రాన్ని విస్మరించారు
- కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో పలు రక్షణ రంగ సంస్థలకు కేంద్రమైన తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కారిడార్ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రానికి అన్ని అర్హతలున్నాయని పేర్కొంటూ మంగళవారం కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తెలంగాణలో ఐదు దశాబ్దాలుగా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ఇకోసిస్టమ్ ఉన్నదని కేటీఆర్ తెలిపారు. ఇటీవల బుందేల్‌ఖండ్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్లను కేటాయించిన విధంగానే తెలంగాణకు కూడా కేటాయించాలని కోరారు. కేంద్రబడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్లను ప్రకటించిన కేంద్రం అన్నివిధాలా అనువైన పరిస్థితులున్న తెలంగాణకు వాటిని కేటాయించకుండా విస్మరించడంపై మంత్రి కేటీఆర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఇలాంటి కారిడార్లను కేటాయిస్తే స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో డీఆర్డీవో, ఆర్సీఐ, డీఆర్డీఎల్, బీడీఎల్, మిథానీ, ఎన్సీఎల్ వంటి అనేక రక్షణరంగ సంస్థలతోపాటు, ప్రైవేటురంగంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, హెచ్‌బీఎల్, అస్ట్రా సంస్థలు ఏరోస్పేస్, డిఫెన్స్‌రంగాల్లో పనిచేస్తున్నాయని మంత్రి కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఆయాసంస్థలు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు భాగస్వాములుగా ఉన్నాయని, ఇలాంటిచోట డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేస్తే పెట్టుబడులు భారీగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌కు ప్రపంచం నలుమూలల నుంచి విమాన సౌకర్యంతోపాటు, చుట్టూ ఎనిమిది వరుసల హైస్పీడ్ అవుటర్ రింగ్‌రోడ్డు విస్తరించి ఉన్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏరోస్పేస్ డిఫెన్స్ రంగాన్ని ప్రాధాన్యతారంగంగా గుర్తించిందని, ఈ మేరకు ఆదిభట్ల, జీఎంఆర్ విమానాశ్రయానికి అనుకుని ఉన్న రెండుపార్కుల్లో ఈ రెండురంగాల్లో ఇప్పటికే ఉత్పత్తులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు ఎలిమినేడులో మరో పార్కు, జహీరాబాద్‌లోని నిమ్జ్‌లో ప్రత్యేకంగా ఏరోస్పేస్ డిఫెన్స్ క్లస్టర్‌ను ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో డిఫెన్స్ ఇంక్యుబేటర్ ఏర్పాటును సైతం ప్రభుత్వం పరిశీలిస్తున్నదన్నారు. అంతర్జాతీయస్థాయి కంపెనీలైన బోయింగ్, లాక్‌హీడ్‌మార్టిన్, సికోర్స్కి వంటి కంపెనీలు హైదరాబాద్ నగరాన్ని తమ ఉత్పత్తులకు తయారీ కేంద్రంగా ఎంచుకున్న విషయాన్ని లేఖలో వివరించారు. ప్రాట్ అండ్ విట్నీ వంటి సంస్థలు తమ ఇంజిన్ శిక్షణ కేంద్రంగా నగరాన్ని ఎంపిక చేసుకున్నదని తెలిపారు. డిఫెన్స్ తయారీ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి కేటీఆర్ కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర మంత్రి కేటీఆర్

సోలార్‌లో నంబర్‌వన్ కావడం గర్వంగా ఉంది

విద్యుత్‌శాఖ మంత్రిని అభినందిస్తూ మంత్రి కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానానికి చేరడం ఎంతో గర్వంగా ఉందని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సోలార్ విద్యుత్ ఉత్పత్తితో 3 గిగావాట్ల స్థాయిని దాటినందుకు విద్యుత్‌శాఖ మంత్రికి, ఆయన టీమ్‌కు అభినందనలు తెలిపారు.

రైతుకు రూ.5 లక్షల బీమా భేష్

సీఎం కేసీఆర్ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ హర్షం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులు అనారోగ్యానికి గురైనా, అకాలమరణం చెందినా రూ.5 లక్షల ప్రమాదబీమా వర్తింపజేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని మంగళవారం ఆయన ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. కనీస మద్దతు ధర, పంటల బీమా విషయంలో లోపాలను కేంద్ర ప్రభుత్వం సవరించి మరింత ప్రయోజనకారిగా తీర్చిదిద్దితే.. అప్పుడు రైతులకు నిజమైన అచ్చేదిన్ వచ్చినట్లు' అని మంత్రి ట్వీట్ చేశారు.

నీటి విడుదలను నిలిపివేయండి

- శ్రీశైలం, సాగర్‌లపై ఏపీకి కృష్ణాబోర్డు ఆదేశాలు
- ఒప్పందం కంటే 2.32 టీఎంసీలు అధిక వాడకం
- తెలంగాణకు ఇంకా 16.493 టీఎంసీల వాటా
- తెలంగాణ లేఖపై స్పందించిన కృష్ణాబోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా జలాలను యథేచ్ఛగా వాడుకోవాలన్న ఏపీ ప్రయత్నాలకు నదీయాజమాన్యబోర్డు అడ్డుకట్ట వేసింది. ఇంతవరకు తీసుకున్నది చాలు.. ఇక నీటివిడుదలను నిలిపివేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు ఏపీ వాటా ముగిసిన దరిమిలా నీటి విడుదలను నిలిపివేయాలని బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు. 2017-18 నీటి సంవత్సరానికి సంబంధించి రెండు ప్రధాన జలాశయాల్లో తెలుగు రాష్ట్రాల నీటివినియోగంపై తెలంగాణ నీటి పారుదలశాఖ లెక్కలు తేల్చింది. మంగళవారం ఉదయం కృష్ణా బోర్డుకు ఈ లెక్కలను వివరిస్తూ లేఖ రాసింది. ఆ లెక్కలను పరిశీలించిన బోర్డు తదుపరి చర్యల్లో భాగంగా ఉత్తర్వులు జారీచేసింది. రెండు జలాశయాల పరిధిలో తెలంగాణకు ఇంకా 16.493 టీఎంసీల నీటిని వాడుకునేందుకు వాటా ఉన్నదని బోర్డు తన లేఖలో స్పష్టం చేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో క్రమేపీ నీటిమట్టం తగ్గుముఖం పడుతుండటంతో నీటి వినియోగ లెక్కలపై తెలంగాణ నీటిపారుదలశాఖ దృష్టిసారించింది. 2017-18 నీటి సంవత్సరానికి సంబంధించి కృష్ణాబేసిన్‌లో 522.82 టీఎంసీల నీటిలభ్యత ఉండగా.. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన 66:34 దామాషా ప్రకారం ఏపీకి 345.06 టీఎంసీలు, తెలంగాణకు 177.76 టీఎంసీల వాటా ఉన్నదని తెలంగాణ ఈఎన్సీ బోర్డుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 20టీఎంసీలను రికార్డుల్లో నమోదు చేసినదాని కంటే ఎక్కువ వాడుకున్నందున ఏపీ వినియోగ ఖాతాలో ఆ మేరకు కలుపాలని కోరారు. ఏపీ వినియోగం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. దీనికి అదనంగా ప్రస్తుతం శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్‌కు ఎగువన ఇంకా 36.180 టీఎంసీల నీటినిల్వ ఉందని.. వాటిల్లోనూ దామాషా ప్రకారం లెక్కలు తీస్తే ఏపీకి బేసిన్‌లో ఇంకా కేవలం 0.557 టీఎంసీలు మాత్రమే వాడుకునేందుకు వాటా మిగిలి ఉన్నదని, తెలంగాణకు ఇంకా 35.620 టీఎంసీల వాటా ఉన్నదని వివరించారు.

మండుతున్న ఎండలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది. తూర్పుభారత్ నుంచి వీస్తున్న వేడిగాలుల తీవ్రతతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 22 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నదని తెలిపింది. మార్చి మొదటివారంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే నమోదయ్యే అవకాశం ఉన్నది. మంగళవారం భద్రాచలంలో 38 డిగ్రీలు, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్‌లో 37 డిగ్రీలు, నిజామాబాద్, రామగుండంలో 36, హన్మకొండ, హైదరాబాద్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ సోమవారం సీపీఎస్ నాయకులతో సమావేశమయ్యారు. సీపీఎస్ ఉద్యోగులసమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాజీవ్‌శర్మ తెలిపారు.

ముఖ్యమంత్రితో టీఎంఎఫ్‌సీ చైర్మన్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ మంగళవారం సీఎం కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఆదిలాబాద్ పర్యటన విజయవంతం కావాలని కోరుతూ సీఎం చేతికి ఇమామే జామీన్ కట్టారు. ఈ సందర్భంగా రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో తెలంగాణ తరపున అతిథి గృహాల నిర్మాణం విషయం సీఎంతో ప్రస్తావించారు.

2 నుంచి ఏఈవో ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మార్చి రెండు నుంచి వ్యవసాయ విస్తరణాధికారులు గ్రేడ్-2 ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఇందుకోసం ఏఈవో అభ్యర్థుల జాబితాను విడుదల చేశామని కమిషన్ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. టీఆర్టీ పరీక్ష మూడోరోజు కూడా విజయవంతంగా పూర్తయినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

కులవృత్తులకు ఉపయోగపడే మొక్కలు నాటాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో బీసీ కులవృత్తులకు ఉపయోగపడే మొక్కలను విరివిగా నాటాలని తెలంగాణ అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ అధికారులకు సూచించింది. మేదరి కులస్తుల వృత్తిని ప్రోత్సహించడానికి వెదురు సరఫరా పెంచాలని ఆదేశించింది. ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో కమిటీ సమావేశమైంది. ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీలు లక్ష్మీనారాయణ, ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు ఆధార్ అనుసంధానం వేగవంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూమి పత్రాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం సందర్భంగా రైతుల ఆధార్ కార్డుల వివరాలను తీసుకున్న రెవెన్యూ అధికారులు రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాల్లో, వారి రెవెన్యూ ఖాతాల్లో ఆధార్ నంబర్‌ను పొందుపరుస్తున్నారు. టైటిల్ డీడ్‌తో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకంపై రైతులు, వారి భూముల వివరాలతో పాటు వారి ఆధార్ నంబర్ కూడా ముద్రిస్తారు. ఇందుకోసం ఈ వివరాలన్నీ అధికారులు కంప్యూటర్లలో అప్‌లోడ్ చేస్తున్నారు.

హైకోర్టులో న్యాయమూర్తులను నియమించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టులో ఖాళీ జడ్జి పోస్టుల భర్తీతో పాటు 2012లోపు దిగువ కోర్టుల్లోని పెండింగ్ కేసులను మార్చి నాటికి పరిష్కరించాలనే సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం మార్చి 1,2 తేదీల్లో కోర్టు విధులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. మంగళవారం న్యాయవాదులు నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.

బీమా కల్పనపై న్యాయవాదుల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయవాదులకు ఆరోగ్య, ప్రమాదబీమా కల్పించడంపై సీఎం కేసీఆర్‌కు తెలంగాణ న్యాయవాదులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో కీలకపాత్ర పోషించిన ట్రస్ట్ చైర్మన్, అడ్వకేట్ జనరల్ డీ ప్రకాశ్‌రెడ్డిని హైకోర్టులో న్యాయవాదులు సన్మానించారు.

మార్చిలో కాళేశ్వరానికి గోదావరి బోర్డు చైర్మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ తీరును పరిశీలించేందుకు గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్ సాహు వచ్చేనెల 15-17 తేదీల్లో ప్రాజెక్టు పనులు జరిగే ప్రాంతాల్లో పర్యటిస్తారు. గోదావరిపై నిర్మిస్తున్న వరుస బ్యారేజీలతోపాటు మూడు ప్రధాన పంపుహౌజ్‌లు, ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నిర్మించిన భారీ సొరంగమార్గం, మోటర్ల బిగింపు తదితర పనులను ఆయన పరిశీలించనున్నారు.

నవయుగకు కాళేశ్వరం ప్యాకేజీ-6 పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా లింకు-2లోని ప్యాకేజీ-6 పనులన్నింటిని పూర్తిచేసే బాధ్యతను నవయుగ ఇంజినీరింగ్ కంపెనీకి అప్పగించేందుకు అనుమతినిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్యాకేజీ పనుల్ని నవయుగ-పటేల్-బీహెచ్ఈఎల్ కంపెనీలు జాయింట్ వెంచర్‌గా దక్కించుకున్నాయి.

బుధవారం
28•2•2018
హైదరాబాద్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

సింగరేణిని ప్రైవేటీకరించం

అవసరమైతే కేంద్రం వాటాను కొంటాం

- విద్యుత్, ఆర్టీసీని సైతం ప్రైవేటుపరం కానీయం
- సింగరేణి కార్మికుల సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- కారుణ్య నియామకాలపై స్పష్టతనిచ్చిన సీఎం
- ఆరు భూగర్భ గనులకు ప్రారంభోత్సవం

మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:



సింగరేణి గనుల ప్రైవేటీకరణకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేదిలేదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తేల్చిచెప్పారు. సింగరేణిపై కేంద్రానికి ఏ మాత్రం పెత్తనం లేదని అన్నారు. అవసరమైతే సింగరేణిలో కేంద్ర ప్రభుత్వ వాటాను సైతం కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఇది తమాషాకు చెప్పే ముచ్చట కాదన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో సింగరేణి కార్మికులనుద్దేశించి సీఎం ప్రసంగించారు. అంతకు ముందు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ముర్మూరు గ్రామంలో రామగుండం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిపొడవునా 65 టీఎంసీల నీళ్లతో గోదావరి జలకళ సంతరించుకుంటుందని, రానున్న రోజుల్లో పెద్దపల్లి ధనిక జిల్లా కాబోతున్నదని ఆ సందర్భంగా వ్యాఖ్యానించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో నిర్మిస్తున్న చనాక-కొరాట ప్రాజెక్టు పనులను పరిశీలించి, పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ చేరుకుని, స్థానిక డైట్ కాలేజీ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొన్నారు. రైతు సంక్షోభానికి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలే కారణమని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఈ సభలో ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. ఇంకా రైతుల ఓపికను పరీక్షించడం మంచిదికాదని జాతీయపార్టీలకు హితవు పలికారు. అవసరమైతే రైతుల తరపున తానే ఉద్యమిస్తానని ప్రకటించారు. చివరిగా శ్రీరాంపూర్‌లో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగిస్తూ, సింగరేణి కార్మికులపై వరాల వాన కురిపించారు.

మూడు జంబో సంస్థల్లో సింగరేణి ప్రధానం

సింగరేణి, విద్యుత్, ఆర్టీసీలను రాష్ట్ర ప్రభుత్వానికి జంబో సంస్థలుగా సీఎం అభివర్ణించారు. ఈ మూడింటినీ బలోపేతం చేస్తామే తప్ప ప్రైవేటుపరం కానివ్వబోమని నొక్కిచెప్పారు. అందులో ప్రధానమైంది సింగరేణి అన్నారు. 'ఎక్కడా ఏమీ లేనప్పుడు అన్నం పెట్టింది సింగరేణి సంస్థే. చుట్టుపక్కల ప్రజలు ఎంతోమంది ఇక్కడికి వచ్చి సింగరేణిపై బతికారు. అలాంటి సింగరేణిని వదులుకోబోము' అని స్పష్టంచేశారు. 'ఇంకోటి విద్యుత్ సంస్థ. విద్యుత్ ఉత్పత్తి ఆరు వేల మెగావాట్లకు పెంచాలనుకున్నప్పుడు మాకివ్వాలని ప్రైవేటువాళ్లు అడిగారు. కానీ ఇవ్వనని కరాఖండిగా చెప్పాను' అని సీఎం తెలిపారు. అందులో ప్రస్తుతం పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన జరిగిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'ఆర్టీసీలో సైతం 50 వేల పైచిలుకు కార్మికులున్నారు. సీమాంధ్ర హయాంలో వాళ్ల మెడపై కత్తి వేలాడుతుండేది. ఆ సంస్థను సైతం బలోపేతం చేశాం. ప్రైవేటుపరం కానీయం' అని చెప్పారు.

వారసత్వ ఉద్యోగాలు అనే మాటలేకుండా కేవలం కారుణ్య నియామకాల పద్ధతిలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్

మిగతా 4వ పేజీలో

సింగరేణి కార్మికులపై సీఎం వరాల జల్లు

- కార్మికుల కోసం పదివేల క్వార్టర్ల నిర్మాణం
- 60 వేలమంది రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యం
- రిటైర్డ్ ఉద్యోగులకు త్వరలో పెన్షన్ పెంచుతాం
- సింగరేణి భూముల్లో కట్టుకున్న ఇండ్లకు పట్టాలు
- ఇకపై కార్మికులకు నీటి, విద్యుత్ బిల్లులు రద్దు
- మూడు జిల్లాల్లో కేసీఆర్ సుడిగాలి పర్యటన

మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో సింగరేణి కార్మికుల ఆత్మీయసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

దేవాదుల-తుపాకులగూడెం కార్పొరేషన్‌కు గ్రీన్‌సిగ్నల్

- నిధుల సేకరణ ఇక సులువు
- నీటిపారుదలశాఖ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఓకే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గోదావరి జలాల సద్వినియోగం కోసం ప్రభుత్వం చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకంతోపాటు తుపాకులగూడెం బరాజ్ పనులు త్వరితగతిన పూర్తిచేయడంలో మరో కీలకమైన ముందడుగు పడింది. నిధుల ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. దేవాదుల, తుపాకులగూడెంకు బ్యాంకులు, ఆర్థికసంస్థల నుంచి నిధుల

మిగతా 12వ పేజీలో

ముంబై చేరిన నిర్జీవ చాందినీ!


ముంబైలో ప్రముఖ నటి శ్రీదేవి ఇంటి వద్ద ఆమె అభిమానులు ఏర్పాటుచేసిన కటౌట్


మంగళవారం రాత్రి దుబాయ్ నుంచి ప్రత్యేక విమానంలో ముంబైకి తీసుకు వచ్చిన ప్రముఖ నటి శ్రీదేవి పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో ఆమె నివాసానికి చేరుస్తున్న దృశ్యం

- ప్రమాదమేనంటూ కేసు మూసివేసిన దుబాయ్
- శ్రీదేవి భౌతికకాయం అప్పగింత.. నేడు అంత్యక్రియలు

గగన వీధులనుంచి దేవత వచ్చింది.. కానీ విరిసే నవ్వుల్లేవు! దశాబ్దాలపాటు వెండితెరనేలిన సామ్రాజ్ఞి విమానం దిగింది.. కానీ ఆ పైడిబొమ్మలో ప్రాణం లేదు! విమానాశ్రయానికి అభిమానులు పోటెత్తారు.. ఆమె ఆఖరి చూపుకోసం! కెమెరాలు మెరుపులు కురిపించాయి.. ఎవ్వరూ ఎప్పుడూ ఊహించని విషాదభరిత సన్నివేశాన్ని చిత్రించేందుకు! సినీప్రపంచాన్ని తన అభినయంతో అందంతో శాసించి.. దుబాయ్‌లో తుదిశ్వాస విడిచిన అతిలోక సుందరి శ్రీదేవి పార్థివదేహం మంగళవారం రాత్రి ఎట్టకేలకు ముంబై చేరుకున్న వేళ.. బరువెక్కిన హృదయాలతో అంతా ఉద్విగ్నమే! మరణానికి కారణమేంటో అధికారులు తేల్చినా.. మరణం వెనుక కారణాలపై అంతుచిక్కని ప్రశ్నలే! వాటన్నింటినీ పట్టించుకోకుండా దీర్ఘనిద్రలో ఉన్న శ్రీదేవి.. బుధవారం మధ్యాహ్నం జరిగే అంత్యక్రియలతో భారత సినీ చరిత్రలో తన అధ్యాయాన్ని ముగించుకుని వెళ్లిపోనుంది!

5

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

మైనార్టీల విద్య, అభివృద్ధి కోసం చర్యలు భేష్


కేంద్రమంత్రి నక్వీ


కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు

- కేంద్ర మంత్రి నక్వీ అభినందనలు
- తాగునీటి సరఫరాలో రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలి: కేంద్ర ఉన్నతాధికారి
- మిషన్ భగీరథ.. ఓ చరిత్ర: కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలపై పార్టీలకు అతీతంగా కేంద్రం సహా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, నిపుణులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇవి చరిత్ర సృష్టిస్తున్నాయని, అన్ని రాష్ట్రాలకు, కేంద్రానికి కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రముఖులు అభినందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ, కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అదనపు సలహాదారు దినేశ్‌చంద్,

మిగతా 11వ పేజీలో

- ఆల్ ది బెస్ట్

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు: ఇంటర్‌బోర్డు

12



ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానంలో బహిరంగసభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. వేదికపై మంత్రులు జోగు రామన్న, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ కే కేశవరావు, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, బాపురావు, రేఖానాయక్, విఠల్‌రెడ్డి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, టీడీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ తదితరులు కూడా ఉన్నారు.

రైతుల తరఫున నేనే ఉద్యమిస్తా!

- రైతుల ఓపికను ఇంకా పరీక్షించొద్దు
- జాతీయ పార్టీలకు అది క్షేమం కాదు
- ఆరు నెలల్లో చెనాక కొరాట పనులు పూర్తిచేస్తాం
- చల్లటి జిల్లాలో అశాంతి రేపాలని చూస్తున్నారు
- ఆదిలాబాద్ బహిరంగసభలో సీఎం కేసీఆర్

నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:

రైతు సంక్షోభానికి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలే కారణమని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఉద్ఘాటించారు. ఇంకా రైతుల ఓపికను పరీక్షించడం మంచిదికాదని జాతీయపార్టీలకు హితవు పలికారు. అవసరమైతే రైతుల తరఫున తానే ఉద్యమిస్తానని ప్రకటించారు. మంగళవారం ఆదిలాబాద్ డైట్ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తూ.. 'నిన్న నేను జాతీయ పార్టీలపై మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉంటా. గడిచిన 70 ఏం డ్లలో పెన్‌గంగ, గోదావరి నదుల నుంచి వేల టీఎంసీల నీరు సముద్రం పాలైంది. దేశంలో ఏటా 75 వేల టీఎంసీల నీటిని ప్రకృతి ఇస్తే, 24-25వేల టీఎంసీలు మించి వాడుకోవడం లేదు. రెండు జాతీయ పార్టీలు సిగ్గుతో తలదించుకోవాలి. చిల్లర మల్లర మాటలు కాదు. దమ్ముంటే కేసీఆర్ మాటకు జవాబు ఇవ్వాలి. 70 ఏండ్లు గాడిద పండ్లు తోమిండ్రా?' అని మండిపడ్డారు. 'రైతుల ఆత్మహత్యలకు కారకులెవరు? రైతుల పంటలకు మద్దతు ధర ఇస్తే నీ అయ్య ముల్లేమైనా పోతుందా? అని నిలదీశారు. ఉద్యోగులకు డీఏ పెంచినట్టు రైతులకు మద్దతు ధర ఎందుకు పెంచరని ప్రశ్నించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తమ ఎంపీలు రైతు సమస్యలపై నిలదీస్తారని చెప్పారు. 'ప్రధానమంత్రికి కూడా చెప్పాను. రైతుల ఓపికను ఇంకా పరీక్షించటం జాతీయ పార్టీలకు క్షేమంకాదు. మీ స్టోరీలను చాలా విన్నారు. అవసరమైతే రైతుల తరఫున నేనే ఉద్యమిస్తా.. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది' అన్నారు. పంటలకు మద్దతు ధర రాబట్టడానికే రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేశామని, రైతులను ధనిక రైతులుగా మార్చేందుకు కృషిచేస్తానని స్పష్టంచేశారు.

ఎల్‌ఈడీ వెలుగులు మా ఘనత

'నేను 30ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నా. కాంగ్రెస్ అధికారంలో ఉంటే టీడీపీ.. టీడీపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నవారు ఎండిన కంకులు, వరి ఆకులతో వచ్చేవారు. కానీ గ్రామాల్లో కరంటు రాలేదు. గోండు, కొలాం, ఆదివాసీ, గిరిజనగూడేల్లోని ప్రధాన కూడళ్లలో ఎల్‌ఈడీ బల్బులు తెచ్చి 24గంటల కరంటు ఇచ్చిన ఘనత గులాబీ కండువ వేసుకున్న మాదే' అని ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా రైతులకు 24గంటల విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు.



పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు రూ.315 కోట్లు

పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు రూ.315 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ వేదికపైనుంచి ప్రకటించారు. గోముత్రి వద్ద 0.7 టీఎంసీ రిజర్వాయర్ కోసం రూ.210 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. కడెంకు సప్లిమెంట్ వాటర్‌కోసం 5.5 టీఎంసీల కుప్టి ప్రాజెక్టును రూ.875 కోట్లతో మంజూరు చేశామని తెలిపారు. బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాలకు ఇది అద్భుత ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ప్రస్తుత నిర్మల్ జిల్లాలోని బాసర అమ్మవారి ఆలయం అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని సాహసంచేసి భూ రికార్డులను ప్రక్షాళన చేశామని తెలిపారు. దేశంలో, ఆ మాటకొస్తే ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా రైతులకు పంట పెట్టుబడికి రూ.12000కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. యాదవులకు రూ.4వేల కోట్లతో కోటి గొర్రెలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రెండేండ్ల తర్వాత దేశంలో ధనవంతులైన గొల్లకుర్మలు తెలంగాణలోనే ఉన్నారని చూపిస్తామన్నారు.

కొట్లాటలొద్దు.. సుఖసంతోషాలతో బతుకుదాం

'మంచి జిల్లా, చల్లటి జిల్లా. గిరిజనులు ఉన్న జిల్లా. కోలాం, ప్రదాన్‌లు, గోండు, లంబాడాలు అన్నిరకాల ప్రజలు బతికే జిల్లాలో మన మధ్య జుట్లు ముడేసి అశాంతి నెలకొల్పాలని చూస్తున్నరు. వారికి ప్రజల్లో చెప్పుకోవటానికి ఏమీలేదు. ఈసారి ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు 106 సీట్లు వస్తయని సర్వేలు చెప్తున్నయి. వారికి ఓట్లేయరని తెలుసు. ఇది తెలిసి అశాంతి నెలకొల్పాలని చూస్తున్నరు' అని సీఎం విమర్శించారు. తాగ్యాలు, బలిదానాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని పాడిపంటలతో పచ్చని తెలంగాణగా మార్చుకోవాలని, సుఖశాంతులతో బతుకాలని అన్నారు. అంతేకానీ మనలో మనం కొట్లాడుకోరాదని హితవుపలికారు.

లోయర్ పెన్‌గంగ ప్రతిష్టంభనను తొలిగించాం

లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు గత ప్రభుత్వాల కాలంలో పెద్ద ఎలక్షన్ డ్రామాగా మారిందని సీఎం విమర్శించారు. 'నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలివితక్కువతనం వల్లే ఐదు దశాబ్దాల కల సాకారంకాలేదు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక నేనే స్వయంగా మహారాష్ట్రకు రెండు మూడుసార్లు వెళ్లి ముఖ్యమంత్రిని కలిశా. అక్కడికి మంత్రి హరీశ్‌రావును, అధికారులను పంపించాను. నేను, మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ నగేశ్ కలిసి వెళ్లి అక్కడి మంత్రులతో మాట్లాడాం. ఇద్దరికీ ఉపయోగపడేలా సమస్యను పరిష్కరించాం. మీరు బతుకండి.. మమ్మల్ని బతుకనీయండి.. అని కోరాం. వారు ఒప్పుకున్నారు' అని సీఎం వివరించారు. పెన్‌గంగ ప్రాజెక్టుతో వచ్చే ఆరు నెలల్లో ఆదిలాబాద్ జిల్లాలో 70 వేల ఎకరాలకు నీళ్లు రాబోతున్నాయన్నారు. జూన్, జూలై తర్వాత ప్రాజెక్టు పూర్తయ్యేలా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు పనుల్లో వేగం పెంచాలని ఆదేశాలిచ్చానని తెలిపారు. తానే వచ్చి ప్రారంభోత్సవం చేస్తానని, ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాకు నీళ్లు పారించి తమది ఎలాంటి పనిమంతుల ప్రభుత్వమో రుజువు చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు.

తెలంగాణకే కశ్మీర్.. ఆదిలాబాద్

ఆదిలాబాద్ నియోజకవర్గం తెలంగాణకే కాశ్మీర్‌లాంటిదని, కానీ, ఈ జిల్లాలో సమైక్య రాష్ట్రంలో జరుగాల్సిన అభివృద్ధి జరుగలేదని సీఎం కేసీఆర్ అన్నారు. సాత్నాల ప్రాజెక్టును చాలా ఏండ్లు పట్టించుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాల్వల ఆధునీకరణకు రూ.28 కోట్లు మంజూరు చేసి, 24వేల ఎకరాలకు సాత్నాల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందించే పరిస్థితి తెచ్చామని గుర్తుచేశారు. 28 చెరువులకు నిధులు ఇచ్చామని, 20 వేల ఎకరాల ఆయకట్టు వచ్చిందని అన్నారు. 18 చెరువులు కావాలని కొత్తగా ప్రతిపాదన ఉందని, దీనిని పరిశీలించాలని అధికారులకు చెప్పామని, త్వరలోనే వాటిని మంజూరు చేస్తామని చెప్పారు.

త్వరలో ఆదిలాబాద్‌లో డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్

'జోగు రామన్న చాలా హుషారు. లోయర్‌పెన్‌గంగ ఇస్తే చాలన్నారు. రూ.200 కోట్లు పనులు అడిగారు. ఆయన అడిగినట్లు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు పెద్ద మాట. ఆదిలాబాద్‌లో 350ఎకరాల జాగా ఉంది. ఇందులో త్వరలోనే మినీ ఏరోడ్రమ్ ఏర్పాటుచేస్తాం' అని చెప్పారు. బీఎస్సీ అగ్రికల్చరల్ కాలేజీ మంజూరు చేస్తున్నానని, త్వరలోనే దాన్ని ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. 'జోగు రామన్నకు తెలంగాణ సంస్కారం ఉంది. బోథ్ నియోజకవర్గంలో మరాఠీ మాట్లాడేవారు 30% ఉంటరని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చెప్పారు. మరాఠీ జూనియర్ కాలేజీ కావాలని జోగు రామన్న కోరారు. దీన్ని మంజూరుచేసి తెలంగాణ కాస్మోపాలిటన్ సంస్కృతి భారతదేశమంత గొప్పగా ఉంటుందని చాటుతాం' అన్నారు.



ఆదిలాబాద్ డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగసభకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు

అభివృద్ధికి నిధుల వర్షం

'గిరిజనుల అభివృద్ధికి రూ.78 కోట్లు, దళితుల అభివృద్ధికి రూ.7కోట్లు, మైనార్టీ డెవలప్‌మెంట్‌కోసం రూ.15కోట్లు కోరారని, వాటిని మంజూరు చేస్తున్నానని సీఎం తెలిపారు. 'ఆదిలాబాద్ బాగా అభివృద్ధి చెందుతున్న పట్టణం. అర్బన్ డెవలప్‌మెంట్ నుంచి రూ.60కోట్లు ఇప్పటికే మంజూరుచేశాం. అదనంగా మరో రూ.25కోట్లు మంజూరు చేస్తున్నా' అని ప్రకటించారు. ఆదిలాబాద్ పట్టణంలో టౌన్‌హాల్ కూడా నిర్మించాలన్నారు. 73 పంచాయతీలకు రూ.75కోట్లు మంజూరు చేస్తున్నానని చెప్పారు. నిర్మల్ వచ్చినప్పుడు బోథ్ నియోజకవర్గానికి కూడా నిధులు మంజూరుచేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి వెయ్యి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేశారు. 'తెలంగాణ మంచి ధనవంతమైన రాష్ట్రం. ఈ రాష్ట్రం దిశదశ ఏవిధంగా ఉండాలో రాత్రిబవళ్లు కష్టపడి పనిచేస్తున్నాం. ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గంలో లక్ష 30వేల ఎకరాలకు నీళ్లు అందిస్తాం' అని సీఎం తెలిపారు.

ఎండిపోని నిండు గోదారి

- నదిలో 200 కి.మీ. 65 టీఎంసీలతో జల కళ
- మన తలరాతలు మనమే మార్చుకుందాం
- ఎఫ్‌సీఐ పునరుద్ధరణ, ఎన్టీపీసీ నూతన ప్లాంట్‌తో ఉపాధి కల్పన
- రామగుండం ఎత్తిపోతల పథకం శంకుస్థాపనలో సీఎం కే చంద్రశేఖర్‌రావు

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎల్లంపల్లి ప్రాజెక్టు 365 రోజులపాటు నిత్యకల్యాణం పచ్చతోరణం అన్న చందాన నిండుగా ఉంటుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. గోదావరి నది 200 కిలోమీటర్ల పొడవున 65 టీఎంసీలతో జలకళలాడుతుందని చెప్పారు. 'తలాపున పారుతోంది గోదావరి.. మన చేను, మన చెలక ఎడారి' అని సమైక్య రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సదాశివుడు రాసిన పాట పాడుకున్నామని, నేడు స్వరాష్ట్రంలో గోదావరిపై ప్రాజెక్టు నిర్మించుకొని 'తలాపున పారుతోంది గోదారి.. మన చేను.. మన చెలకకు నీళ్లోయి' అని పాడుకునేలా మన తలరాతలను మనమే మార్చుకుందామని అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో రోజు కరీంనగర్ నుంచి ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూరు గ్రామానికి చేరుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి రామగుండం నియోజకవర్గంలోని రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని 20 గ్రామాలకు సాగునీటిని అందించేందుకు రూ.75.74కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాలకు ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు కే కేశవరావు, పెద్దపల్లి ఎంపీ బాల్కసుమన్, రామగుండం ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణతో కలిసి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా భవిష్యత్‌లో ఆర్థికాభివృద్ధి సాధించే జిల్లా కాబోతున్నదని చెప్పారు. 'పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటస్వామి బతికున్న కాలంలో ఎఫ్‌సీఐ పునరుద్ధరణకు అనేక ప్రయత్నాలు చేశారు. అప్పుడు కాలేదు. ఇప్పుడు ఎఫ్‌సీఐ పునరుద్ధరణ వేగంగా జరుగుతున్నది' అని తెలిపారు. ఎఫ్‌సీఐ నిర్మాణం పూర్తయితే 6 వేల నుంచి 7వేల మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర డిమాండ్ మేరకు ఎన్టీపీసీలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తున్నామని, మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీపీసీలో 4 వేల మెగావాట్లకు అడుగులు పడుతుండడం, ఎఫ్‌సీఐ పునరుద్ధరణ వేగంగా జరుగుతుండడంతోపాటు కాళేశ్వరం దేవుడి దయవల్ల రానున్న రోజుల్లో పుష్కలమైన నీళ్లతో 365 రోజులు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిత్యకల్యాణం, పచ్చతోరణంలా కనిపిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. మనం బతికున్నంత కాలం ఎండిపోయే పరిస్థితి లేదు కనుక రానున్న రోజుల్లో పెద్దపల్లి జిల్లాలో పచ్చని పంటలు, మరోవైపు పరిశ్రమలతో అద్భుతమైన ధనిక జిల్లా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి నది ధర్మపురి శబరిమట్ నుంచి మొదలుకొని ఖమ్మంజిల్లా కొత్తూరు వరకు శాశ్వతంగా 200 కిలోమీటర్లు మేర 65 టీఎంసీల నీటితో జలకళ సంతరించుకుంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పట్టుదలతో ఎత్తిపోతల అనుమతికోసం పలుమార్లు తన వద్దకు వచ్చారని గుర్తుచేశారు. ఈ పథకాన్ని ఐదు నెలల్లో పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ప్రభుత్వ సలహాదారు వివేక్, ఐడీసీ చైర్మన్ శంకర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ దామోదర్, టీఎస్‌టీఎస్ చైర్మన్ రాకేశ్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రామగుండం మేయర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ముర్మూరులో రామగుండం ఎత్తిపోతల పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ బాల్కసుమన్, ప్రభుత్వ సలహాదారు వివేక్, ఐడీసీ చైర్మన్ శంకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, మనోహర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ప్రగతిస్టేడియంలో సింగరేణి కార్మికుల సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీలు కల్వకుంట్ల కవిత, బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్యేలు ఎన్ దివాకర్‌రావు, కోవ లక్ష్మి, దుర్గం చిన్నయ్య, సింగరేణి సీఎండీ శ్రీధర్, టీజీబీకేఎస్ నేతలు కనకరాజు, మిర్యాల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రగతి స్టేడియం నుంచి ఆరు భూగర్భ గనులను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు బాల్క సుమన్, పొంగులేటి, విప్ ఓదెలు, ఎమ్మెల్యేలు జలగం, పాయం వెంకటేశ్వర్లు, దుర్గం చిన్నయ్య తదితరులు ఉన్నారు.

సింగరేణిని ప్రైవేటీకరించం

మూడోపేజీ తరువాయి...

హామీ ఇచ్చారు. మార్చి మొదటి వారంనుంచి కొత్త మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తామని, త్వరలో వెబ్‌సైట్‌లో అప్లికేషన్ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గతంలో డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ అని పేరు పెట్టినందుకు ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. దేశంలో, రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సంస్థల్లో కారుణ్య నియామకాలు అమలవుతున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. నూతన బోర్డులో కేవలం సింగరేణి వైద్యులే కాకుండా గాంధీ, ఉస్మానియా, నిమ్స్ నుంచి సైతం నియమిస్తామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా సీఎండీనుద్దేశించి మాట్లాడుతూ మెడికల్ బోర్డు విషయాల్లో అవినీతి జరుగుతున్నట్టు తన వద్ద ఇంటెలిజెన్స్ సమాచారం ఉందని, అవినీతి పీడ పోవాలంటే దాని ప్రక్షాళన తప్పదని చెప్పారు.

లంచం అడిగితే చెప్పుతో కొట్టుండ్రి...

మెడికల్‌బోర్డు, ఇతర వ్యవహారాల్లో అధికారులు తినడానికి రుచిమరిగారని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. నాయకులుకూడా భోంచేసేందుకు చూస్తున్నారన్నారు. 'లంచం అడిగినవారిని పొట్టుపొట్టు తన్నుండ్రి. చెప్పుతో కొట్టుండ్రి. మీకేమైనా అయితే నావద్దకు రండి' అని కార్మికుల హర్షధ్వానాల మధ్య సీఎం పిలుపునిచ్చారు. కార్మికుల రక్తం తాగేవారు రాక్షసులు తప్ప నాయకులు కాదన్నారు. పార్టీల చందాలు రూపాయికన్నా ఎక్కువ ఇవ్వరాదని, రేపటినుంచే సింగరేణిలో ఈ విధానం అమలుచేయాలని అక్కడికక్కడే సీఎండీని ఆదేశించారు.

సింగరేణి కార్మికులపై వరాల జల్లు

సింగరేణి కార్మికులపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. తాను సింగరేణి కార్మికులు నివాసముండే కాలనీకి వెళ్లి చూశానని, 1970కి ముందు కట్టిన క్వార్టర్లు ఏమాత్రం బాగోలేవని అన్నారు. 1980కి ముందు కట్టిన వాటిలో 5500 క్వార్టర్లు ఉన్నాయని, అందులో కొన్ని మరీ ఇరుకుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా 10 వేల క్వార్టర్లను వరుసక్రమంలో నిర్మిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇందుకు యాజమాన్యం రూ.400 కోట్లు ఇస్తుందని, వెంటనే దానిపై ఆదేశాలు జారీచేస్తామని ప్రకటించారు. తనతో కొందరు రిటైర్డ్ కార్మికులు మాట్లాడుతూ తమకు కేవలం రూ.350 పింఛన్ వస్తున్నదని తెలిపారని, కనీసం హెల్త్‌కార్డు కూడా లేదని చెప్పారని పేర్కొన్నారు. సింగరేణిలో రిటైర్డ్ కార్మికులు సుమారు 60వేల మంది ఉన్నారన్న సీఎం.. వారందరికీ సింగరేణి ఉచిత వైద్యసేవలు అందిస్తుందని ప్రకటించారు. కొంత సమయం తీసుకుని పెన్షన్ పెంచేందుకు కూడా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

సింగరేణి భూముల్లో ఇండ్లకు పట్టాలు

శ్రీరాంపూర్ ఏరియాలోని 156 ఎకరాల సింగరేణి భూముల్లో పలువురు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు ఇండ్లు కట్టుకున్నారని, వారికి పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎంపీ బాల్క సుమన్ కోరినట్టు సీఎం కార్మికులకు చెప్పారు. దానికి చిన్న సమస్య ఉందని, అయినా, నెలలో పట్టాలు వచ్చేలా చూస్తామని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక నేతలు, టీబీజీకేఎస్ నాయకులు వచ్చి సర్టిఫికెట్లు ఇస్తారని ఆయన హామీ ఇచ్చారు. బెల్లంపల్లి ఏరియాతోపాటు మరికొన్ని చోట్ల పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వలేదని, వాటన్నింటినీ పరిష్కరిస్తానని చెప్పారు. ఈ విషయంలో సీఎండీ శ్రీధర్‌కు ఆదేశాలు జారీచేశారు.

ఆరు భూగర్భ గనుల ప్రారంభం

సింగరేణివ్యాప్తంగా ఆరు భూగర్భ గనులను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి స్టేడియం నుంచి ప్రారంభించారు. కాసిపేట 2 ఇంక్లయిన్, కేకే 6 ఇంక్లయిన్, కొండాపురం గని, రాంపురం షాఫ్ట్ బ్లాక్, కేటీకే 3, 5 ఇంక్లయిన్‌లకు వేదికవద్దే ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అంతకుముందు నూతన కలెక్టరేట్ భవనానికి శంకుస్థాపన చేశారు. సింగరేణి కార్మికుల కాలనీలో పర్యటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాలచారి, జీ వివేకానంద, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీలు కల్వకుంట్ల కవిత, బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పురాణం సతీశ్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, విప్ నల్లాల ఓదెలు, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కోవ లక్ష్మీ, పుట్ట మధు, జలగం వెంకట్‌రావు, పాయం వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ నేతలు వెంకట్రావు, కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజిరెడ్డి, మాజీ మంత్రి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కాలనీలో సీఎం కేసీఆర్

సీసీసీ నస్పూర్: శ్రీరాంపూర్‌కు వచ్చిన సీఎం కేసీఆర్.. కార్మికుల స్థితిగతులు తెలుసుకునేందుకు స్వయంగా వారి కాలనీల్లో కలియదిరిగారు. ఏరియా స్టోర్స్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోతరాజుల రాజేందర్ దంపతులు కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి తమ క్వార్టర్‌లోకి సాదరంగా స్వాగతించారు. ఇంట్లోని గదులన్నీ తిరిగి చూసిన కేసీఆర్.. సౌకర్యాలు, కుటుంబం గురించి తెలుసుకున్నారు. ఇల్లు చిన్నగా ఉండటం చూసి, మళ్లీ కట్టించే గృహాలు డబుల్ బెడ్‌రూంతో, అన్ని సౌకర్యాలతో ఉండాలని సీఎండీ శ్రీధర్‌ను ఆదేశించారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌తో రాజేందర్-విజయలక్ష్మి దంపతులు

మా జన్మధన్యమైంది

సీఎం సార్‌ను చూడడంతో మా జన్మధన్యమైంది. ఆయన మా ఇంటికి రావడం పూర్వజన్మసుకృతం. పిల్లలు, తల్లిదండ్రులు ఇంటికి వస్తే స్థలం సరిపోదు కాబట్టి మళ్లీ కట్టించేవి పెద్దగా ఉండాలని సీఎంను కోరాం.

– పోతరాజుల విజయలక్ష్మి, రాజేందర్



స్వేచ్ఛావిహంగం కాదు.. పంజరంలోని పక్షి

శ్రీదేవి జీవితంపై రామ్‌గోపాల్ వర్మ

న్యూఢిల్లీ: సినీ వెలుగుజిలుగుల్లో తళుక్కుమన్న శ్రీదేవి నిజజీవితం మాత్రం విషాదాలమయమని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. శ్రీదేవి మరణం తర్వాత వరుసగా ట్విట్టర్‌లో తన భావోద్వేగాల్ని పంచుకుంటున్న వర్మ మంగళవారం మరో నోట్ విడుల చేశారు. శ్రీదేవి జీవితపు రెండో పార్శ్వం గురించి ఆయన ఏం చెప్పారంటే.. 'బయటకు కనిపించే కోణాలకు భిన్నంగా వాస్తవిక జీవితాలుంటాయి. శ్రీదేవి జీవితం కూడా అందుకు మినహాయింపేమీ కాదు. తన తండ్రి మరణం వరకు స్వేచ్ఛా విహంగంలా బతికిన శ్రీదేవి, తర్వాత పంజరంలో పక్షిగా మారారు. అందుకు ఆమె తల్లి అతిజాగ్రత్తే కారణం. అప్పట్లో చాలామంది నటులకు పారితోషికంలో ఎక్కువ భాగాన్ని నల్లధనం రూపంలో చెల్లించేవారు. శ్రీదేవి సంపాదన విషయంలో ఆమె తండ్రి బంధువులు, సంబంధీకులను నమ్మారు. ఆయన చనిపోయిన తర్వాత అంతా మోసగించారు. అతిజాగ్రత్తనో, అమాయకత్వమో.. శ్రీదేవి సంపాదనను ఆమె తల్లి వివాదాస్పద ఆస్తుల్లో పెట్టుబడి పెట్టారు. అదంతా ఊడ్చుకుపోయింది. బోనీకపూర్ పరిచయమయ్యేనాటికి ఆమె చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. బోనీ కూడా అప్పటికే అప్పుల కారణంగా పూర్తిగా నష్టపోయి ఉన్నారు. అమెరికాలో చేసిన సర్జరీ వికటించి శ్రీదేవి తల్లి మతిస్థిమితం కోల్పోయింది. అదే అదునుగా శ్రీదేవికి మిగిలిన ఆస్తుల్లో వాటా కావాలంటూ ఆమె సోదరి శ్రీలత కోర్టుకెక్కింది. అలాంటి దశలో శ్రీదేవికి బోనీకపూర్ నిజమైన తోడుగా కనిపిస్తే, ఆయన తల్లికి శ్రీదేవి రాక్షసిలా కనిపించింది. చివరిదాకా శ్రీదేవిని శత్రువులా చూసిన బోనీ తల్లి తన బంధువులందరికీ అలాగే నూరిపోసింది. ఓసారి ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో అందరిముందే శ్రీదేవి కడుపుపై పిడిగుద్దులు కురిపించిందామె. ప్రతీ నటికి పెరుగుతున్న వయసుతో కలవరం (అందాన్ని కోల్పోతానని) మొదలవుతుంది. శ్రీదేవి కూడా అందుకోసమే సర్జరీలను ఆశ్రయించారు. కెమెరా ముందే కాదు.. నిజజీవితానికి, తన లోపలి ఆందోళనలకూ మేకప్ వేసుకుని బతికేశారు'.

మీడియా తీరుపై సెలబ్రిటీల ఆగ్రహం


ఫర్హాన్ అఖ్తర్


మంగళ వారం ముంబైలోని అనిల్ కపూర్ నివాసానికి వచ్చిన కమల్, రజనీ, వెంకటేశ్

న్యూఢిల్లీ: సంచలనాల కోసం శ్రీదేవి మృతికి సంబంధించి ఆధార రహిత కథనాలు ప్రసారం చేస్తున్న మీడియాపై సెలబ్రిటీలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విషాద సమయంలో మీడియా నిర్దయగా వ్యవహరిస్తున్నదని పలువురు ప్రముఖులు ధ్వజమెత్తారు. ఆమె మరణంపై కుట్రలకు సంబంధించి ఊహాజనిత కథనాలు ప్రసారం చేయడాన్ని విమర్శిస్తూ విద్యాబాలన్, ఫర్హాన్ అఖ్తర్ ట్విట్టర్‌లో పోస్టులు పెట్టారు. 'సున్నితత్వం లోపించిన మీడియా తీరుకు ఇది పరాకాష్ఠ' అని ఫర్హాన్ పేర్కొన్నారు. 'శ్రీదేవీజీ.. మీడియా మీ ఆత్మకు ప్రశాంతత చేకూర్చుగాక' అని విద్యాబాలన్ వ్యాఖ్యానించారు. 'తమ సూపర్‌స్టార్ శ్రీదేవిని మీడియా ప్రత్యక్షంగా హత్య చేస్తుంటే యావత్ దేశం మౌనంగా వీక్షించడం ఎంత సిగ్గుచేటు' అని ఓ అభిమాని సోషల్ మీడియాలో విమర్శించగా, 'మీడియాకు వినోదాన్ని అందించేందుకు ఆమె చనిపోలేదు' అని మరొకరు పేర్కొన్నారు. 'ప్రేమ వైపు మళ్లండి. అదొక్కటే చివరి దాకా నిలబడుతుంది' అని అమితాబ్ బచ్చన్ ట్వీట్ చేశారు. 'ఇద్దరు పిల్లలు తల్లిని కోల్పోయి బాధపడుతున్నారు. కోట్లాది మంది తమ అభిమాన కథానాయికను పోగొట్టుకుని దుఃఖిస్తున్నారు. అలాంటి సమయంలో నేను ప్రజల్ని కోరుతున్నదొక్కటే. దయచేసి మీ టీవీలను ఆఫ్ చేయండి' అని ఫ్యాషన్ డిజైనర్ మసాబా కోరారు.

కేసు ముగిసినా.. వీడని సందేహాలు

- దర్యాప్తు పూర్తయినట్లు ప్రకటించిన దుబాయ్ ప్రాసిక్యూషన్
- సమాధానాలు దొరుకని ప్రశ్నలెన్నో..



దుబాయ్, ఫిబ్రవరి 27: రెండున్నర రోజుల ఉత్కంఠ తర్వాత మొత్తానికి శ్రీదేవి మృతి కేసును మూసేశారు దుబాయ్ పోలీసులు. సుమారు 60 గంటలపాటు తీవ్ర హైడ్రామా, ఎన్నో మలుపుల మధ్య విచారణ సాగింది. ప్రమాదవశాత్తు జరిగిన మృతిగా నిర్ధారిస్తూ కేసును మూసివేస్తున్నామని అక్కడి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం మంగళవారం ప్రకటించింది. అయితే ఇప్పటికీ ప్రజల్లో, మీడియాలో వ్యక్తమవుతున్న అనేక ప్రశ్నలకు మాత్రం సమాధానం దొరుకలేదు.

ప్రశ్నలెన్నో..!

- స్పృహతప్పిన స్థితిలో శ్రీదేవిని చూసి, బోనీ కపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చిన సమయంలో ఏం జరిగింది?
- శ్రీదేవి కచ్చితంగా ఎన్ని గంటలకు మరణించారు?
- లోపలివైపు గడియ పెట్టి ఉన్న బాత్‌రూం తలుపులను బోనీ ఎలా తెరువగలిగారు?
- పోస్టుమార్టం నివేదిక ప్రకారం.. నిండా నీరు ఉన్న బాత్‌టబ్‌లో శ్రీదేవి మృతదేహం కనిపించిందని గల్ఫ్ న్యూస్ పత్రిక తెలిపింది. డెత్ సర్టిఫికెట్‌లో ప్రమాదవశాత్తు మునిగి చనిపోయినట్లు రాసి ఉంది. మరి బాత్‌రూంలోకి శ్రీదేవి వెళ్లకముందు టబ్‌లో నీళ్లు ఎవరు నింపారు?
- స్పృహ కోల్పోయిన స్థితిలో ఆమె టబ్‌లో కుప్పకూలిపోయి ఉంటే.. కచ్చితంగా తలపై, శరీరంపై గాయాలు, గుర్తులు కనిపించాలి. మరి అవి ఉన్నాయా?
- దుబాయ్‌లో తన మేనల్లుడి పెండ్లయిన వెంటనే బోనీకపూర్ కూతురిని తీసుకుని ముంబయికి ఎందుకు వచ్చారు? మళ్లీ ఒక్కరోజులోనే శ్రీదేవిని ఆశ్చర్యపరచడానికి ఎందుకు వెళ్లారు?
- మద్యం ఆనవాళ్లున్నాయని అన్నప్పుడు, ఎంత తాగితే, తన మీద తాను నియంత్రణ కోల్పోయి టబ్‌లో పడిపోయే పరిస్థితి ఉంటుంది? శ్రీదేవి కుటుంబ సన్నిహితుడు అమర్‌సింగ్, బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి చెప్పినదాని ప్రకారం, అమెకు మద్యం సేవించే అలవాటు లేదు. ఎప్పుడైనా కొద్ది మోతాదులో వైన్‌గానీ, బీర్‌గానీ సేవించేవారు. మరి అలాంటప్పుడు ఇదెలా సాధ్యం?
- బాత్‌రూంలో శ్రీదేవి పడిపోయి ఉండటాన్ని మొదట చూసింది బోనీకపూర్ అంటున్నారు. మరి బోనీ వెంటనే హోటల్లో ఉండే ఎమర్జెన్సీ డాక్టరకు ఫోన్ చేయకుండా తన స్నేహితుడికి ఎందుకు ఫోన్ చేశారు?

రూమ్ నం.2201లో ఏం జరిగింది?



దుబాయ్ మీడియా కథనాలు.. చాలా వివాదాస్పద వాదనలు లేవనెత్తుతున్నాయి. ఆ కథనాల ప్రకారం.. చనిపోవడానికి 48 గంటల ముందు నుంచీ శ్రీదేవి తాను బసచేసిన జుమైరా ఎమిరేట్స్ టవర్ హోటల్‌లోని గది (నెం-2201) నుంచి బయటకు రాలేదు. హోటల్ సిబ్బంది ఒకరు, భారత పత్రిక మిడ్‌డేకు తెలిపిందాన్నిబట్టి.. దుబాయ్ కాలమానం ప్రకారం శనివారం రోజు రాత్రి 10.30 గంటలకు శ్రీదేవి మంచినీళ్లు ఆర్డర్ చేశారని, తాను తీసుకెళ్లి ఎన్నిసార్లు డోర్‌బెల్ కొట్టినా తలుపు తెరువలేదని చెప్పారు. దాంతో ఆందోళనకు గురైన బాయ్, అలారం మోగించగా వచ్చిన సిబ్బంది, తలుపులు బద్దలుకొట్టి చూడగా బాత్‌రూం గదిలో నేలపై శ్రీదేవి పడిపోయి ఉన్నారని, అప్పటికీ నాడి ఇంకా కొట్టుకుంటూనే ఉందని తెలిపాడు. అప్పుడు టైమ్ 11 గంటలైందని కూడా చెప్పాడు. వెంటనే వాళ్లు పక్కనే ఉన్న రషీద్ దవాఖానకు తరలించగా, ఆమె అప్పటికే చనిపోయిందని డాక్టర్లు తెలిపినట్లు హోటల్ బాయ్ 'మిడ్‌డే' పత్రికకు చెప్పాడు. అయితే శ్రీదేవి ఒంటరిగానే ఉందని ఆయన చెప్పడం గమనార్హం.

అలాగే మరికొన్ని కథనాల ప్రకారం.. శనివారం సాయంత్రం 5 గంటలకు హోటల్‌కు చేరుకున్న బోనీకపూర్, కాసేపు భార్యతో మాట్లాడి, డిన్నర్‌కు వెళ్దామన్నారు. ఫ్రెషప్ అయి వస్తానని బాత్‌రూంలోకి వెళ్లిన శ్రీదేవి పావుగంటైనా రాకపోయేసరికి, బాత్‌రూం తలుపులు బలవంతంగా తెరిచి చూశారు. అప్పటికే టబ్‌లో మునిగిపోయి ఉన్న ఆమెను బయటకు తీయడానికి ప్రయత్నించి, వీలుగాక.. ఓ స్నేహితుడిని పిలిచారు. ఇది జరిగినప్పుడు సమయం ఆరు గంటలు. అయితే వాళ్లు పోలీసులకు సమాచారమిచ్చిన టైమ్ 9గంటలు. మరి మధ్యలో మూడుగంటలు ఏం జరిగిందన్నది ఇంకా వీడని పీటముడి.

చివరిచూపు.. చాందినీ!

- ముంబై చేరుకున్న శ్రీదేవి పార్థివదేహం
- ప్రమాదవశాత్తు నీటమునిగి చనిపోయారని నిర్ధారణ
- కేసును మూసివేసినట్లు ప్రకటించిన దుబాయ్ పోలీసులు
- ఎందుకు స్పృహకోల్పోయారో వెల్లడించని అధికారులు
- ఎంబామింగ్ అనంతరం భౌతికకాయం అప్పగింత
- ప్రత్యేక విమానంలో తరలింపు
- నేటి మధ్యాహ్నం అంత్యక్రియలు

దుబాయ్, ఫిబ్రవరి 27:

వెండితెర అతిలోక సుందరి శ్రీదేవి పార్థివదేహం ఎట్టకేలకు ముంబై చేరుకుంది. అనేక ఉత్కంఠ పరిస్థితులు, అనూహ్య పరిణామాల మధ్య దుబాయ్ పోలీసులు ఆమె భౌతికకాయాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆమె ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి మృతిచెందినట్లు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ తేల్చడంతో శ్రీదేవి డెత్‌మిస్టరీ వీడింది. ఈమేరకు ఫోరెన్సిక్ విభాగం ధ్రువీకరించిన విషయాలు వాస్తవమేనని పేర్కొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ఈ కేసును మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అన్ని పత్రాలను శ్రీదేవి కుటుంబసభ్యులకు అందజేసింది. ఎంబామింగ్ (మృతదేహానికి రసాయనాల పూత) అనంతరం శ్రీదేవి భౌతికకాయాన్ని తీసుకుని కుటుంబసభ్యులు భారత్‌కు తిరిగివచ్చారు. పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన ప్రత్యేక విమానంలో బోనీకపూర్, ఆయన తనయుడు అర్జున్ కపూర్, సోదరుడు సంజయ్‌కపూర్‌తో పాటు మరికొందరు బంధువుల మంగళవారం రాత్రి 9.30 గంటలకు ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. తమ అభిమాన తారను కడసారి చూసేందుకు అప్పటికే వేలాదిమంది అభిమానులు బరువెక్కిన హృదయాలతో ముంబైలో వేచిచూస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. తమ బంధువుల పెండ్లి వేడుకకు హాజరయ్యేందుకు భర్త, కూతురుతో కలిసి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి (54) ఈనెల 25న ఓ హోటల్లో హఠాన్మరణం చెందారు. ఆమె మరణంపై అనేక అనుమానాలు వ్యక్తంకావడంతోపాటు దర్యాప్తు ప్రక్రియ అనేక మలుపులు తిరిగింది. అయితే ప్రమాదవశాత్తు నీటమునిగి చనిపోయినట్లు పోలీసులు, ఫోరెన్సిక్ నివేదిక తేల్చగా, ప్రాసిక్యూషన్ కూడా దానితో ఏకీభవించింది.

ఫోరెన్సిక్ చెప్పిందే నిజం

శ్రీదేవి మృతికేసులో ఫోరెన్సిక్ నివేదిక తేల్చిన అంశాలు వాస్తవమని పబ్లిక్ ప్రాసిక్యూషన్ నిర్ధారించింది. విచారణ ముగిసిందని, ఈ కేసును మూసివేస్తున్నామని వెల్లడించింది. ఇలాంటి కేసుల్లో చట్టపరమైన ప్రక్రియలను పూర్తిచేసే పబ్లిక్ ప్రాసిక్యూషన్ కార్యాలయం మంగళవారం తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఈమేరకు ఓ ప్రకటన చేసింది. 'భారతీయ నటి శ్రీదేవి మృతికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు పూర్తయ్యింది. స్పృహకోల్పోవడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి చనిపోయినట్లు ఫోరెన్సిక్ నివేదిక నిర్ధారించింది. చట్టపరిధిలో కేసుకు తగిన న్యాయం జరిగినట్లుగా భావిస్తున్నందున మృతదేహాన్ని అప్పగించేందుకు నిర్ణయించాం. కేసును ఇక మూసివేస్తున్నాం' అని పేర్కొన్నది. అయితే ఆమె ఎందుకు స్పృహకోల్పోయారన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా పబ్లిక్ ప్రాసిక్యూషన్ ప్రకటనను ధ్రువీకరించింది. శనివారం రాత్రి శ్రీదేవి దుబాయ్‌లోని జుమైరా ఎమిరేట్స్ హోటల్‌లో మరణించిన సంగతి తెలిసిందే. అయితే గుండెపోటుతో ఆమె మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కానీ ఫోరెన్సిక్ నివేదికలో ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి చనిపోయినట్లు వెల్లడైంది. దాంతో శ్రీదేవి మృతిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. విచారణ నిమిత్తం కేసును దుబాయ్ పోలీసులు పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు అప్పగించారు. పూర్తి విచారణ అనంతరం భౌతికకాయాన్ని భారత్‌కు తరలించేందుకు క్లియరెన్స్ పత్రాలు జారీ చేశారు.



అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీదేవి అంత్యక్రియలు నేడు (బుధవారం) ముంబైలో నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబసభ్యులు వెల్లడించారు. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తీవ్ర భావోద్వేగ సమయంలో తమకు అండగా నిలిచిన మీడియాకు ఈ సందర్భంగా బోనీ కపూర్, కుమార్తెలు ఖుషీ, జాహ్నవితోపాటు కపూర్, అయ్యప్పన్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అందులో పేర్కొన్నారు. మరోవైపు శ్రీదేవి అంత్యక్రియలకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రజల సందర్శనార్థం శ్రీదేవి భౌతికకాయాన్ని అంధేరి వెస్ట్‌లోని సెలబ్రేషన్ స్పోర్ట్స్‌క్లబ్‌లో ఉంచుతారు. అనంతరం 2 గంటలనుంచి అంతిమయాత్ర మొదలుకానున్నది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పవన్‌హన్స్ సమీపంలోని విలేపార్లే సేవా సమాజ్ హిందూశ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తమ అభిమాన కథానాయికకు కడసారి వీడ్కోలు పలికేందుకు లోఖండ్‌వాలా లోని శ్రీదేవి నివాసం వద్దకు అభిమానులు భారీగా చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శ్రీదేవి కుమార్తెలు ఖుషీకపూర్, జాహ్నవి కపూర్‌తోపాటు కుటుంబసభ్యులు అనిల్‌కపూర్ నివాసం వద్ద వేచి ఉన్నారు. వారిని పరామర్శించేందుకు సినీ ప్రముఖులు అనిల్ కపూర్ నివాసానికి వచ్చివెళ్తున్నారు. షారుఖ్‌ఖాన్, గౌరీఖాన్, రజినీకాంత్, కమల్‌హాసన్, రణ్‌వీర్‌సింగ్, దీపికా పదుకొనె, టబూ, రేఖ, ఫరాహ్‌ఖాన్, జావేద్ అఖ్తర్, షబానా ఆజ్మీ తదితరులు ఆ కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. శ్రీదేవికి కడసారి వీడ్కోలు పలికేందుకు రజినీకాంత్, కమల్‌హాసన్, వెంకటేశ్‌తోపాటు పలువురు దక్షిణాది సినీతారలు, ప్రముఖులు ఇప్పటికే ముంబై చేరుకున్నారు.

బోనీకపూర్ వాంగ్మూలాన్ని రికార్డు చేసిన పోలీసులు



శ్రీదేవి మృతికి సంబంధించి ఆదివారం ఉదయం ప్రారంభమైన దర్యాప్తు మంగళవారం వరకూ సుమారు 60గంటలపాటు కొనసాగింది. ఈ కేసుకు సంబంధించి సోమవారం నాడు బోనీకపూర్‌ను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. బుర్‌దుబాయ్ పోలీస్ కార్యాలయంలో ఆయన వాంగ్మూలాన్ని వీడియో ముందు రికార్డు చేశారు. అలాగే శ్రీదేవికి భారత్‌లో నిర్వహించిన వివిధ ట్రీట్‌మెంట్లు, సర్జరీల వివరాలు కూడా సేకరించారు. హోటల్ సిబ్బందినీ విచారించారు. శ్రీదేవి, బోనీ మొబైల్ ఫోన్ల కాల్ వివరాలు కూడా తీసుకున్నారు. సుమారు మూడుగంటలపాటు బోనీకపూర్‌ను ప్రశ్నించినట్లు గల్ఫ్ న్యూస్ పత్రిక తెలిపింది. మోహిత్ మార్వా కుటుంబాన్ని కూడా పోలీసులు విచారించారు.

నేడు తుదివీడ్కోలు ఇలా..



9.30-12.30 సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ప్రజల సందర్శనకు శ్రీదేవి భౌతిక కాయం

2.00-3.30 అంధేరి వెస్ట్ నుంచి పవన్ హన్స్ వరకు అంతిమయాత్ర

3.30 నుంచి: విలేపార్లే శ్మశానవాటికలో అంత్యక్రియలు

బాత్‌టబ్ మరణాలు అసాధారణం కాదు

జపాన్‌లో ఏటా సగటున 19వేలమంది బాత్‌రూంలోనే మృతి

న్యూఢిల్లీ: బాత్‌టబ్‌లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు భారత్‌లో అరుదే కానీ, అంతర్జాతీయంగా ఇలాంటి ఘటనలు తరుచూ జరిగేవే. ఒక్క జపాన్‌లోనే ఏటా సగటున 19వేలమంది బాత్‌రూంలో మరణిస్తున్నారు. గత దశాబ్దకాలంలో ఇలాంటి కేసులు రెట్టింపయ్యాయని, మరణిస్తున్న ప్రతీ 10మందిలో 9మంది 65 ఏండ్లకు పైబడినవారేనని జపాన్‌కు చెందిన ఓ సంస్థ బయటపెట్టింది. 2006 నాటి అమెరికా మరణాల నివేదిక ప్రకారం. ప్రతిరోజూ ఓ అమెరికన్ బాత్‌టబ్, స్పా టబ్‌లో ప్రాణాలు కోల్పోతున్నట్లు వెల్లడించింది. బాత్‌టబ్ చావులు గృహసంబంధ మరణాల కిందకే వస్తాయని, భారత్‌లో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఇలా మరణిస్తున్నారని గుజరాత్‌లోని ఆనంద్‌కు చెందిన ఓ సంస్థ వెల్లడించింది.

'శ్రీదేవిని హత్య చేశారు'

సుబ్రమణ్యస్వామి సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: శ్రీదేవి మృతిపై బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీదేవిని హత్యచేశారని, ఆమెకు మద్యం తాగే అలవాటే లేదని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన స్వామి.. 'శ్రీదేవికి మద్యం తాగే అలవాటు లేదు. అలాంటప్పుడు ఆమె రక్తంలో మద్యం ఆనవాళ్లు ఎలా ఉంటాయి? హోటల్లో సీసీటీవీ ఫుటేజ్ ఏమైంది? దానిగురించి చిన్న విషయం కూడా ఎందుకు బయటకు రాలేదు? ముందుగా అనుకున్నట్లుగానే.. శ్రీదేవి గుండెపోటుతో మరణించినట్లు మీడియాలో ఎందుకు ప్రసారమైంది?' అని వ్యాఖ్యానించారు. బాత్‌టబ్‌లో పడి చనిపోవడం అంత సులభంకాదని, ఎవరో బలవంతంగా నీటిలో ముంచితే తప్ప చనిపోరని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆమెతో బలవంతంగా మద్యం తాగించి ఉంటారని కూడా పేర్కొన్నారు. సినీతారలకు, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంకు ఉన్న సంబంధాల నేపథ్యంలో ఈ అంశాన్ని చూడాలని అన్నారు.

విట్నీ హ్యూస్టన్‌లాగే శ్రీదేవి విషాదాంతం



శ్రీదేవి, ప్రముఖ అమెరికన్ గాయని విట్నీ హ్యూస్టన్ మరణించిన ఉదంతాలు ఒకేలా ఉన్నాయని బాలీవుడ్ నటి సిమి గరేవాల్ ట్వీట్ చేశారు. 48 ఏండ్ల వయసులో సింగర్ విట్నీ హ్యూస్టన్ బెవెర్లీహిల్స్‌లో జరిగిన పార్టీలో పాల్గొన్న అనంతరం హోటల్‌లోని బాత్ టబ్‌లో శవమై తేలారు. హ్యూస్టన్ ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో మునిగిపోయారని, ఆమె మృతివెనుక ఎలాంటి నేరపూరిత కోణం లేదని అప్పటి లాస్‌ఏంజెల్స్ కరోనర్ అధికారిక నివేదికలో పేర్కొన్నారు. కాగా, విట్నీ హ్యూస్టన్ మరణించిన తరహాలోనే శ్రీదేవి విషాదాంతం చోటు చేసుకుందని సిమి గరేవాల్ తెలిపారు.

హజ్‌కు విమాన చార్జీలు తగ్గింపు

ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: హజ్ యాత్రికులకు ఇస్తున్న రాయితీలను రద్దుచేసిన నెలరోజుల తర్వాత.. హజ్‌కు వెళ్లేందుకు విమాన చార్జీలను గణనీయంగా తగ్గిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఇది గొప్ప ముందడుగని కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ అభిప్రాయపడ్డారు. దేశంలోని 21 విమానాశ్రయాల నుంచి ఎయిర్‌ఇండియా, సౌదీ అరేబియాకు చెందిన సౌదీ ఎయిర్‌లైన్స్, ఫ్లైనస్ విమానయాన సంస్థలకు చెందిన విమానాల్లో జెడ్డా, మదీనాకు వెళ్లే ప్రయాణికులకే ఈ చార్జీల తగ్గింపు వర్తించనున్నది. అహ్మదాబాద్ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు 2013-14లో రూ.98,750 చార్జి ఉండగా ఇది రూ.65,015కు తగ్గనుంది. అదేవిధంగా ముంబై నుంచి వెళ్లేందుకు 2013-14లో రూ. 98,750 చార్జి ఉండగా, అది రూ.57,857కు తగ్గిపోనుంది.

నాగాలాండ్, మేఘాలయలో ఎన్నికలు ప్రశాంతం

వచ్చేనెల 3న ఓట్ల లెక్కింపు


మేఘాలయలో ఓటు వేసేందుకొచ్చిన యువతులు

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్‌లో 75 శాతం, మేఘాలయలో 67 శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం జరిగిన ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నాగాలాండ్‌లో 90.57 శాతం, మేఘాలయలో 89 శాతం పోలింగ్ నమోదవ్వగా ఈ సారి తగ్గింది. నాగాలాండ్, మేఘాలయలో ఎన్నికలు సజావుగా సాగాయని, ఎక్కడా అవాంతరాలు ఎదురుకాలేదని ఎన్నికల అధికారులు చెప్పారు. మేఘాలయలో మొత్తం 60 స్థానాలకుగానూ 59 స్థానాల్లో ఎన్నికలు జరిగాయని, ఎన్సీపీ అభ్యర్థి మృతిచెందడంతో విలియంనగర్ నియోజకవర్గం ఎన్నికలను వాయిదా వేశామని పేర్కొన్నారు. నాగాలాండ్ లోనూ 59 స్థానాలకు ఎన్నికలు నిర్వహించామని, మిగిలిన ఒకస్థానం ఏకగ్రీవం అయ్యిందని తెలిపారు. వచ్చేనెల 3న నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నామని వివరించారు. త్రిపురలో 25 ఏండ్లుగా అధికారంలో ఉన్న సీపీఎం ఈసారి ఓడిపోనున్నదని, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. నాగాలాండ్‌లో బీజేపీ 27నుంచి 32 సీట్లను గెలువనున్నదని పేర్కొన్నాయి.

ముంబైలో సైన్యం నిర్మించిన మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రారంభం

కేంద్రమంత్రి, సీఎం సమక్షంలో ప్రారంభించిన సామాన్యులు



ముంబై: ముంబైలోని మూడు రైల్వేస్టేషన్లలో సైన్యం నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్ఓబీ)లను మంగళవారం ప్రారంభించారు. గతేడాది సెప్టెంబర్ 29న ఎల్ఫిన్‌స్టన్ రోడ్ స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిపైన తొక్కిసలాట జరిగి 29 మంది పాదచారులు మరణించారు. ఈ నేపథ్యంలో ఎల్ఫిన్‌స్టన్, కర్రీ రోడ్, అంబివ్లీ స్టేషన్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను సైన్యం నిర్మించింది. కేవలం 117 రోజుల్లోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసింది. రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఈ మూడు బ్రిడ్జిలను సామాన్య పౌరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ బ్రిడ్జిల నిర్మాణ నాణ్యత బాగుందని, వీటిని సైన్యం నిర్మించడం ఓ అనుభవం లాంటిందని చెప్పారు.



కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకు సకల చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నది. కానీ దీని కోసం కేంద్రం నిధులు పంపిస్తున్నది. ఆరోగ్య రక్షణ కల్పించడానికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉపయోగించడం లేదు.

నరేంద్రమోదీ, ప్రధాని

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది. ఆరేండ్లుగా ఇది జరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తున్నది? మోదీ ప్రభుత్వం సాధించిన ఫలితాలు చెప్పుకొని పొగడ్తల పుష్పగుచ్ఛాలు అందుకుంటున్నప్పుడు, ఇప్పుడు ఇటికెపెల్లల దెబ్బలకు కూడా సిద్ధపడాలి.

శత్రుఘ్నసిన్హా, బీజేపీ అసమ్మతి నేత



చరిత్రలో నేడు




1749

హెన్రీ ఫీల్డింగ్స్ రచించిన 'టామ్ జోన్స్' ప్రచురణ.

1933

జర్మన్ కమ్యూనిస్టు పార్టీని రద్దుచేసిన హిట్లర్.





1933

యూఎస్ క్యాబినెట్‌లోకి తొలి మహిళ ఫ్రాన్సెస్ పెర్కిన్స్, లేబర్ సెక్రెటరీగా నియామకం.

పశ్చిమాసియాలో ఇంకా జరుగకూడని ఘోరం ఏదైనా ఉందీ అంటే ఈ అస్థిర ప్రాంతంలో మరో దేశం అణ్వస్ర్తాలను సంతరించుకోవడం. కానీ అమెరికా సౌదీ అరేబియాతో జాగ్రత్తగా వ్యవహరించకపోతే ఆ పని కూడా జరుగవచ్చు. అణు రియాక్టర్ల ద్వారా తాము అణుశక్తిని ఉత్పత్తి చేసుకుంటామని, శిలాజ ఇంధనాలను ఎగుమతి చేసుకుంటామని సౌదీ అరేబియా అంటున్నది. కానీ సౌదీ అరేబియా అణ్వస్ర్తాలను తయారు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ ఎటైన మొగ్గే అవకాశాలు ఉన్నందు వల్ల, కాంగ్రెస్ ఈ పరిణామానికి అడ్డుకట్ట వేయాలె. ఇరాన్‌కు విధించినట్టుగా సౌదీ అణు వసతులను కూడా తనిఖీ చేసే ఏర్పాటు ఉండాలె.

ది న్యూయార్క్ టైమ్స్

ఇంటర్‌నెట్ యుగంలో టీవీ, రేడియో ప్రసార సంస్థలు మనుగడ సాగించడానికి తంటాలు పడుతున్నాయి. హాంగ్‌కాంగ్‌లోని ఆపరేటర్ల పరిస్థితి మరీ దారుణం. పాతకాలపు చట్టాలు గట్టి నియంత్రణను అమలుచేయడం వల్ల, ఆన్‌లైన్ మీడియాతో పోటీ పడలేకపోతున్నాయి. దీంతో ఈ నియంత్రణ వ్యవస్థను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఏర్పడ్డది. టీవీ వీక్షణ 2009లో 85 శాతం ఉండగా గతేడాదికి 71. 8 శాతానికి పడిపోయిందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పోటీకి, అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పరుచాలె.

సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్

నిరంకుశ పోకడ

చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) కేంద్ర కమిటీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఉన్న రెండు పర్యాయాల పరిమితిని తొలిగించాలని చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌కు సిఫారసు చేసింది. దీన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ అధినేత జిన్‌పింగ్ చైనా పీపుల్స్ కాంగ్రెస్ (పార్లమెంటు)లో ఆమోదానికి పెట్టే అవకాశం ఉన్నది. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులే పార్లమెంటు సభ్యులుగా కూడా ఉండే చైనాలో పరిణామాలు చూస్తే, సీపీసీ నిర్ణయం ఆమోదం పొందడటం లాంఛనమేనని చెప్పుకోవచ్చు. ఇదే జరిగితే చైనా శాశ్వత అధ్యక్షుడిగా జి జిన్‌పింగ్ అధికారం చలాయించే అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి పరిణామాలేవో జరుగుతాయని గతేడాది అక్టోబర్‌లో వారం రోజులపాటు జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ కాంగ్రెస్ మహాసభలనాడే అవగతమైంది. కేంద్రకమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో సభ్యుల ఎంపికతో పాటు అన్నివిధాన నిర్ణయాలన్నీ జిన్‌పింగ్ కనుసన్నల్లోనే జరిగాయి. పార్టీ, ప్రభుత్వ యంత్రాంగమంతా జి అనుయాయులతోనే నిండిపోయింది. నవచైనా అభివృద్ధికి, సోషలిస్టు చైనా నిర్మాణానికి విశేష కృషి చేస్తున్న జిన్‌పింగ్ కృషిని శ్లాఘిస్తూ, ఆయన రచనలను సీపీసీ రాజ్యాంగంలో పొందుపర్చాలన్న నిర్ణయం కూడా జరిగింది. ఇది జిన్‌పింగ్‌కు చైనా ప్రభుత్వంలోనూ, పార్టీపైనా ఉన్న ఆధిపత్యాన్ని తేటతెల్లం చేసింది. అయితే ఇది చైనా కమ్యూనిస్టు పార్టీని ప్రభావితం చేయటంతోనే ఆగదు. అధికారాలన్నీ ఒక వ్యక్తి గుప్పిట్లో చేరటం నియంతృత్వానికి పునాదులు పడ్డాయనటానికి నిదర్శనాలుగానే భావించాలి.

చైనా చరిత్రలో నవ చైనా నిర్మాతగా ప్రఖ్యాతిగాంచిన మావో తర్వాత మరో వ్యక్తి రచనలు సీపీసీ రాజ్యాంగంలో చేరటం ఇదే మొదటిసారి. చైనా మీడియా, ప్రభుత్వ వర్గాలు ఏం చెప్పినా, మావో సరసన ఆయన చేరటం జిన్‌పింగ్ త్యాగానికీ, చైనా అభివృద్ధికి ఆయన చేసిన కృషికి దక్కిన గౌరవంగా భావించాల్సిన అవసరం లేదు. 1976లో మావో జెడాంగ్ మరణం తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించిన నాయకులంతా క్రమక్రమంగా పార్టీలో, ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో స్వేచ్ఛా మార్కెట్ విధానాలను అనుసరిస్తూ వచ్చారు. డెంగ్ జియావో పింగ్ మొదలు జియాంగ్ జెమిన్, హు జింటావో కాలందాకా విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచారు. అయితే ఆర్థిక రంగంలో మార్పులకు అనుగుణంగా రాజకీయరంగంలో స్వేచ్ఛను కల్పించలేదు. ఈ నేపథ్యంలోంచే చైనా విద్యార్థులు స్వేచ్ఛ కోసం తియాన్‌మిన్ స్క్వేర్‌లో మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ విద్యార్థుల ప్రదర్శనను చైనా పాలకులు తిరోగమన, విచ్ఛిన్నచర్యగా అభివర్ణిస్తూ యుద్ధట్యాంకులతో తొక్కించి విద్యార్థులను రక్తపుటేరుల్లో ముంచారు. యుద్ధట్యాంకుల కింద అనేకమంది ప్రదర్శనకారులు నలిగి ప్రాణాలు విడిచారు. ఇది ఆధునిక చరిత్రలో చైనా పాలకులు తలపెట్టిన ఘోర దమనకాండగా నిలిచిపోయింది. సరళీకృత ఆర్థికవిధానాలు అవలంబిస్తూ వస్తున్న చైనా పాలకులు, ఆర్థిక విధానాల ఫలితంగా అనివార్య వ్యక్తీకరణగా ముందుకు వచ్చిన విద్యార్థుల ఆకాంక్షలను తప్పుబట్టి, రక్తపుటేరుల్లో ముంచటం చైనా రాజకీయ వ్యవస్థ నిరంకుశ పోకడలకు అద్దం పడుతున్నది. ఈ క్రమంలోంచే ప్రపంచమంతా విద్యార్థుల పట్ల చైనా దమననీతిని తప్పుబట్టింది, ఫాసిస్టు చర్యగా ఖండించింది.

అవినీతి వ్యతిరేక ఉద్యమం పేరుతో పార్టీలో ప్రత్యర్థులందరినీ అడ్డు తొలిగించుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగంపై పట్టుబిగించటం ఆందోళన కలిగించేదే. వన్ రోడ్ వన్ బెల్ట్ పేరుతో వర్తక వాణిజ్యాలలో ఆధిపత్యానికి పావులు కదుపుతున్న చైనా, ఇప్పటికే ఆసియాలో ప్రాంతీయాధిపత్యం చలాయిస్తున్నది. నేటి ఆధునిక ప్రపంచంలో కమ్యూనిస్టు ప్రభుత్వాల పేర ఉనికిలో ఉన్న దేశాలన్నీ ఏక వ్యక్తి పాలనతో నియంతృత్వ వ్యవస్థలుగా మారాయి. ఈ తరుణంలో అతిపెద్ద ఆర్థిక, సైనిక శక్తి కలిగిన చైనా అదే బాటలో నడిస్తే ప్రపంచశాంతి సుస్థిరతలకు తీవ్ర విఘాతంగానే భావించాలి.

జి జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన తర్వాత చైనాకు స్వేచ్ఛా వాయువులు అందించడానికి బదులు మరింత నిరంకుశత్వాన్ని పాదుగొల్పి జూస్తున్నారు. సాంస్కృతిక విప్లవకాలంలో జిన్‌పింగ్ తండ్రితో పాటు ఉన్నత, సుఖమయ జీవితాన్ని వదిలి పల్లెలో కట్టె మంచంపై పడుకొని పందులు కాయాల్సి వచ్చింది. నాటినుంచి పట్టువదలని విక్రమార్కునిలా మార్క్సిజంపై మాస్టర్స్ డిగ్రీ చేసి పార్టీలో ప్రాథమిక సభ్యునిగా, ప్రధాన నగరానికి మేయర్‌గా ఎదిగారు. మెట్టుమెట్టుగా ఎదిగి ఇప్పుడు చైనా దిశ, దశను మార్చే శక్తిమంతమైన నేతగా మారారు. ఏదేమైనా సోషలిస్టు తరహా రాజకీయ ఆర్థిక విధానంలో సమిష్టి పని విధానానికి, ప్రజా భాగస్వామ్యానికి పెద్దపీట వేయాల్సిన చోట వ్యక్తి స్వామ్యానికి పునాదులు పడటం నియంతృత్వానికి పట్టం కట్టడంగానే భావించాలి. చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవహారాలపై నిష్ణాతురాలైన మార్గరెట్ లూయిస్ అనే న్యాయశాస్త్ర ప్రొఫెసర్ వెలిబుచ్చిన అభిప్రాయాలు గమనార్హమైనవి. జిన్‌పింగ్ విధాన నిర్ణయాల్లో సీపీసీలోని అత్యున్నత నేతల భాగస్వామ్యాన్ని కూడా సహించనిస్థితిలో ఉన్నారు. ఆయన ప్రభుత్వంపై గుత్తాధిపత్యానికి ప్రయత్నిస్తున్నాడని లూయిస్ పేర్కొన్నారు. అవినీతి వ్యతిరేక ఉద్యమం పేరుతో పార్టీలో ప్రత్యర్థులందరినీ అడ్డు తొలిగించుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగంపై పట్టుబిగించటం ఆందోళన కలిగించేదే. వన్ రోడ్ వన్ బెల్ట్ పేరుతో వర్తక వాణిజ్యాలలో ఆధిపత్యానికి పావులు కదుపుతున్న చైనా, ఇప్పటికే ఆసియాలో ప్రాంతీయాధిపత్యం చలాయిస్తున్నది. నేటి ఆధునిక ప్రపంచంలో కమ్యూనిస్టు ప్రభుత్వాల పేర ఉనికిలో ఉన్న దేశాలన్నీ ఏక వ్యక్తి పాలనతో నియంతృత్వ వ్యవస్థలుగా మారాయి. ఈ తరుణంలో అతిపెద్ద ఆర్థిక, సైనిక శక్తి కలిగిన చైనా అదే బాటలో నడిస్తే ప్రపంచశాంతి సుస్థిరతలకు తీవ్ర విఘాతంగానే భావించాలి.

జనగళం

అధికారుల నిర్లక్ష్యం

ప్రతి గ్రామంలో ఈజీఎస్ కంటోన్మెంట్ నిధుల ద్వారా శ్మశాన వాటికలు నిర్మిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఏడాదిన్నర క్రితమే అర ఎకరా స్థలంలో శ్మశానవాటికలు నిర్మించేందుకు ఒక్కో శ్మశానానికి 9.50 లక్షల నుంచి 10.50 లక్షల రూపాయలను ఇచ్చేందుకు ప్రభుత్వం సముఖంగా ఉన్నట్లు చెప్పారు. ఈ బాధ్యతను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అయినా కొన్నిచోట్ల శ్మశానాల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఇందులో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని శ్మశానవాటికలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- వి.రాజశేఖరశర్మ, నాగర్‌కర్నూల్

కృత్రిమ రంగులతో ప్రమాదం

రంగులపండుగ హోళీ సందర్భంగా స్నేహితులు, బంధువులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకొంటారు. అయితే ఈ రంగులవాడకంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. సహజమైన, ప్రకృతిసిద్ధంగా లభించే వాటితో తయారైన రంగులు చల్లుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. రసాయన రంగుల్లోని ఆర్సెనిక్ వంటి వాటితో చూపుపోయే ప్రమాదం ఉన్నది. కాబట్టి ప్రతి ఒక్కరు సహజ రంగులనే వాడాలి.

- ఎస్.శ్రీనివాసరాజు, వనస్థలిపురం, హైదరాబాద్

మౌలిక వసతుల కరువు

రాష్ట్రవ్యాప్తంగా కూరగాయలు, చేపల మార్కెట్లలో మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో అమ్మకందారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. మార్కెట్లలో కనీస వసతులైన రేకుల షెడ్లు, చేతిపంపులు, మూత్రశాలలు అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వం ఈ విషయమై దృష్టిసారించాలి.

- పుల్కం సంపత్ కుమార్, రాములపల్లె, పెగడపల్లి, జగిత్యాల

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఇంధనం

ఆండ్రూ బారన్

'పునరుత్పాదక' అగ్రరాజ్యాలు

శిలాజ ఇంధనాల యుగం ఇక ఎంతో కాలం ఉండదు. లిథియం, రాగి, అరుదైన లోహాల వనరుల గల కొత్త దేశాలు తమ ప్రాభవం చాటుకుంటాయి. ప్యారిస్ ఒప్పందం ప్రకారం ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల వాడకం నిలిపివేసి కొత్త వనరుల వైపు మళ్ళితే.. అంతర్జాతీయ రాజకీయాలు ఎట్లా ఉంటాయి?

ఇరువయ్యవ శతాబ్దంలో బొగ్గు, చమురు, సహజవాయువులు ప్రాధాన్యం వహించాయి. కానీ పర్యావరణ హితమైన ఇంధనం వైపు ప్రపంచం అడుగులు వేసినప్పుడు కొత్త ముడిపదార్థాలు ప్రాధాన్యం వహిస్తాయి. ఉదాహరణకు- సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలనుకుంటే, సిలికాన్ సాంకేతిక పరిజ్ఞానం అవసరం. ఇందుకోసం క్వార్ట్జైట్ శిలలు ప్రాధాన్యం పొందుతాయి. బ్యాటరీలకు లిథియం అవసరం అవుతుంది. కొన్ని అరుదైన లోహాలు కూడా అవసరమవుతాయి. ఉదాహరణకు.. పవన టర్బైన్ జనరేటర్ల అయస్కాంతాల కోసం నియోడిమియం వంటి లాంథనైడ్స్ అవసరమవుతాయి. పవన విద్యుత్‌కు వాహకంగా రాగి అవసరం ఉంటుంది. జెనరేటర్ వైండింగ్, కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్‌వెర్టర్లు మొదలైన వాటికి రాగి అవసరం ఉంటుంది.



కార్బన్ నుంచి సిలికాన్, రాగి, లిథియం, కొన్ని అరుదైన లోహాల వైపు ప్రపంచం మళ్ళినప్పుడు భవిష్యత్తు ఎట్లా ఉంటుందనేది ఆలోచించవలసిన విషయం. కొత్తగా అవతరించే పునరుత్పాదక అగ్ర రాజ్యాలు ఏమిటనేవి సుపరచితమైనవే. సిలికాన్ ఉత్పత్తికి అవసరమయ్యే క్వార్ట్జైట్ చైనా, రష్యా, అమెరికా దేశాల్లో లభిస్తుంది. బ్రెజిల్, నార్వేలలో కూడా దొరుకుతది. అమెరికా, చైనాలలో రాగి ఎక్కువగా దొరుకుతుంది. కానీ క్రమంగా ఈ దేశాల్లో రాగి నిలువలు తగ్గిపోతున్న యి. అందువల్ల చిలీ, పెరు, కాంగో, ఇండోనేషియా ముందుకు వస్తున్నయి. చైనా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా కన్నా చిలీలో ఎక్కువగా లిథియం నిలువలున్నాయి. బొలీవియా, అమెరికాలలో తక్కువ నాణ్యత గల లిథియం నిలువలున్నాయి. వీటిని ఇంకా వెలికితీయడం మొదలుపెట్టలేదు. అరుదుగా లభించే వనరులు చైనా, రష్యా, బ్రెజిల్, వియెత్నాం దేశాల్లో ఎక్కువగా ఉన్నాయి. శిలాజ ఇంధనాలను ఉత్పత్తి చేసే దేశాల్లో, అమెరికా, చైనా, రష్యా, కెనడా అతి సులభంగా కొత్త పర్యావరణ హిత ఇంధన వనరుల వైపు సులభంగా మళ్ళగలవు. కొత్త మార్పులను రాజకీయంగా అవరోధించే అమెరికాపై కొత్త వనరుల ప్రభావం ఉండదు. అయితే కొన్ని దేశాలు తమ సహజ వనరుల వల్ల ప్రాధాన్యం పొందుతయి.

పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)లో పద్నాలుగు దేశాలు ఉన్నాయి. ప్రపంచంలోని చమురు వనరుల్లో సగం ఈ దేశాల్లోనే ఉన్నాయి. ఉత్పత్తిలోనూ వీటిదే అగ్రస్థానం. పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమయ్యే ముడి పదార్థాలు భవిష్యత్తులో కీలకమవుతాయి. కనుక ఈ ముడి పదార్థాలు గల దేశాలు కూడా ఇదే రీతిలో ఒక సంస్థగా ఏర్పడవచ్చు. ఈ క్రమంలో ఇప్పుడు పశ్చిమాసియా దేశాలకు గల గుత్తాధిపత్యం భవిష్యత్తులో మధ్య ఆఫ్రికా, దక్షిణ అమెరికా వైపు మారవచ్చు. అయితే ఈ మార్పు శాంతియుతంగా ఉండదు. ఇరువయ్య వ శతాబ్దంలో అనే యుద్ధాలకు చమురు క్షేత్రాలపై నియంత్రణే కారణం. యూరోపియన్ వలసవాదానికి మొదట ఆహారం, ముడి పదార్థాలు, ఖనిజాలు కారణం. ఆ తర్వాత చమురు ప్రధాన వనరుగా వలసవాదం సాగింది. పునరుత్పాదక ఇంధనాల ముడి పదార్థాల వైపు మొగ్గు కూడా ఇదే రీతిలో సాగవచ్చు. టర్బైన్స్, సౌర ఫలకాలు, బ్యాటరీల కోసం అవసరమైన పదార్థాల సరఫరా నిరంతరం సాగేలా పెద్ద దేశాలు జాగ్రత్త పడుతాయి. ఈ క్రమంలో కొత్త వలసవాద యుగం ప్రారంభమవుతుంది. చైనా ఇప్పటికే ఆర్థిక వలసవాదాన్ని ప్రారంభించింది. ముడిపదార్థా ల నిరంతర సరఫరా కోసం వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నది. గత దశాబ్దంలో ఆఫ్రికాలోని గనుల తవ్వకంపై భారీగా పెట్టుబడులు పెట్టింది. పెరూ, చిలీ వంటి దేశాలతో ఒప్పందాల ద్వారా అమెరికా ఆర్థిక ప్రాబల్యం దక్షిణ అమెరికాకు విస్తరించింది.

కొత్త వలసవాద యుగం?

ఈ నేపథ్యంలో భవిష్యత్తు ఎట్లా ఉంటుందనే విషయమై రెండు రకా ల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొదటిది- ఒపెక్ తరహాలో కొత్త సంస్థ ఏర్పడుతుంది. ఇది సిలికాన్, రాగి, లిథియం, లాంథనైడ్స్ వంటి కీలక వనరులను తమ అదుపులో పెట్టుకుంటుంది. రెండవది- 21వ వ శతాబ్దపు వర్ధమాన దేశాల వలసవాదం సాగుతుంది. ఇది సూపర్ ఎకానమీలను సృష్టిస్తుంది. భవిష్యత్తు ఈ రెండు విధాలలో, ఏ రూపేణా ఉన్నా, గతంలో చమురు, సహజవాయువు విషయంలో జరిపినట్టుగా, కీలక పునరుత్పాదక వనరులను చేతిలో పెట్టుకొని ప్రత్యర్థి రాజ్యాలకు అందకుండా చేస్తుంటాయి.

కొత్త పరిణామంలో ఒక అనుకూలాంశం కూడా ఉన్నది. పర్యావరణహిత ఇంధనానికి అవసరమయ్యే రసాయనికాలకు, శిలాజ ఇంధనాలకు తేడా ఉంటుంది. చమురు, సహజవాయువు వినిమయ వస్తువులు. సహజవాయువు కేంద్రం ఒకసారి నిర్మిస్తే, నిరంతరం వాయుసరఫరా ఉండాల్సిందే. లేకపోతే ఉత్పత్తి ఆగిపోతుంది. పెట్రోలుతో నడిచే కార్లకు, నిరంతరం ఇంధనం సరఫరా చేయవలసిందే. కానీ పవన విద్యుత్తు కోసం పరికరాలు ఏర్పాటు చేస్తే, గాలి ఉన్నంత వరకు నడుస్తూనే ఉంటుంది. (గాలి వీచడం ఆగిపోదు) అయస్కాంతాలకు నియోడైమియమ్, జనరేటర్ వైండింగ్ కోసం రాగి మాదిరిగా నిరంతర అవసరం ఉండదు. సౌర, పవన, తరంగ విద్యుత్తు కోసం ఒకసారి ఆయా కేంద్రాలను నిర్మిస్తే, ఇతర ఖర్చులు ఏవీ లేకుండా చాలా కాలం ఉత్పత్తి సాగుతూనే ఉంటుంది. కార్లకు, విద్యుత్ పరికరాలకు మన్నిక ఎక్కువ కాలం ఉండదు. అందువల్ల లిథియం కోసం నిరంతర డిమాండ్ ఉంటుంది. రిసైక్లింగ్ విధానాన్ని మెరుగుపరచుకుంటే, డిమాండ్‌ను తట్టుకోవచ్చు. బొగ్గు, చమురు, సహజవాయువు సరఫరాలను అడ్డుకోవచ్చు. కానీ సౌర, పవన విద్యుత్‌కు అవరోధం కలిగించడం సాధ్యం కాదు. అందువల్లనే అమెరికా రక్షణ శాఖ పర్యావరణహిత ఇంధనాన్ని జాతీయ భద్రతకు కీలకమైనదిగా గుర్తించింది.

కొత్త అగ్రరాజ్యాలు రాజకీయ, ఆర్థిక పెత్తనాన్ని సంతరించుకోవడానికి ముందే, ఏ దేశమైతే పర్యావరణహిత ఇంధన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకుంటుందో, ఆ దేశం లిథియం, రాగి వంటి వనరులు చిక్కకుండా సాగించే ఒత్తిడుల నుంచి బయటపడుతుంది. ఈ విషయంలో వెనుకబడితే అధిక మూల్యం చెల్లించవలసి ఉంటుంది. భవిష్యత్తులో చమురు ఉత్పత్తి దేశాల ప్రాధాన్యం ఉండదు. అందువల్ల పర్యావరణ హిత ఇంధనాల ఉత్పత్తికి అవసరమైన వనరులు గల దేశాలు వాటిని ఇప్పుడే చౌకగా అమ్మివేయవద్దు. వాటిని కాపాడుకోవాలె.

కొత్త అగ్రరాజ్యాలు రాజకీయ, ఆర్థిక పెత్తనాన్ని సంతరించుకోవడానికి ముందే, ఏ దేశమైతే పర్యావరణ హిత ఇంధన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకుంటుందో, ఆ దేశం లిథియం, రాగి వంటి వనరులు చిక్కకుండా సాగించే ఒత్తిడుల నుంచి బయటపడుతుంది. ఈ విషయంలో వెనుకబడితే అధిక మూల్యం చెల్లించవలసి ఉంటుంది. భవిష్యత్తులో చమురు ఉత్పత్తి దేశాల ప్రాధాన్యం ఉండదు. అందువల్ల పర్యావరణ హిత ఇంధనాల ఉత్పత్తికి అవసరమైన వనరులు గల దేశాలు వాటిని ఇప్పుడే చౌకగా అమ్మివేయవద్దు. వాటిని కాపాడుకోవాలె.

(వ్యాసకర్త: స్వాన్‌సీ విశ్వవిద్యాలయంలో పర్యావరణహిత ఇంధన పీఠం అధిపతి)

'ది కన్సర్వేషన్' సౌజన్యంతో...

సుస్థిర భవిష్యత్ కోసం శాస్త్ర విజ్ఞానం

సందర్భం

డాక్టర్ పారిపెల్లి శంకర్

ఏటూరి శేఖర్ శర్మ

శాస్త్ర సాంకేతిక కమ్యూనికేషన్ జాతీయ మండలి సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 28ని జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవంగా ప్రకటించింది. భారతీయ శాస్త్రవేత్త, భారతరత్న సర్ సి.వి.రామన్, తన ఆవిష్కరణ 'రామన్ ఫలితాన్ని' ఈ రోజునే ప్రకటించారు. దేశానికి నోబెల్ బహుమతిని అందించిన ఈ ఆవిష్కరణకు గుర్తుగా, 1987 నుంచి ఏటా ఫిబ్రవరి 28ని జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవంగా పాటిస్తున్నాం. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన అభివృద్ధిని సమీక్షించుకొని, నూతన ధోరణులకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రపంచ ఐటీ సదస్సును బయో ఆసియా సదస్సును నిర్వహించింది. దేశవ్యాప్తంగా విజ్ఞాన శాస్త్ర అభ్యాసకులకు, పరిశోధకులకు, శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించిన కీలక భాగస్వాములకు ఈ సైన్స్ దినోత్సవం సందర్భంగా చేపట్టే వివిధ కార్యక్రమాలకు ఈ సదస్సులు మార్గదర్శకంగా నిలుస్తాయి. ప్రపంచ ఐటీ సదస్సులో మానవరూప రోబో సోఫియా ప్రదర్శన 'కృత్రిమ మేధస్సు' సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి ప్రతీకగా నిలిస్తే, సద్గురు ఉపన్యాసం మౌలిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు గల అవసరాన్ని నొక్కిచెప్పింది. మానసిక సమస్యను అధిగమించేందుకు మానసిక వైద్య నిపుణులు, సాంకేతిక శాస్త్ర తోడ్పాటుతో పాటు తల్లితండ్రుల పాత్ర ప్రముఖమైందని నటి దీపిక పడుకొనే వివరించారు. పోటీ ప్రపంచంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై విపరీత నిర్ణయాలకు పాల్పడుతున్న యువతకు లభించవలసిన మానసిక సహాయాన్ని గుర్తుచేశారు. వేల సంఖ్యలో ఈ సదస్సుకు హాజరైన ఐటీ రంగ నిపుణులు 21వ శతాబ్దపు టెక్నాలజీ, దీన్ని అనుసరించేందుకు కావలసిన నైపుణ్యాలపై జరిపిన మేధోమథనం ఈ రంగం మరింత వృద్ధి చెందేందుకు మార్గదర్శకంగా నిలిచింది. బయో ఆసియా సదస్సు జీవశాస్త్రాలకు సంబంధించిన పరిశ్రమల్లో నూతన ఆవిష్కరణలను చేపట్టేందుకు కావలసిన వాతావరణం, మౌలిక సదుపాయాల కల్పన, ఔషధ రంగం ఆరోగ్య సంరక్షణ, జీవశాస్త్రాల రంగాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సృష్టించే నూతన కల్పనలకు ఆర్థిక విలువను కల్పించడంపై చర్చలు నిర్వహించింది. ఈ సదస్సు జీవశాస్త్ర, వ్యాపారరంగాల మధ్య ఒక వారధిని నిర్మించింది. ఈ సమకాలిన అంశాలను విజ్ఞాన శాస్త్ర దినోత్సవం సందర్భంగా చర్చించాల్సి ఉన్నది.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో Economic Survey of India-2008 "Transforming Science and Technology In India" నివేదిక, శాస్త్రసాంకేతిక రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రస్ఫుటమవుతున్న నూతన ధోరణులను 2008 భారత ఆర్థిక సర్వే యునెస్కో విజ్ఞాన శాస్త్ర నివేదికగా ప్రస్తావించాయి. శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి సూచికలుగా భావించే.. 1.పరిశోధన, అభివృద్ధిపై వ్యయం. 2.పేటెంట్లు. 3.పరిశోధనా మానవ వనరులు. 4.పరిశోధనా పత్రాల ప్రచురణల విషయంలో, చైనా, ఇజ్రాయెల్, జపాన్, కొరియా, అమెరికా వంటి దేశాలతో పోల్చినప్పుడు మన దేశ వెనుకబాటుతనాన్ని, ఆర్థిక సర్వే ప్రముఖంగా ప్రస్తావించింది. భారతదేశం ఏ దశలోనూ తన అభివృద్ధి స్థాయికి అనుపాతంగా పరిశోధన, అభివృద్ధిపై నిధులు వెచ్చించలేదని పేర్కొన్నది. పరిశోధనల విషయంలో 1950 నాటి కేంద్ర ప్రభుత్వ నిర్ణ యం విశ్వవిద్యాలయాల కంటే పరిశోధనా ప్రయోగశాలలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో విశ్వవిద్యాలయాలు నిధుల కొరతతో ప్రపం చస్థాయి పరిశోధనలను కొనసాగించలేకపోయాయి. కేవలం బోధనకే పరిమితమయ్యాయి. ఈ చర్య దేశావ్యాప్తంగా బోధన, పరిశోధన రంగాల ను బలహీనపరిచిందని తెలిపింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు జాతీయస్థాయి ప్రయోగశాలలకు, విశ్వవిద్యాలయాలకు మధ్య సమన్వయం సాధించవలసి ఉన్నది. పరిశోధన-అభివృద్ధిని విస్తృతపరిచేందుకు కార్యార్థ చోదక వ్యూహాన్ని డార్క్ మేటర్, జెనోమిక్స్, ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్, మ్యాథమెటిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, అగ్రికల్చర్ వంటి రంగాల్లో అమలు పరుచాలి.

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో 2010 నుంచి శాస్త్ర సాంకేతిక నూతన ఆవిష్కరణల పరిణామక్రమాన్ని సామాజిక-ఆర్థిక, భౌగోళిక రాజకీయ, పర్యావరణ రంగాల్లో చోటుచేసుకున్న ధోరణుల నేపథ్యంగా '2030 వైపుగా శాస్త్ర నివేదిక'ను రూపొందించింది. ఈ నివేదిక సమకాలీన విధానాల రూపకల్పనకు, అమలుకు దోహదపడనున్నది. భారత్ గురించి ప్రస్తావిస్తూ, అధిక సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు భారత ప్రభుత్వం ప్రస్తుత సేవల ఆధారిత ఆర్థిక నమూనా నుంచి ఎగుమతుల ప్రాధాన్యంగా తయారీ ఆర్థిక నమూనా ప్రాముఖ్యాన్ని గుర్తించింది. నూతన ఆవిష్కరణలు కేవలం తొమ్మిది పారిశ్రామిక రంగాలకే పరిమితమయ్యాయని, పరిశోధన, అభివృద్ధి వ్యయంలోసగానికిపైగా ఫార్మా, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్ రంగాలకు పరిమితమైంది. నవ కల్పనల సంస్కృతి దేశవ్యాప్తంగా కేవలం ఆరు రాష్ర్టాలకే వ్యాపింపచేయగలిగారు. తద్వారా యాజమాన్యాల అవసరాలను తీర్చగలిగే మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు ఉన్నత విద్యను, పరిశోధనారంగాన్ని సంస్కరించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది. భారత దేశ విశ్వవిద్యాలయాలు నూతన జ్ఞానసృష్టికి, ఉత్తమ బోధనకు నిలయాలుగా మారాలంటే వాటికి అధిక మొత్తంలో నిధులు చేకూర్చవలసిన అవసరాన్ని గుర్తించింది.ఈవిషయాల దృష్ట్యా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను భార తదేశ సుస్థిరాభివృద్ధికి ముఖ్య చోదకశక్తిగా పరివర్తనం చేసేందుకు కింది చర్యలు చేపట్టాలి.

పాఠశాల స్థాయి నుంచి సైన్స్ బోధనను మెరుగుపర్చేందుకు ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయులను, బోధనకు అనుకూలమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలి. శోధనాతత్వాన్ని, శాస్త్రీయగుణాన్ని పెంపొందించడం సైన్సు బోధన ప్రాధాన్యం లక్ష్యంగా ఉండాలి. విజ్ఞానశాస్త్ర అభివృద్ధి, ప్రస్తుతం అతి కీలక సవాళ్లుగా పరిణమించిన శక్తివనరులు, పర్యావరణం, పౌష్ఠికా హారం, తాగునీరు, నివాసాలు, ఆరోగ్యభద్రత, నైపుణ్యాల అభివృద్ధి, నిరుద్యోగం వంటి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే విధంగా విధాన రూపకల్పనలు జరుగాలి. మౌలిక విజ్ఞానశాస్త్ర పరిశోధనలు, అనువర్తిత శాస్త్ర పరిశోధనల మధ్య సమతుల్యతను పాటించాలి. పర్యావరణ, సహజ వనరుల నిర్వహణలో అధిక లబ్ధి పొందేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం ఉపయోగపడాలి. సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లలో విధాన రూపకల్పనలను, సామర్థ్య నిర్మాణాలను అభివృద్ధిపరుచాలి. అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా అమలవుతున్న అటల్ టింకరింగ్ లాబ్స్‌ను దేశంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేయాలి. జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే సైన్స్ ఫేర్స్, జాతీయస్థాయిలో నిర్వహించే సైన్సు కాంగ్రెస్‌లు యథాలాప ప్రక్రియల్లా కాకుండా ఫలితాలను ప్రతిబింబించే విధంగా నిర్వహించాలి. సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ పాలసీ 2013లో సూచించిన విధంగా పరిశోధన, అభివృద్ధిపై కేటాయింపులు స్థూల జాతీయోత్పత్తిలో రెండు శాతంగా ఉండాలి.

పాఠశాల స్థాయి నుంచి సైన్స్ బోధనను మెరుగుపర్చేందుకు ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయులను, బోధనకు అనుకూలమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలి. శోధనాతత్వాన్ని, శాస్త్రీయగుణాన్ని పెంపొందించడం సైన్సు బోధన ప్రాధాన్యం లక్ష్యంగా ఉండాలి. విజ్ఞానశాస్త్ర అభివృద్ధి, ప్రస్తుతం అతి కీలక సవాళ్లుగా పరిణమించిన శక్తివనరులు, పర్యావరణం, పౌష్ఠికా హారం, తాగునీరు, నివాసాలు, ఆరోగ్యభద్రత, నైపుణ్యాల అభివృద్ధి, నిరుద్యోగం వంటి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే విధంగా విధాన రూపకల్పనలు జరుగాలి. మౌలిక విజ్ఞానశాస్త్ర పరిశోధనలు, అనువర్తిత శాస్త్ర పరిశోధనల మధ్య సమతుల్యతను పాటించాలి. పర్యావరణ, సహజ వనరుల నిర్వహణలో అధిక లబ్ధి పొందేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం ఉపయోగపడాలి.

చివరగా మన దేశం జ్ఞాన వినియోగ స్థితి నుంచి జ్ఞాన నిర్మాణ స్థితికి ఎదుగడం, సుస్థిరాభివృద్ధి సాధించడం సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వల్ల మాత్రమేనన్నది అక్షర సత్యం.

(నేడు జాతీయ సైన్స్ దినోత్సవం)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్
బుధవారం 28 ఫిబ్రవరి 2018

WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



ఇందూ మాటల్లో డింకూ అండ్ ఫ్రెండ్స్!!

పెదాలు కదులకుండా మీరు మాట్లాడగలరా? అబ్బే.. కష్టం అంటారా? కరెక్టే?? కానీ అలా మాట్లాడగల కళ ఒకటి ఉందని మీకు తెలిసే ఉంటుంది. అదే వెంట్రిలాక్విజమ్. మాట్లాడుతున్నట్టు ఎదుటివారికి తెలియకుండానే.. చంకలో ఉన్న బొమ్మ మాట్లాడుతుందేమో అన్నట్టు భావన కలిగించే వెంట్రిలాక్విజమ్ మనకు కొత్తేం కాదు. విదేశాల్లో ఎప్పుడో ఫేమస్ అయినా.. ఇండియాలో గత పదేళ్లుగా గల్లీ గల్లీ తిరుగుతున్న కళ ఇది. మనదేశంలో ఆ కళలో రాణిస్తున్న మొట్టమొదటి మహిళనే ఈరోజు మీకు పరిచయం చేద్దామనుకున్నాం.. కానీ తనతో పాటు వెంట్రిలాక్విజమ్‌లో తోడున్న డింకూ మీకు పరిచయం చేస్తా అని గొడవ చేస్తున్నాడు. ఈసారికి.. ఇలా కానిచ్చేయండి. ఇందూశ్రీ గురించి డింకూ ఏం చెబుతున్నాడో వినండి.

డింకూ మాటల్లో ఇందూ!

పది అడుగుల బొమ్మతో వెంట్రిలాక్విజమ్ చేసిన తొలి వెంట్రిలాక్విస్ట్.

హాయ్.. నాపేరు డింకూ. ఇందూశ్రీ గురించి చెప్తుంటే మధ్యలో నేనెందుకొచ్చానా? అనే డౌటొచ్చిందా? మీ డౌటనుమానం నిజమే. దానికో న్యాయముంది. నేనెవరో తెలుసుకోవాలనిపిస్తున్నదా? పై ఫొటోలో ఇందూతో పాటు ఉన్నానే.. అది నేనే. ఇందూ గురించి నా కంటే బాగా మీకు ఎవరూ చెప్పలేరు. అందుకే నేనొచ్చా. ఇందూతో నా స్నేహం మొదలై 22 సంవత్సరాలు. ఇందూ రెండవ తరగతిలో ఉన్నప్పుడు మా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. కానీ.. అప్పటికి తను నాకు ఈ పేరు పెట్టలేదు. నా రూపం కూడా ఇలా లేదు. అప్పుడు చిన్నగా ఉన్నా కదా.. వేరేలా ఉన్నానులే. మీరు గుర్తు పట్టరు. సరే.. ఆ సంగతి వదిలేస్తే.. ఇందూకి చిన్నప్పుడు మ్యాజిక్ అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే మ్యాజిక్ నేర్చుకొని ఎన్నో షోలు కూడా చేసింది. మాటలు నేరిస్తే.. ఎక్కడికెళ్లినా హాయిగా బతికేయొచ్చంటారు. నిజమే.. ఆ మాటకు కాస్త వైవిధ్యం కలిపి, కొత్త కళను జతచేసి ప్రయోగిస్తే.. ఎక్కడున్నా పదిమంది చేత చప్పట్లు కొట్టించుకుంటూ బతికేయొచ్చు. పెదాలు కదులకుండా మాట్లాడుతూ.. మాటలతో మాయ చేస్తూ ఆకట్టుకునే కళలో మనదేశం నుంచి మొదటి మహిళగా రికార్డుల్లో తన పేరు నమోదు చేసుకున్నది ఇందూశ్రీ రవీంద్ర. నిజంగా చెప్పాలంటే ఇందూశ్రీకి దక్కిన క్రెడిట్‌లో సగం నాకు కూడా దక్కాలి. కానీ తనకు పేరొచ్చినా.. నాకు పేరొచ్చినా ఒకటే కాబట్టి.. ఈసారికి క్రెడిటంతా తనకే ఇచ్చేస్తున్నా. హిందీ, ఇంగ్లిష్, కన్నడంలో వెంట్రిలాక్విజమ్ చేస్తున్న తొలి మహిళ ఇందూనే. గత నెల 20న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నది. అసలు ఇందూ మ్యాజిక్ నుంచి వెంట్రిలాక్విజమ్‌కి ఎలా మారిందో తెలుసా?

చాలారోజుల క్రితం అంటే.. 1998లో హైదరాబాద్‌లో మ్యాజిక్ కన్వెన్షన్ జరిగింది. ఆ కన్వెన్షన్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు ఇందూ కూడా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి వచ్చింది. ఆ ప్రదర్శనలో అక్కినేని నాగేశ్వర రావు గారి చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నది. 'ఆ కన్వెన్షన్‌లో నేను వెంట్రిలాక్విజమ్ ప్రదర్శన చూశాను.. అప్పుడే..' హలో.. హలో.. నేను చెప్తున్నా కదా.. మధ్యలో నీ అక్రమ చొరబాటు ఏంటి? ఇలా చేస్తే సహాయ నిరాకరణ చేస్తా జాగ్రత్త..!' 'సరే.. బాబూ.. నువ్వే చెప్పు' ఆ.. అలా రా దారికి. అలా అక్కినేని గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆ కన్వెన్షన్‌లో ఇందూ ఒక వెంట్రిలాక్విజమ్ ప్రదర్శన చూసింది. అంతే.. అప్పటి నుంచి వెంట్రిలాక్విజమ్ మీద ఇష్టం పెంచుకుంది. కానీ.. వెంట్రిలాక్విజమ్ నేర్చుకోవడానికి అప్పట్లో పెద్దగా టెక్నిక్స్ చెప్పేవారు లేరు. టెక్నాలజీ కూడా ఇంతలా అభివృద్ధి చెందలేదు. కానీ ఇందూ మాత్రం ఎలాగైనా వెంట్రిలాక్విజమ్ నేర్చుకోవాలని పట్టుబట్టింది. అందుకు ఆడియో క్యాసెట్లు తెప్పించుకొని వాటిని ప్లే చేస్తే విని, అద్దంలో చూసుకుంటూ ప్రాక్టీస్ చేసింది. ఇప్పుడు ఇలా మనందరి ముందు పెదాలు కదులకుండా మాట్లాడుతున్న మాటల బొమ్మగా.. 'ఏయ్.. మాటలు జాగ్రత్తగా రానీయ్..' 'సారీ.. ఇందూ.. మాటల మాంత్రికురాలిగా.. తొలి మహిళా వెంట్రిలాక్విస్ట్‌గా నిలబడింది. స్పాంటెనిటీగా కథలు చెప్పడం, జోకులు పేల్చడంలో ఇందూ దిట్ట. ప్రస్తుతం రేడియోలో, టీవీల్లో షోలు చేస్తున్నది. ఇప్పుడు బెంగళూరులో ఇందూ వాయిస్ రేడియోలో, టీవీలో వింటే ఇట్టే గుర్తు పట్టేస్తారు. మీకో విషయం చెప్పనా.. చాలామంది మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ ఒకటే అనుకుంటారు. కానీ ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. మిమిక్రీలో రకరకాల వాయిస్‌లు ఇమిటేట్ చేస్తారు. వెంట్రిలాక్విజమ్‌లో పెదాలు కదులకుండా మాట్లాడుతారు. అలా పెదాలు కదులకుండా ఐదు రకాల బొమ్మలతో హావభావాలు పలికిస్తూ మాట్లాడగలదు ఇందూ. ప్రస్తుతం ప్రభుత్వ సంబంధ కార్యక్రమాలు, ఎయిడ్స్ అవగాహన, బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల కోసం ట్రాఫిక్ రూల్స్ అవగాహన, ఫ్రీ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నది. హమ్మయ్యా.. ఇందూ గురించి అంతా చెప్పేశా.. నా పనై పోయింది బాబూ.. కొద్దిసేపు రెస్ట్ తీసుకుంటా!

దేశంలో ఉన్న వెంట్రిలాక్విస్టుల్లో టాప్ ర్యాంకులో ఉన్నది.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో పేరు ఐదుసార్లు పేరు నమోదు చేసుకున్న తొలి వెంట్రిలాక్విస్ట్.

ప్రపంచవ్యాప్తంగా 16 దేశాల్లో ప్రదర్శనలిచ్చింది.

అమెరికాలో జరిగిన అంతర్జాతీయ వెంట్రిలాక్విజమ్‌లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించిన ఏకైక, తొలి మహిళ.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించిన తొలి వెంట్రిలాక్విస్ట్.



నాలుగు బొమ్మలు ఒకేసారి మాట్లాడుతున్నాయనిపించేలా గొంతు మారుస్తూ పెదాలు కదులకుండా మాట్లాడగలగడం ఈమె ప్రత్యేకత.

ప్రపంచవ్యాప్తంగా 3500 షోలు చేసిన తొలి భారత మహిళా వెంట్రిలాక్విస్టు.

యంగ్ అచీవర్ అవార్డు, గ్లోబల్ షేపర్స్ అవార్డు, ఇందిరా ప్రియదర్శిని అవార్డులూ అందుకున్నది.

'హలో.. హలో.. డింకూ ఏంటీ.. నా గురించి పూర్తిగా చెప్పేశా అని సంబురపడకు. అసలు నేనెక్కడి నుంచి వచ్చానో.. నా పుట్టు పూర్వోత్తరాల గురించి మనవాళ్లకు చెప్పావా? నేను చెప్తా చూడు.. హాయ్ అండీ! నా పూర్తి పేరు ఇందూశ్రీ రవీంద్ర. నాన్న రవీంద్ర నాకు వెంట్రిలాక్విజమ్ నేర్చుకోవడంలో చాలా సహాయపడ్డాడు. టెక్నికల్‌గా ఆయన ఇచ్చిన సపోర్టే నన్ను నిలబెట్టింది. బొమ్మలు తయారుచేయడం, వాటిని ఎలా ఆపరేట్ చేయాలో అన్నీ నాన్నే నేర్పించాడు. మామయ్య రామ్‌నాథ్ స్క్రిప్ట్ విషయంలో హెల్ప్ చేశారు. ఇక పుట్టింది, పెరిగింది, చదివింది అంతా బెంగళూరులోనే. బెంగళూరు యూనివర్సిటీలో ఎం.ఎస్. కమ్యూనికేషన్ చేశా. చిత్రకళా పరిషత్‌లో బి.ఎఫ్.ఏ. పూర్తి చేశాను. డింకూ మీకు చాలా విషయాలు చెప్పాడు కదా.. తను చెప్పని, చెప్పలేని విషయం మీకొకటి చెప్పనా? అసలు వెంట్రిలాక్విజమ్ చేయాలంటే పప్పెట్ (బొమ్మ) తప్పనిసరేం కాదు. కాకపోతే ఏదో ఫన్ క్రియేట్ అవుతుందని బొమ్మ వాడుతారు. టవల్, ఖర్చీఫ్, కాఫీ మగ్ ఇలా ఏదైనా వాడి వెంట్రిలాక్విజమ్ చేయొచ్చు. కాకపోతే పెదాలు కదులకుండా మాట్లాడడం అనేది బాగా ప్రాక్టీస్ చేస్తేనే వస్తుంది. ఎదుటివారికి అసలు మన గొంతులోంచే మాట వస్తుందా? అనేలా మాయ చేయాలంటే సాధన ముఖ్యమనే విషయం మరిచిపోవద్దు. ఈ నెల 26, 27 తేదీల్లో రవీంద్ర భారతిలో రెండురోజుల పాటు వెంట్రిలాక్విజమ్ వర్క్‌షాప్ నిర్వహించాం. ఆసక్తి ఉన్నవారిని కొన్ని పరీక్షల ద్వారా సెలెక్ట్ చేశాం. ఎలాంటి ఫీజు లేకుండా రెండురోజుల పాటు ఈ వర్క్‌షాప్ నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారు మాకు చాలా సహకరించారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పాలి. ఈ విషయాలన్నీ డింకూకు తెలియదు కాబట్టి చెప్పలేదు. డింకూ.. ఇంకేమైనా చెప్తావా? ముగించేయనా?'

హలో.. హలో.. ఆగాగు.. ఏమండోయ్.. ఇందూ చెప్పిన విషయాలన్నీ నాక్కూడా తెలుసు. కానీ తనకు కూడా మీతో మాట్లాడే అవకాశం ఇవ్వాలి కదా! అని ఇలా చేశా. తను ఇంకో ముఖ్యమైన విషయం మర్చిపోయింది. ఏంటో తెలుసా.. మీ అందరికీ థాంక్స్ చెప్పడం. ఇందూ తరపున కూడా నేనే చెప్పేస్తున్నా.. మీ అందరికీ చాలా చాలా థాంక్స్.. ఉంటా.. బై.. బై!

ప్రవీణ్‌కుమార్ సుంకరి

మురికివాడలను చక్కదిద్దుతున్నది!

ఒకవైపు ఆకాశహర్మ్యాలు.. మరోవైపు మురికివాడలు ఇది ముంబైనగరం పరిస్థితి. అయితే ఆ మురికి వాడలని సుందరంగా మార్చడమే కాదు.. అక్కడి ప్రజలను కూడా మార్చే పనిలో పడింది రౌబ్లీ నాగీ.



వైరుధ్యాలకు నెలవు ముంబై మహానగరం. అక్కడ కొన్ని కిలో మీటర్ల మేర మురికివాడలు వ్యాపించి ఉన్నాయి. ఆ ప్రాంతంలో కరెంటు ఇబ్బందులు, ఒకపూట భోజనం చేయని వాళ్లు ఎంతోమంది తారసపడుతారు. అదే నగరానికి చెందిన సంపన్నురాలు రౌబ్లీ నాగీ. మంచి పెయింటర్ ఆమె. దశాబ్ద కాలంగా 'మిసైల్' పేరిట ముంబై మురికి వాడలను బాగు చేస్తున్నది. ఇందులో 'పెయింట్ దార్వీ' ప్రాజెక్ట్ ముఖ్యమైనది. కనీసం ఉండే ఇళ్లు అందంగా ఉంటే ఆలోచన రీతిలో మార్పు వస్తుందని ఆమె అనుకుంది. ముందు ఒక్కతిగా ఈ ప్రాజెక్ట్‌ని మొదలుపెట్టింది. దానికి ఆ మురికివాడలోని జనాలు, సెలెబ్రిటీలు కూడా చేయూతనందించారు. అలా చాలా మురికివాడలను సుందరంగా తీర్చిదిద్దింది. అయితే ఈ క్రమంలో అక్కడ నివాసితులు అపరిశుభ్రంగా జీవనం కొనసాగిస్తున్నట్లు గమనించింది రౌబ్లీ. ఎలా హైజీన్‌గా వ్యవహరించాలనే విషయం మీద వర్క్‌షాపులు నిర్వహించింది. అలాగే అక్కడి ఆడవాళ్లు సొంతంగా సంపాదించుకునే మార్గాలను చూపించింది. అంతే కాదు.. ఎన్నో సమస్యల మీద అక్కడ వాళ్లతో చర్చించి ఆ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించింది. ఇప్పటికీ ఈ మిసైల్ కొనసాగిస్తూనే ఉంది. మురికివాడలను పరిశుభ్రంగా ఉంచే దిశలో ముందడుగులు వేస్తున్నది.

స్ట్రెయిటనింగ్‌తో ఇబ్బందైతే..



జుట్టు స్టైలింగ్‌లో స్ట్రెయిటనింగ్ ఒకటి. దీనివల్ల ఇబ్బందులనేవి సహజం. అలా నష్టం కలిగిన జుట్టుకు సహజ సిద్ధమైన పద్ధతుల ద్వారా పూర్వ వైభవాన్ని తీసుకురావచ్చు.

- హెన్నా పొడిలో, కొబ్బరి నూనె, పెరుగు కలిపి జుట్టుకు రాయాలి. 45నిమిషాల తర్వాత షాంపూ ఉపయోగించి గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ మిశ్రమాన్ని వారానికి ఒకసారి వాడడం వల్ల జుట్టుకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- గుడ్డులో తెల్లసొనని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దీంట్లో బాదం నూనె కలిపి జుట్టు చివర్ల వరకు రాయాలి. గంటసేపు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల జుట్టు కుదుళ్లకు మంచి పోషణ కలుగుతుంది.
- ఆలివ్‌నూనె 30 సెకన్ల పాటు మైక్రోఓవెన్‌లో వేడి చేయాలి. దాన్ని కుదుళ్లకు పట్టించి మర్దనా చేయాలి. ఉదయం లేవగానే సాధారణ షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి మూడుసార్లు చేయొచ్చు.

బిట్స్ కార్నర్

సరికొత్త ప్రచారం!



బాగాలేమని ఎవరికీ చెప్పకోవాలనుకోం. ఒకవేళ చెప్పాల్సి వస్తే ఎంతో కుంగిపోతాం. కానీ ఈ అమ్మాయి కుంగిపోలేదు. పైగా అలా కుంగిపోయేవాళ్లకు నేనున్నానంటూ ప్రచారం చేస్తున్నది.

నోవా గెలాక్సియా.. పాలిసెస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో బాధపడుతున్నది. పద్నాలుగేళ్ల వయసప్పుడు ఈ సమస్య వచ్చింది. అప్పటి నుంచి ముఖం మొత్తం జుట్టు పెరిగింది. దీంతో గెలాక్సియా బయటికి వెళ్లాలంటే అందరూ గేలి చేస్తారని భయపడేది. అందుకే ఎప్పటికప్పుడు షేవింగ్ చేసేది. ఇప్పుడు ఆమె వయసు 26 సంవత్సరాలు. ఇప్పటికీ ఆమెను ఈ సమస్య బాధిస్తూనే ఉన్నది. గతేడాది నవంబర్‌లో 'నో షేవ్ నవంబర్'లో పాల్గొనాలని నిర్ణయించుకుంది. పైగా అలాగే ముఖం మీద జుట్టుతో క్యాన్సర్ పేషెంట్ల అవేర్‌నెస్ కోసం ప్రచారం చేసింది. ఆ సమయంలో తనలో ఏదో తెలియని ఆత్మవిశ్వాసం పెంపొందింది. నవంబర్ అయిపోయింది. అయినా ఆమె షేవింగ్ చేసుకోలేదు. ఇక పై చేసుకోవద్దని కూడా అనుకుంది. పైగా మీసాలు, గడ్డాన్ని తన జుట్టు రంగుతో మ్యాచ్ అయ్యేలా రంగు వేసింది. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకుంది. ఇన్నాళ్లూ తను పడిన వేదనంతా సోషల్ మీడియా ద్వారా అందరితో పంచుకుంది. అందరూ ఆమెకు బాసటగా నిలిచారు. అంతేకాదు.. తనలా పీసీఓఎస్‌తో బాధపడుతూ, ఈ సమస్యను అనుభవించే వాళ్లందరికీ నేనున్నానంటూ ప్రచారం కూడా మొదలుపెట్టింది గెలాక్సియా. మనం మనలాగా ఉండాలి, ఎవరికోసమో అందాన్ని మెరుగుపరుచుకోవద్దనే సందేశాన్నిస్తున్నది.


కీళ్ల నొప్పికి విముక్తి లేదా?



నా వయసు 47 సంవత్సరాలు. పండ్లతోటల రైతును. గడచిన ఏడాది కాలంగా నా ఆరోగ్యంలో విపరీతమైన మార్పు కనిపిస్తుంది. ఆకలి మందగించింది. కాళ్లు, చేతుల కీళ్లు వాస్తున్నాయి. కీళ్లు నొప్పితో బిగుసుకుపోతున్నాయి. స్థానిక డాక్టర్‌కు చూపిస్తే కీళ్ల నొప్పికి మందులు రాశారు. అవి వేసుకున్న ఫలితం కనిపించడం లేదు. ఉదయం పూట కీళ్లు ఎక్కువ సేపు బిగుసుకుపోతుండడంతో రోజు వారీపనులు చేసుకోలేకపోతున్నాను. తోటపనితో రోజు తగినంత శారీరక శ్రమ ఉండడంతో పాటు ఆహారపరంగా ముందు నుంచి జాగ్రత్తలు తీసుకుంటున్నాను. మరే వ్యాధులు లేవు. అయినా కీళ్ల నొప్పులు రావడానికి కారణం ఏమిటి? మధ్య వయస్సులో ఈ రకమైన కీళ్ల నొప్పులు తప్పవా? దయచేసి వీటి నుంచి విముక్తికి మార్గం సూచించండి.

సి. మృత్యుంజయం, చౌటుప్పల్

మీరు తెలిపిన వివరాలను బట్టి చూస్తే మీరు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్టు అనిపిస్తుంది. ఉదయం పూట కీళ్లు ఎక్కువ సేపు బిగుసుకుపోతుండడం రుమటాయిడ్ ఆర్థరైటిస్ ప్రధాన వ్యాధి లక్షణంగా గుర్తించడం కొంచెం కష్టం. కీళ్లకు సంబంధించిన ఇతర వ్యాధుల లక్షణాలుగా కనిపిస్తుంటాయి. అయితే రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో శరీరంలోని ఎడమ కుడి రెండు వైపుల కీళ్లలోనూ సమస్యలు కనిపిస్తాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధిని ఆటోఇమ్యూన్ డిసీజ్‌గా పరిగణిస్తారు. ఇంతకు మించి ఈ వ్యాధి రావడానికి కచ్చితమైన కారణాలు తెలియలేదు. ఆటోఇమ్యూన్ డిసీజ్ అంటే శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థలో ఏర్పడిన లోపాల కారణంగా శరీరంలోని కణాల మీద నిరంతరాయంగా దాడి చేస్తుంటుంది. అందువల్ల రకరకాల అనారోగ్యాలు కలుగుతాయి. వాటిలో ఒకటి రుమటాయిడ్ ఆర్థరైటిస్. ఈ సమస్య ఒక్కోసారి వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. జ్వరం, ఆకలి మందగించడం, నోరు ఎండిపోయినట్టు అనిపించడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. జ్వరం వస్తుంటుంది. తీరని అలసటగా ఉంటుంది. మొదట్లో కాళ్లు, చేతుల వేళ్ల వంటి చిన్నకీళ్లు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతాయి. కీళ్లు బిగుసుకోవడం వల్ల ఉదయం వేళల్లో బాధ ఎక్కువగా ఉంటుంది. కొంతమందిలో రోజంతా కూడా ఉండొచ్చు. కొంత కాలానికి కీళ్ల రూపం మారిపోయి వికృతంగా మారుతాయి. మీరు వీలైనంత త్వరగా రుమటాలజిస్ట్‌ను సంప్రదించండి. ప్రత్యేక పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేసుకొని చికిత్స తీసుకోండి.



డాక్టర్ ప్రవీణ్ రావు
సీనియర్ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట సర్జన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 28 ఫిబ్రవరి 2018
టెక్నాలెడ్జీ 2.0

నయామాల్



మోటో జెడ్2 ఫోర్స్!

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటోరోలా మరో సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ని మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా వచ్చిన ఆ మొబైల్ ఫీచర్లు మీకోసం..

డిస్‌ప్లే	: 5.5 అంగుళాల క్వాడ్ హెచ్‌డీ డిస్‌ప్లే
ఆండ్రాయిడ్	: 8.0 ఓరియో
ప్రాసెసర్	: క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 835
రిజల్యూషన్	: 1440 X 2560 పిక్సెల్స్
ఇంటర్నల్ మెమొరీ	: 64 జీబీ (2టీబీ వరకు పెంచుకునే సామర్థ్యం)
రామ్	: 6 జీబీ
రియర్ కెమెరాలు	: 12 మెగా పిక్సెల్ +12 మెగాపిక్సెల్
ఫ్రంట్ కెమెరా	: 5 మెగాపిక్సెల్స్
బ్యాటరీ సామర్థ్యం	: 2730 ఎంఏహెచ్
రంగులు	: సూపర్ బ్లాక్, ఫైన్ గోల్డ్, ల్యూనర్ గ్రే
ఇతర ఫీచర్లు	: ఫింగర్ ప్రింట్, హెచ్‌టీఎమ్ 5 బ్రౌజర్
ధర	: రూ. 34, 998

ఉచితంగా 60వేల పుస్తకాలు!



ఉద్యోగ వేటలో ఉన్నారా? సరైన గైడెన్స్ దొరుకడం లేదా? అవసరమైన మెటీరియల్స్ కోసం ఆన్‌లైన్‌లో అద్భుత అవకాశం ఉంది. నేషనల్ డిజిటల్ లైబ్రరీలో దాదాపు 60వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూపొందిన ఈ-గ్రంథాలయంలోని పుస్తకాలను ఉచితంగా చదువుకునే వెసులుబాటు ఉంది. మార్కెట్‌లో లభ్యం కాని పుస్తకాలు కూడా ఇందులో ఉన్నాయి. ఇందులో మొత్తం ఆరు విభాగాలు ఉన్నాయి. దీంట్లో ఉచితంగా చదువుకోవడానికి ఈ స్టెప్స్ ఫాలో అవ్వండి.

- ఈ -గ్రంథాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎన్‌డీఎల్.ఐఐటీకేజీపీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి.
- అక్కడ మీకు కనిపించే అంశాలను చూసుకుంటూ వ్యక్తిగతంగా, సంస్థలపరంగా సమాచారాన్ని నమోదు చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఇందులో ఈ-మెయిల్, చిరునామా వివరాలు నమోదు చేయాలి. ఒకసారి నమోదు చేసుకుంటే ఎప్పుడైనా ఉచితంగా చదువుకోవచ్చు.
- అయితే మనం ఇచ్చిన పాస్‌వర్డ్, యూజర్ ఐడీని మాత్రం మరువకూడదు. ఆండ్రాయిడ్ ఫోనులు ఉన్నవారంతా ఈ-పుస్తకాలను చదువచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ఇందులో 31లక్షల మంది రాసిన పుస్తకాలు 70భాషల్లో లభ్యమవుతున్నాయి. ఇందులో ఏ రకం పుస్తకం కావాలో దానిపై క్లిక్ చేస్తే సరిపోతుంది. ఇందులో దొరికే సమాచారాన్ని ఒక నోట్స్ రూపంలో రాసుకుంటే రాబోయే రోజుల్లో పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుంది.
- ఈ వెబ్‌సైట్‌లో మూడు లక్షల వ్యాసాలకు చోటిచ్చారు. సివిల్స్, గ్రూప్స్ తదితర ఉన్నత ఉద్యోగాల కోసం పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇవి ఉపయోగపడుతాయి.
- అంతేకాదు.. 262 ఆడియో లెక్చర్స్ కూడా ఇందులో లభ్యమవుతాయి. వీడియో లెక్చర్స్ 18వేల వరకు ఉన్నాయి.
- సైకాలజీ, ఫిలాసఫీ, కంప్యూటర్‌సైన్స్, ఫీచర్ రీసోర్స్‌కి చెందిన వేలకొద్ది పుస్తకాలు కూడా ఈ గ్రంథాలయంలో దొరుకుతాయి.

6 ఇన్ 1 పవర్ చార్జర్!



భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్‌గా గుర్తింపు తెచ్చుకున్న జిబ్రానిక్స్. ఇది 'ఎస్టీమ్' పేరుతో సరికొత్త 6 ఇన్ 1 పవర్ చార్జర్‌ను మార్కెట్లో లాంచ్ చేసింది.

పవర్‌బ్యాంక్ అంటే కేవలం ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్‌లకు చార్జింగ్ పెట్టుకుంటామని తెలుసు. కానీ దీని ద్వారా వైర్‌లెస్ ఆడియో సపోర్ట్, స్పీకర్, ఎల్‌ఈడీ టార్చ్, ఎఫ్‌ఎం రేడియో, మైక్రో ఎస్డీ ప్లేయర్, పవర్‌బ్యాంక్‌గా ఉపయోగించుకోవచ్చు. బైస్కిల్ మౌంట్ సపోర్ట్‌తో వచ్చిన ఈ మల్టీ పర్పస్ ప్రొడక్ట్‌ను రైడర్స్ తమ సైకిల్స్‌కి ఫిట్ చేసుకొని మనకు నచ్చిన రీతిగా దీన్ని ఉపయోగించుకోచ్చు. 2000ఎమ్ఏహెచ్ పవర్ బ్యాంక్ సపోర్ట్‌తో ఇది నడుస్తుంది. బ్లూటూత్ కనెక్టివిటీతో మ్యూజిక్ కూడా ఆస్వాదించుకోవచ్చు. ప్రయాణాలు చేసేటప్పుడు ఈ పవర్ బ్యాంక్ బాగా పనిచేస్తుంది. ఈ పవర్ బ్యాంక్ మీద మూడు బటన్స్ ఉంటాయి. దీని ద్వారా బ్లూటూత్, ఎల్ ఈడీ టార్చ్, వాయిస్, కాల్ కంట్రోలింగ్ ఫీచర్లను హ్యాండిల్ చేయొచ్చు. చాలా తక్కువ బరువు ఉండే ఈ ఈ పవర్ బ్యాంక్ ధర 1300 రూపాయలు. అన్ని ప్రముఖ స్టోర్‌ల్లో ఇది లభ్యమవుతుంది.



టెక్నాలజీ ప్రియులను ఏటేటా ఊరించే మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ ఈసారి కూడా సరికొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరచయం చేసింది. కొత్త కొత్త టెక్నాలజీతో, అప్‌డేటెడ్ వర్షన్లతో మొబైల్ ప్రియులను ఆకట్టుకునే స్మార్ట్‌ఫోన్ల పరిచయానికి బార్సిలోనాలో జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ వేదికయింది. 5జీ టెక్నాలజీతో పాటు మరెన్నో ఆవిష్కరణలు జరిగిన బార్సిలోనా మొబైల్ జాతర విశేషాలేంటో తెలుసుకుందామా!

బార్సిలోనాలో.. సెల్ ఫోన్ల జాతర

MWC 2018

వినూత్న సాంకేతికతకు బార్సిలోనా వేదికైంది. ఈ నెల 25న ప్రారంభమై మార్చి 1న ముగియనున్న ఈ మొబైల్ జాతరలో టెక్ దిగ్గజాలన్నీ పాల్గొంటున్నాయి. ఈ ఏడాదిలో అప్‌డేట్ చేసిన సాంకేతికతో రూపొందించిన మొబైల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, టీవీలు, కొత్త డివైజ్‌ల ఆవిష్కరణలకు మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ వేదికయింది. 5జీ, మొబైల్ చిప్స్, వీర్ లాంటి టెక్నాలజీ అమర్చిన గాడ్జెట్లు ఇక్కడ కొలువుదీరాయి.

ఆకట్టుకున్న గెలాక్సీ ఎస్9 సిరీస్..



మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో సామ్‌సంగ్ గెలాక్సీ తన అమ్ములపొది నుంచి కొత్తగా రెండు మోడళ్లను ప్రవేశపెట్టింది. గెలాక్సీ ఎస్9, గెలాక్సీ ఎస్9 ప్లస్ పేరుతో మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ ఆవిష్కరించిన రెండు మోడళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఫేస్ రికగ్నిజేషన్, అగ్‌మెంటల్ రియాలిటీ (ఏఆర్)ఈమోజీ, ఇన్ఫినిటీ డిస్‌ప్లే, డాల్బీ సరౌండ్ స్టీరియో, వంటి ఫీచర్లు మొబైల్ ప్రియులను కట్టిపడేస్తున్నాయి. ఐఫోన్‌లో సృష్టించినట్టుగా ఈ రెండు మోడల్స్‌లో కూడా ఈమోజీలు సృష్టించుకోవచ్చు. సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్9లో 5.8కర్వ్‌డ్ సూపర్ ఎమోలెడ్ డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 8 ఓరియా ఓఎస్, 1440x2960 రెజుల్యూషన్, 4జీబీ ర్యామ్, 64జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 12 మెగాపిక్సెల్స్ రియర్ కెమెరా, 8 మెగాపిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం వంటి అదనపు ఫీచర్లున్నాయి. సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్9ప్లస్‌లో.. 6.2 కర్వ్‌డ్ సూపర్ ఎమోలెడ్ డిస్‌ప్లే, 8.0 ఓరియో ఆండ్రాయిడ్ వెర్షన్, , 1440x2960 రెజెల్యూషన్ , 6జీబీ ర్యామ్, 256జీబీ ఇంటర్నల్ స్టోరేజ్, 12 మెగాపిక్సెల్స్ డ్యుయల్ రియర్ కెమెరా, 8 మెగాపిక్సెల్స్ సెల్ఫీ కెమెరా, 3500 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం వంటి అదనపు ఫీచర్లున్నాయి. గెలాక్సీ ఎస్9 ధర రూ. 46వేలు, గెలాక్సీ ఎస్9ప్లస్ ధర రూ.54వేలు ఉండొచ్చని అంచనా.

నోకియా కొత్త మోడళ్లు..



నోకియాను కొనేసిన హెచ్‌ఎండీ గ్లోబల్ సంస్థ ఈ మొబైల్ జాతరలో నోకియా ఫోన్లను మరోసారి కొత్తగా పరిచయం చేసింది. నోకియా8 సిరోకో, నోకియా 7ప్లస్, న్యూ నోకియా6, నోకియా1 పేర్లతో సరికొత్త స్మార్‌ఫోన్లను ఆవిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆండ్రాయిడ్ గో వెర్షన్‌లోని ఓరియోతో టెక్నాలజీలో రానున్న మొట్టమొదటి ఫోన్ నోకియా1. వినియోగదారులకు అందుబాటులో ఉండే ధరలో ఈ మొబైల్ ఈ వారంలోనే మార్కెట్లోకి రానుంది. 6జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో నోకియా 8సిరోకో, 4జీబీ ర్యామ్‌తో నోకియా 7ప్లస్, 3/4జీబీ ర్యామ్‌తో న్యూ నోకియా6 ఫోన్లను మార్కెట్లోకి తీసుకురానుంది హెచ్‌ఎండీ.

జియోకి పోటీగా నోకియా 8110



జియో 4జీ ఫోన్లకు దీటుగా నోకియా 8110 పేరుతో 4జీ మొబైల్ ఆవిష్కరించింది. 2.4 అంగుళాల కర్వ్‌డ్ డిస్‌ప్లేతో ఈ మొబైల్ రూపొందించారు. స్లైడ్ రూపంలో అమర్చిన కీబోర్డుతో ఈ ఫోన్ డిజైన్ చేశారు. స్లైడ్ కిందకు లిఫ్ట్ చేస్తే ఆటోమేటిక్‌గా ఫోన్‌కాల్ లిఫ్ట్ అవుతుంది. స్లైడ్ క్లోజ్ చేస్తే కాల్ కట్ అవుతుంది. క్వాల్కమ్ కంపెనీకి చెందిన స్నాప్‌డ్రాగన్ 205 మొబైల్ ప్లాట్‌ఫాం చిప్‌సెట్‌ను ఈ మొబైల్‌లో ఏర్పాటు చేశారు. 1.1 గిగాహెడ్జ్ సామర్థ్యంతో డ్యుయల్ కోర్ ప్రాసెసర్ ఉన్న ఈ ఫోన్ ధర రూ.6500 ఉండొచ్చని అంచనా.

సోనీ నుంచి మూడు మోడళ్లు..



బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ జాతరలో ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్2, ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్2 కాంపాక్ట్, ఎక్స్‌పీరియా ఇయర్ డ్యుయో హెడ్‌ఫోన్స్ పేరుతో సోనీ సరికొత్త మూడు ఉత్పత్తులను పరిచయం చేసింది. 19 మెగాపిక్సెల్స్ కెమెరాతో రూపొందించిన ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్2లో ఆకట్టుకునే ఫీచర్లున్నాయి. ఈ మొబైల్‌తో 4కే హెచ్‌డీఆర్ క్వాలిటీ వీడియో తీయవచ్చు. ఈఫోన్‌తో తలను 3డీ స్కాన్ చేయవచ్చు. 3180 ఎంఏహెచ్ సామర్థ్యంతో రూపొందించిన ఈ మొబైల్ వచ్చే ఏప్రిల్‌లో మార్కెట్లోకి రానుంది. సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్2 కాంపాక్ట్ 4జీబీ ర్యామ్ సామర్థ్యంతో పనిచేస్తుంది. బ్యాటరీ సామర్థ్యం 2,870 ఎంఏహెచ్. సోనీ ఎక్స్‌పీరియా ఇయర్ డ్యుయో పేరుతో హెడ్‌సెట్‌ని ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 18,170.

5జీ చిప్ ప్రత్యేక ఆకర్షణ..

హువాయ్ కంపెనీ ఈ మొబైల్ జాతరలో ఆవిష్కరించి 5జీ టెక్నాలజీ చిప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని పేరు బలాంగ్ 5జీ-01. ఈ చిప్ 3



జీపీపీ స్టాండర్డ్ నెట్‌వర్క్‌తో పనిచేస్తుంది. డౌన్‌లోడింగ్ డేటా సామర్థ్యం సెకనుకు 2.3 గిగాబైట్లు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 600 మిలియన్ డాలర్ల ఖర్చు చేసింది హువాయ్. ఇంటెల్, క్వాల్‌కమ్ వంటి ఇతర తయారీదారులకు ఈ చిప్ గట్టిపోటీ ఇవ్వబోతున్నది. 2019 చివరినాటికి మైక్రోసాఫ్ట్, డెల్, లెనోవా వంటి దిగ్గజ కంపెనీల లాప్‌టాప్‌ల్లో 5జీ మోడెమ్‌లను అమర్చడానికి ఒప్పందం కుదుర్చుకున్నది హువాయ్ కంపెనీ. 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తే.. ప్రస్తుతం ఉన్న ఎల్‌టీఈ నెట్‌వర్క్‌లు కూడా గణనీయంగా తగ్గుతాయనడంలో ఏమాత్రం సందేహం లేదంటున్నది హువాయ్ కంపెనీ. 2020 నాటికి 5జీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు ముమ్మరం చేసింది హువాయ్.



ఎల్‌జీ వీ30 ఎస్ థిన్‌క్యూ..



'వీ30ఎస్ థిన్‌క్యూ' పేరుతో ఎల్‌జీ తన సరికొత్త మోడల్ స్మార్ట్‌ఫోన్‌ను మొబైల్ కాంగ్రెస్‌లో ఆవిష్కరించింది. ఆరు నెలల క్రితమే ఈ మొబైల్‌కి రూపకల్పన జరిగింది. మెరాకన్ బ్లూ, ప్లాటినమ్ గ్రే రంగుల్లో ఈ హ్యాండ్‌సెట్ అందుబాటులో ఉంది. 4/6జీబీ ర్యామ్, ఇంటర్నల్ స్టోరేజీ 128జీబీ.

హువాయ్ ఉత్పత్తులు..



సరికొత్త మోడళ్లతో హువాయ్ ఈ మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మేట్‌బుక్ ఎక్స్‌ప్రో పేరుతో ల్యాప్‌టాప్, మీడియా ప్యాడ్5 పేరుతో ట్యాబ్‌లను ఈ టెక్ జాతరలో ఆవిష్కరించింది. ఆపిల్, మైక్రోసాఫ్ట్ లాంటి వర్షన్లకు తగ్గట్టుగా హువాయ్ తన కొత్త లాప్‌టాప్‌ను రూపొందించింది. దీని ధర రూ. 1,20,000 వరకు ఉండే అవకాశం ఉంది. ఇక ట్యాబ్ విషయానికొస్తే.. 10.8, 8.4 అంగుళాల డిస్‌ప్లేతో మీడియా ట్యాబ్ రూపొందించారు. దీని ధర రూ. 27,903 ఉండొచ్చని అంచనా.

భారీ బ్యాటరీ పవర్‌మ్యాక్స్



ఎక్కువసేపు ఛార్జింగ్ ఉండాలన్న కాన్సెప్ట్‌తో భారీ బ్యాటరీతో సరికొత్త మొబైల్‌ని రూపొందించింది ఎనర్జైజర్ అనే సంస్థ. వినియోగదారులను ఆకట్టుకోడానికి దాదాపు 16000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో సరికొత్త మొబైల్ మోడల్స్ పరిచయం చేసింది ఎనర్జైర్ కంపెనీ. ఎనర్జైజర్ పవర్‌మ్యాక్స్ పీ16కే ప్రో, ఎనర్జైజర్ పవర్‌మ్యాక్స్ పీ490ఎస్, ఎనర్జైజర్ హార్డ్ కేస్ హెచ్590ఎస్ పేరుతో ఈ మొబైల్స్ అంతర్జాతీయ మార్కెట్లోకి త్వరలో అందుబాటులోకి రానున్నాయి. 8.0 ఓరియో ఆండ్రాయిడ్ వర్షన్, 6జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 16, 13 మెగాపిక్సెల్స్ రియర్ కెమెరా, 13, 5 మెగాపిక్సెల్స్ ఫ్రంట్ కెమెరాలతో ఈ మొబైల్ రూపొందించారు. ఎనర్జైజర్ పవర్‌మ్యాక్స్ పీ 490 పీఎస్, ఎనర్జైజర్ హార్డ్‌కేస్ హెచ్590 ఎస్ పేరుతో రూపొందించిన మొబైల్స్‌లో కూడా ఆకట్టుకునే ఫీచర్లున్నాయి.

జెడ్‌టీఈ కొత్త మొబైల్స్..



జెడ్‌టీఈ సంస్థ బ్లేడ్ వీ9, బ్లేడ్ 9వీటా పేరుతో తన మొబైల్ ఉత్పత్తులను మొబైల్ కాంగ్రెస్‌లో పరిచయం చేసింది. 8.1 ఓరియో ఆండ్రాయిడ్ వెర్షన్, 16, 5 మెగాపిక్సెల్స్ రియర్, ఫ్రంట్ కెమెరాలతో 3/4 జీబీ ర్యామ్ బ్లేడ్ వీ9, బ్లేడ్ వీ9 వీటా ఫోన్లలో అందుబాటులో ఉన్న ఫీచర్స్. ఇక ఈ మొబైల్స్ ధర విషయానికి వస్తే.. బ్లేడ్ వీ9 ధర 21,450, బ్లేడ్ 9వీటా ధర 21,000 వరకు ఉండే అవకాశం ఉంది.

హైలెట్స్

- మోటోరోలా ఈ5 ప్లస్ మోడల్ అతి తర్వలోనే మార్కెట్‌లోకి రానున్నది.
- 16 మెగాపిక్సెల్స్ కెమెరా, 4జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమొరి, 300 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లతో ఎస్‌టీకే కంపెనీ ఎక్స్2 మోడల్ ఫోన్‌ను ఈ మొబైల్ కాంగ్రెస్‌లో ఆవిష్కరిచింది.
- 'గూగుల్ హోమ్ అసిస్టెంట్' గూగుల్ పేరుతో రూపొందించిన వాకీటాకీని ఈ సదస్సులో పరిచయం చేసింది. వాయిస్ రికార్డు చేసి ఎక్కడికైనా వాయిస్ మెసేజ్‌లు పంపొచ్చు. ఈ డివైజ్‌ను ఇంటర్ కనెక్ట్ చేసుకొని ప్రపంచంలో ఎక్కడి నుంచైనా, ఎక్కడికైనా మాట్లాడుకోవచ్చు. ఈ డివైజ్‌లో నాలుగు భాషలను పొందుపర్చారు. త్వరలో మరికొన్ని భాషలను నేర్చనున్నారు.
- ఆల్కాటెల్ ఈ మొబైల్ కాంగ్రెస్‌లో మూడు మోడళ్లను పరిచయం చేసింది. వాటిల్లో ఆల్కాటెల్ 5, ఆల్కాటెల్ 1టీ, ఆల్కాటెల్ 3 ఉన్నాయి.

రవికుమార్ తోటపల్లి

ట్రంప్ నుంచి స్పీడ్‌మాస్టర్

అదిరిపోయే ఫీచర్స్‌తో మార్కెట్‌లోకి ట్రంప్ బోన్‌విల్లే స్పీడ్‌మాస్టర్ బైక్ రయ్ మంటూ దూసుకొచ్చింది. దీని ధర, అదనపు ప్రత్యేకతలివి.



గత ఏడాది కుర్రకారును షేక్ చేసిన బోన్‌విల్లే బాబర్ ఆధారంగా బోన్‌విల్లే స్పీడ్‌మాస్టర్ రయ్‌మంటూ వచ్చింది. సాంకేతికంగా బాబర్, స్పీడ్‌మాస్టర్ బైక్‌లో ఒకే ఇంజిన్ ఉంది. స్పీడ్‌మాస్టర్‌లో 1200 సీసీ కెపాసిటీ గల ప్యార్లర్ ట్విన్ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ ఉన్నది. స్పీడ్‌మాస్టర్‌లో కూడా 6-స్పీడ్ గేర్‌బాక్స్, ఛాసిస్, స్వింగ్ ఆర్మ్, సస్పెన్షన్ సిస్టమ్ ఉన్నది. ముందువైపు 310 ఎంఎం డిస్క్ బ్రేకులు, వెనుకవైపు సింగిల్ 255 ఎంఎం డిస్క్‌బ్రేక్ ఉన్నది. ఫుల్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, రైడ్-బై-వైర్ టెక్నాలజీ, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ట్రాక్షన్ కంట్రోల్, ఇంజిన్ ఇమ్మొబిలైజర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. స్పీడోమీటర్, క్రూయిజ్ కంట్రోల్, రెండు విభిన్న రైడింగ్ మోడ్స్, టార్క్ అసిస్ట్ క్లచ్ వంటివి అదనపు ఫీచర్లు. ఈ స్పీడ్ మాస్టర్‌లో ఇరువైపులా 16 అంగుళాల స్పోక్‌వీల్స్ ఉన్నాయి. 12 లీటర్ల ఇంధన సామర్థ్యం కలిగిన స్పీడ్‌మాస్టర్.. లీటర్‌కు 27 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఈ స్పీడ్ మాస్టర్ క్రాన్‌బెర్రీ రెడ్, జెట్ బ్లాక్, ఫాంటమ్ వైట్ వంటి మూడు విభిన్న రంగుల్లో మార్కెట్‌లో లభ్యమవుతున్నది.

ర్యామ్‌లో సమస్యలా?

కంప్యూటర్‌లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు సిస్టం పనితీరు మందగిస్తుంది. బూటింగ్ సమయం ఎక్కువగా తీసుకుంటుంది. అలా నిత్యం జరుగుతుంటే ర్యామ్ మీదనే అనుమానం వస్తుంది. అయితే ర్యామ్‌లో ఎలాంటి సమస్యలున్నాయో ఈ టిప్స్ ద్వారా తెలుసుకొని పరిష్కరించుకోండి.



ర్యామ్‌లో సమస్యలు వచ్చినప్పుడు విండో మెమొరీ డయోగ్నోస్టిక్ టూల్ ఉపయోగించి ర్యామ్ సమస్యలు తెలుసుకోవచ్చు.

స్టెప్ 1 : స్టార్ట్ బటన్‌ను క్లిక్ చేసి సెర్చ్‌లో 'విండో మెమొరీ డయోగ్నస్టిక్' అని టైప్ చేసి ఎంటర్ చేయాలి. లేకపోతే రన్ బాక్స్‌లో mdsched.exe అని టైప్ చేయాలి.

స్టెప్ 2 : వచ్చిన డైలాగ్ బాక్స్‌లో restart now and check for problems పైన క్లిక్ చేసి రీస్టార్ట్ చేయాలి. మెమొరీ టెస్ట్ జరుగుతున్నప్పుడు ఎలాంటి పనులు చేయకూడదు. టెస్ట్ పూర్తి అయిన తర్వాత ఫలితాలను విండోపై స్టేటస్ మెసేజ్‌లో చూపెడుతుంది. తర్వాత అదే రీస్టార్ట్ అవుతుంది. విండో బటన్‌ను క్లిక్ చేసి.. సెర్చ్‌లో 'ఈవెంట్ వీవర్' అని టైప్ చేయాలి. ఆప్లికేషన్ ఓపెన్ చేశాక వీండో లోగోస్‌లో సిస్టమ్ ఫైండ్ దగ్గర 'మెమొరీ డయోగ్నస్టిక్' అని టైపు చేయడం ద్వారా టెస్ట్ రిజల్ట్ చూడొచ్చు.

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 28 ఫిబ్రవరి 2018



మళ్లీ కలుస్తా అంటుంది

ప్రియా వారియర్ ఇప్పుడేం చేసినా వార్తే అవుతుంది. సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతుంది. ప్రియా ఏం చేసినా నెటిజనులు, ప్రేక్షకులు దృష్టి మళ్లించకుండా చూస్తున్నారు. ప్రియా తాజాగా శ్రీదేవికి తన పాటతో నివాళి అర్పించింది.

తన చూపులతో సోషల్‌మీడియాను పక్కచూపులు చూడకుండా చేసిన మలమాళీ ముద్దుగుమ్మ ప్రియా వారియర్ మంచి గాయని కూడా. సోషల్‌మీడియా సెన్సేషన్ ప్రియా ప్రకాశ్ వారియర్ శ్రీదేవికి తనదైన రీతిలో నివాళి అర్పించింది. లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి మరణవార్త విని తనదైన శైలిలో నివాళి అర్పించింది. 'కభీ అల్విదా నా కెహనా' అంటూ పాట పాడిన వీడియోను ట్వీట్ చేసింది. 'చరిత్ర ఎప్పుడూ గుడ్‌బై చెప్పదని, మళ్లీ కలుస్తా అంటుంది' అని ప్రియా ట్విట్టర్‌లో రాసింది. శ్రీదేవి మృతదేహం అప్పగింతపై జరిగిన డ్రామాపై మీడియా వ్యవహరిస్తున్న తీరుపై ప్రియా ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన సమాచారం లేకుండా ఎవరికి తోచింది వాళ్లు రాస్తూ ఎందుకు అలా ప్రవర్తిస్తున్నారో అంటూ ఆవేదనతో మరో ట్వీట్‌లో ప్రశ్నించింది. సోషల్‌మీడియా ద్వారా రాత్రికి రాత్రి స్టార్ అయిన ప్రియా సోషల్‌మీడియాను ఎలా వాడుకోవాలో అలా వాడుకుంటుంది. ఇప్పుడు ప్రియా పాడిన పాట కూడా ట్రెండింగ్ అవుతుంది.



ఆ పెళ్లి ఈమెదే!

శ్రీదేవి హజరైన పెళ్లి బోని కపూర్ మేనల్లుడు మోహిత్ మర్వాస్‌ది. చర్చంతా దేవి మరణం మీద నడుస్తుందిప్పుడు. మరి ఆ పెళ్లి కూతురో ఎవరో తెలుసా? ఆమె గురించి కొన్ని విషయాలు..



పూర్తి పేరు	: అంతర తుషార్ మోతివాలా
వృత్తి	: ఫ్యాషన్ స్టైలిస్ట్
చదువు	: ఇటలీలోని ఇస్టిటుటో మారాంగోనిలో స్టైలింగ్‌లో మాస్టర్స్
తల్లిదండ్రులు	: భావనా మోతివాలా (స్టైలిస్ట్), తుషార్ మోతివాలా (వ్యాపారవేత్త)
అన్న	: చిత్రంగ్ మోతివాలా (వ్యాపారవేత్త)
హాబీ	: ట్రావెలింగ్

- గుజరాతీ కుటుంబంలో పుట్టింది.
- స్టైలింగ్‌లో మాస్టర్స్ పూర్తయ్యాక వనిటీ ఫెయిఉర్ మిలాన్ అనే అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం చేసింది. ఆ తర్వాత జీక్యూ మ్యాగజైన్‌కు ఫ్యాషన్ ఎడిటర్‌గా పనిచేసింది.
- ఫ్యాషన్ ట్రెండ్ ఫోర్స్‌కాస్టింగ్, వోగ్ హోమ్స్ ఫ్రాన్స్ వంటి అంతర్జాతీయ పత్రికల్లో ఈమెపై ఆర్టికల్స్ రాయబడ్డాయి.
- సోనమ్ కపూర్‌కి ఆత్మీయ స్నేహితురాలు.
- టీనా అంబానీకి వరుసకు మేనకోడలు అవుతుంది.
- ముంబైలోని కొండే నాస్ సంస్థలో జూనియర్ స్టైలిస్ట్‌గా పనిచేసింది.



యువ భారతం!

ప్రపంచంలోనే యువత సంఖ్య ఎక్కువ ఉన్న దేశం భారత్. మొత్తం జనాభాలో చూసుకుంటే సుమారు 28శాతానికి పైగా యువత ఉన్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం వివిధ దేశాల్లో యువత సంఖ్య ఇలా ఉన్నది.

భారత్	: 356 మిలియన్లు
చైనా	: 269 మిలియన్లు
ఇండోనేషియా	: 67 మిలియన్లు
అమెరికా	: 65 మిలియన్లు
పాకిస్థాన్	: 59 మిలియన్లు
నైజీరియా	: 57 మిలియన్లు
బ్రెజిల్	: 51 మిలియన్లు
బంగ్లాదేశ్	: 48 మిలియన్లు

అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీ సృజనాత్మక రచయితలకు ఇచ్చే ఫెలోషిప్ హెలెన్ జిల్ కోసం ఈ ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా 1800 మంది పోటీపడగా.. 12 మంది ఎంపికయ్యారు. ఎంపికైన మొదటి భారతీయుడిగా, పిన్న వయస్కుడిగా నిశాంత్ రికార్డులు సృష్టించాడు.

సాహిత్యం అంతరించిపోతున్నది..
టెక్నాలజీ రాయడాన్ని, చదవడాన్ని మొత్తం తగ్గించేసింది..
సాంకేతిక యుగంలో సాహిత్యాన్ని కాపాడడానికి నిశాంత్ నిర్ణయం తీసుకున్నాడు
సృజనాత్మక రచనలు చేస్తూ ప్రతిష్టాత్మక హెలెన్ జిల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు
భారతదేశం నుంచి హెలెన్ జిల్ ఫెలోషిప్‌కు ఎంపికైన ఏకైక యువకుడిగా రికార్డు సృష్టించిన ఇంజం నిశాంత్ పరిచయమిది..



సృజనాత్మక నైపుణ్యం నిశాంత్ సాహిత్యం

విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. లక్షలు వెచ్చిస్తే కానీ అంతర్జాతీయ యూనివర్సిటీల్లో చదువు అసాధ్యం. అలాంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో ఫెలోషిప్‌కు ఎంపికై సాహిత్యరంగంలో సృజనాత్మక అక్షరాలను విరబూయించనున్నాడు. సాంకేతికతకు అనుగుణంగా ఆలోచనలు సాగిస్తూ ముందుకెళ్తున్న నేటి తరుణంలో సాహిత్యంలోనూ యువత ముఖ్య భూమిక పోషిస్తుంది. ఖమ్మం నగరానికి చెందిన 'నిశాంత్' సృజనాత్మక సాహిత్యంలో భవిష్యత్తు తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాడు. అసలు అలోచనలకు కూడా సాధ్యం కాని విధంగా నిశాంత్ ఎంచుకున్న అంశం తన కుటుంబీకులనే మొదట్లో ఆశ్చర్యకితులను చేసింది. నిశాంత్ రచనలు చేస్తూ నేటి యువత ఆలోచనలకు భిన్నంగా సాహిత్యంలో రాణిస్తున్నాడు. మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్(ఎంఎఫ్ఏ) నిశాంత్ తన రచనలను మరింత సానబట్టుకునేందుకు అవకాశం దక్కింది. తక్కువ మంది శిక్షణ పొందే ఈ కోర్సుకు వందల మంది దేశ విదేశాలకు చెందిన ప్రముఖ రచయితలు పోటీ పడగా నిశాంత్‌కు చోటు దక్కింది. మూడేళ్ల పాటు జరిగే ఈ ఫైన్ ఆర్ట్ కోర్సుకు అమెరికా ప్రభుత్వం రెండేళ్లకు గానూ లక్షా అరవై వేల డాలర్లు(సుమారు కోటీ నాలుగు లక్షలు) ఫెలోషిప్‌గా నిషాంత్‌కు అందించనుంది.

ప్రజాస్వామ్యమే మన ముందున్న ప్రత్యామ్నాయము అనుకుంటే దానికి బలం సంభాషణ. ఏ సృజనాత్మక రంగం అయినా ఈ సంభాషణను బలంగా సాగించగలదని నిశాంత్ నమ్మకం. అందుకే వృత్తి రీత్యా తన నైపుణ్యం ఐటీ రంగంలో ఉన్నా ప్రవృత్తి రీత్యా తాను అభిమానించే కాల్పనిక సాహిత్యం (క్రియేటివ్ ఫిక్షన్) వైపు ఇష్టపూర్వకంగా అడుగులు వేశాడు. నేటి గ్లోబలైజేషన్ సహజంగానే టెక్నాలజీకి పెద్ద పీట వేసింది. అనేక నూతన ఆవిష్కరణలు గత కొన్ని దశాబ్దాలలోనే జరిగాయి. భారతీయ యువకులు తగిన సంఖ్యలోనే ఈ రంగంలో వివిధ స్థాయిలలో తమ ప్రతిభను ప్రదర్శిస్తునే ఉన్నారు. ఇందుకై చరిత్రతో మాట్లాడాలి, భవిష్యత్‌లోకి తొంగిచూడాలి, వర్తమానంతో నిరంతరం సంఘర్షించాలి, ఇదే నేను చేయగలుగుతున్న పని అంటున్నాడు నిశాంత్.

సెలవుల ఫలితం..

రచనా వ్యాసాంగంపై తనకు చిన్నప్పటి నుంచి ఉన్న మక్కువను వదులుకోలేదు. వారాంతపు దినాలలో, సెలవులలో రచయితల సమావేశాలకు వెళ్ళటం ఆరంభించాడు. ఈ క్రమంలోనే ప్రముఖ సాహిత్య పత్రిక టిన్‌హౌస్ వేసవి శిక్షణా తరగతులకు వైట్‌హౌస్ రచయితల వర్క్‌షాప్‌లకు హాజరయ్యేవాడు. ప్రముఖ విశ్వవిద్యాలయం స్టాన్ఫర్డ్‌లో ఆన్‌లైన్ రైటర్స్ ప్రోగామ్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఈ నిరంతర కృషి ఫలితంగా స్కాలర్‌షిప్ విజయాన్ని అందుకున్నాడు. ప్రతి మంగళవారం డ్యూటీ ముగించుకొని స్టూడియో చికాగో పేరిట సాగే రచయితల సమావేశాలకు సాహిత్య సభలకు ఎక్కువసార్లు హజరయ్యేవాడు.



ఒకే ఒక్కడు..



సృజనాత్మక రచనలు చేసే రచయితల నైపుణ్యాలను సానబెట్టేందుకు అమెరికాలో ఎంఎఫ్ఏ కోర్సు ఉంది. అందులో అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాలు కలిసి రచనా రంగంలో ఆసక్తి ఉన్న అభ్యర్థులను ఒక వేదిక కల్పించి శిక్షణనిస్తాయి. ప్రముఖంగా చెప్పుకోదగినది హెలెన్‌జిల్ రైటర్స్ ప్రోగామ్. ఇది యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ ఆన్ అర్బర్‌లో ఉంది. పన్నెండు సీట్ల కోసం వందల సంఖ్యలో రచయితలు ఈ శిక్షణ కోసం పోటీపడతారు. మూడేళ్ళ కోర్సు కాలంలో మొదటి రెండేళ్ళకు గానూ యూనివర్సిటీ వారు 'ఫెలోషిప్' కింద లక్షా అరవై వేల డాలర్లను ఇస్తారు. యూనివర్సిటీ వారందించే ఈ 'ఫెలోషిప్' ఈ ప్రోగ్రామ్‌కు ప్రత్యేక ఆకర్షణ. జ్ఞాన్ పీఠ్ అవార్డు గ్రహీతలు అక్కడ ఆచార్యులుగా ఉండటం రచయితలను ఉత్తేజరిచే ప్రధాన అంశం. ఈ విశ్వవిద్యాలయం ఎంపిక చేసిన 12 మంది రచయితలలో నిశాంత్‌కు స్థానం దక్కింది. భారతీయ వ్యక్తులు అతి తక్కువగా ఆసక్తి చూపుతున్న కారణంగా మనవాళ్ళు పెద్దగా ఉండటం లేదు. ఒకవేళ ఉన్నా వారు రెండవ తరానికి చెందిన అమెరికన్ పౌరులై ఉంటున్నారు. కాని నిశాంత్ డిగ్రీ వరకు తన విద్యాభ్యాసాన్ని భారతదేశంలోనే పూర్తి చేసి విదేశాలకు వెళ్లిన మొదటి తరం యువకుడు. వీరిలో నిశాంత్ అత్యంత పిన్న వయస్కుడు. మూడేళ్ళ పాటు స్వేచ్ఛగా రచనా వ్యాసాంగం సాగించే వాతావరణాన్ని ఇవ్వటం ఇందుకై సాహిత్యంలో లబ్ద ప్రతిష్టులతో నిరంతరం టచ్‌లో ఉండటం నిశాంత్‌కు బాగా లాభించే అంశం. తాను అనుకున్న సామాజిక అధ్యయనం, తాను ఇష్టపడిన రచనా వ్యాసాంగం, స్వేచ్ఛగా సాగించే వెసులుబాటుతనం ఉంటుంది. సాహిత్య వారసత్వాన్ని కొనసాగించే పెద్ద భాధ్యత, అవకాశం నిశాంత్‌కు లభించాయి.

ఖమ్మం నుంచి అమెరికాకు..

పదవ తరగతి వరకు తండ్రి ఇంజం వెంకట రమణరావు నడుపుతున్న న్యూఎరా స్కూల్‌లో ఖమ్మంలో చదువుకున్నాడు. ఇంటర్ చుక్కారామయ్య కళాశాలలో..ఇంటర్ తర్వాత ఢిల్లీ నోయిడాలో ఉన్నత విద్యను అభ్యసించాడు. ఆ తరువాత అమెరికాలో ప్రముఖ విశ్వవిద్యాలయంలో చదివేందుకై ప్రయత్నాలు ప్రారంభించాడు. దాని మూలంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోను, కొలంబియా విశ్వ విద్యాలయములోనూ, మిచిగన్ విశ్వవిద్యాలయంలోనూ, యూనివర్సిటీ ఆఫ్ పెన్విల్వేనియా, ఫిలడెల్ఫియాలలోనూ ప్రవేశ పరీక్షలు రాసి అన్నింట్లో సీట్లు సాధించాడు. కానీ యూపెన్ విశ్వవిద్యాలయాన్ని ఎంచుకుని ఎంఎస్ పూర్తి చేశాడు. తర్వాత ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ట్రిబ్యూన్‌లో డిజిటల్ పేపర్‌పై పనిచేయడం ప్రారంభించాడు.

పూనాటి మనోజ్‌కుమార్
నమస్తే తెలంగాణ ఖమ్మం ఎడ్యుకేషన్




సినిమాలు నేర్పిన.. ముక్కు పుడకల ఫ్యాషన్!

కొందరు సినిమా సారాంశాన్ని.. సందేశాన్ని ఆస్వాదిస్తారు. సినిమా ప్రభావం వీరిపై ఓ రెండు మూడు గంటల పాటే ఉంటుంది. కానీ కొందరు సినిమాలోని హీరోయిన్ అందాల్ని.. ఆమె వేసుకునే డ్రెస్‌ని.. జ్యువెలరీని ఆస్వాదిస్తారు. సినిమా కాకుండా బయట కూడా వాటిని ఫాలో అవుతారు. అలాంటివాటిలో ముక్కు పుడకల ఫ్యాషన్ ఒకటి.



హూప్స్

పెళ్లిళ్లకు ఇతర శుభకార్యాలకు వీటిని ఇప్పటి అమ్మాయిలు ఎక్కువగా పెట్టుకుంటున్నారు. పద్మావత్ సినిమాలో కొన్ని సీన్లలో దీపికా పదుకోన్ వీటిని ధరించింది.




నోస్ స్టడ్


సోనాక్షి సిన్హా ఎక్కువగా వీటితో కనిపిస్తుంది. చిన్న అలంకరణే అయినా చూడ్డానికి చాలా అందంగా ఉంటుంది ఈ ముక్కు పుడక. వీటిని పండుగలప్పుడు కూడా ధరిస్తున్నారు. కాలేజీకి వెళ్లేటప్పుడు కూడా చాలామంది అమ్మాయిలు ముక్కు పుడక పెట్టుకుని వెళ్తూ అందంగా కనిపిస్తున్నారు.

బియర్డ్ రింగ్స్

పూసలతో పొదిగిన ఈ రింగ్‌లు అమ్మాయిలకు కొత్త ముఖారవిందాన్ని తీసుకొస్తాయి. ఐశ్వర్యరాయ్ కొన్ని సినిమాల్లో ఇలాంటి రింగ్స్ ధరించింది. జ్యువెలరీ వాడని అమ్మాయిలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతారు.



సెగ్మెంట్ రింగ్స్:



దీపికా పదుకోన్ వీటిని ఎక్కువగా ధరిస్తుంది. చాలా సినిమాల్లో ఈ ముక్కు పుడక పెట్టుకున్నది దీపికా. ఇది కామన్ స్టయిల్. సానియా మీర్జా.. సోనాక్షి సిన్హా ఈ ట్రెండ్‌ను సెట్‌చేస్తే.. నేటితరం అమ్మాయిలు ఫాలో అవుతున్నారు.

ఆఫ్ బియర్డ్ రింగ్స్



ప్రీతి జింతా వీటిని ఎక్కువగా ధరిస్తుంది. రౌండ్ ఫేస్ ఉన్నవారికి ఇది చాలా సెట్ అవుతుంది. స్లిమ్‌గా కూడా కనిపిస్తారట వీటిని ధరించినవాళ్లు. పండుగలప్పుడు వీటిని పెట్టుకుంటే కొత్తశోభ తీసుకొచ్చినట్లు అవుతుందని బ్యూటీషియన్లు అంటున్నారు.

సుడోకు

డైలీ సుడోకు 140 సమాధానం

3	9	1	8	7	5	6	4	2
6	7	2	4	3	1	8	9	5
4	5	8	2	9	6	3	7	1
5	8	4	3	1	2	9	6	7
2	3	9	6	5	7	1	8	4
1	6	7	9	8	4	5	2	3
9	4	6	1	2	3	7	5	8
7	2	3	5	6	8	4	1	9
8	1	5	7	4	9	2	3	6

డైలీ సుడోకు - 141

1							9	
8	4				2			
			3	8		2		
			9			8	5	3
5	3	8			6			
		1		7	9			
			5				6	7
	2							9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



ప్రేమ అంటే ఏమిటి? పదాల్లో చెప్పలేనిది. ప్రేమ అంటే ఏమిటి? ప్రేమ అంటే యాజమాన్యం కాదు. ప్రేమ అంటే స్వాధీనం కాదు. ప్రేమ విధి కాదు. ప్రేమ ఒక ఒప్పందం అంతకన్నా కాదు.

శేఖర్ కపూర్
@shekharkapur

శేఖర్ కపూర్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
2,599,880

కామన్‌మ్యాన్ వాయిస్

చిన్నారులను చిదిమేయడమా? సిరియాలో మానవత్వం.. ప్రపంచానికి కనిపించడం లేదా మారణహోమం. అగ్రతాంబులాల కోసం ఆరాటం తప్ప.. ఆర్తనాదాలు అగ్రరాజ్యాలకు కనిపించవు. వినిపించవా?
-Gajula Rameshkumar

ఈ ప్రపంచంలో బతుకాలంటే రెండు తెలిసుండాలి. ఒకటి సంపాదించడం, రెండు దోచుకోవడం.
-Raj Uragonda

మరొకరి జీవితాన్ని చూసి ఏడ్చే వాళ్లకి మరణం నవ్వులాటగానే ఉంటుంది మరి. ఏదో ఒకరోజు మనకీ తప్పని వాస్తవం అది అని తెలిసినా నవ్వులు ఆపని వాళ్లకి.. ఆ మరణం ఇంకెంత దారుణంగా ఉండబోతుందో.. ఎవరికి తెలుసు?
-Shreshta

వైరల్ వీడియో



యూట్యూబర్ హర్ష బెనివాల్ చేసిన ఫారెనర్ వర్సెస్ ఇండియన్ వీడియో యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.

Foreigner Vs Indian | Harsh Beniwal
Total views : 5,151,760+
Published on Feb 20, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
బుధవారం 28 ఫిబ్రవరి 2018

సమకాలీన తెలుగు చిత్రసీమలో పరభాషా కథానాయికలదే ఆధిపత్యం. తెలుగుతో ఏమాత్రం పరిచయం లేకపోయినా అరువు గొంతులతో డబ్బింగ్ చెప్పిస్తూ పరిశ్రమలో రాణిస్తున్నారు. స్వీయగళంతో తెలుగులో స్టార్‌లుగా నిలిచిన పరభాషా నాయికలు అరుదనే చెప్పాలి. అయితే ఈ ధోరణిలో క్రమంగా మార్పు వస్తున్నది. తమిళం, మలయాళీ, హిందీ.. ఇలా ఇతర భాషల నుంచి తెలుగులో అరంగేట్రం చేస్తున్న చాలా మంది కథానాయికలు తొలి సినిమాతోనే తెలుగులో అనర్గళంగా మాట్లాడుతున్నారు. భాషపై పట్టు సాధించడమే కాకుండా తమ పాత్రలకు సొంతంగా డబ్బింగ్ చెప్పకుంటూ ప్రతిభను చాటుకుంటున్నారు. సినీ పరిశ్రమలో తెలుగు కథానాయికలు లేరనే లోటును మరిపిస్తున్నారు.


అను ఇమ్మాన్యుయేల్

తెలుగు పలుకుల తారామణులు!


రకుల్ ప్రీత్‌సింగ్

సినిమా ప్రచార కార్యక్రమాల్లో, వివిధ వేడుకల్లో 'అందరికి నమస్కారం' అంటూ తమ ప్రసంగాన్ని మొదలుపెడుతుంటారు మన కథానాయికలు. ఆ తర్వాత యథావిధిగా ఇంగ్లీష్‌లో ప్రసంగాన్ని కొనసాగిస్తారు. పరభాషా నాయికలందరిదీ ఇదే తీరు. తెలుగు చిత్రసీమలో తెలుగు కథానాయికలు లేకపోవడం, ఇతర భాషల నుంచి వచ్చిన వారు తెలుగులో నేర్చుకోవడానికి ఆసక్తిని చూపించకపోవడంతో దర్శకనిర్మాతలు సినిమాలో వారి పాత్రల కోసం డబ్బింగ్ కళాకారులను ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వస్తున్నది. నవతరం తారలంతా తెలుగులో ప్రావీణ్యాన్ని సంపాదించడమే కాకుండా సొంత గళాన్ని వినిపించడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. కొత్త తారల జోరుతో సీనియర్ కథానాయికల ఆలోచన ధోరణిలో మార్పు మొదలైంది. తెలుగుపై పట్టు సాధించేందుకు సదరు నాయికలు ప్రయత్నాలు మొదలుపెడుతున్నారు.


కీర్తిసురేష్


సాయిపల్లవి

తొలి సినిమా నుంచే..

త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'అ ఆ' సినిమాతో తెలుగు చిత్రసీమలో తొలి అడుగు వేసింది అనుపమ పరమేశ్వరన్. సహజ అభినయం, చక్కటి రూపలావణ్యంతో పాటు తన పాత్రకు తానే తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పుకొని ప్రేక్షకుల హృదయాల్ని దోచేసింది. మలయాళీ కావడంతో తొలి సినిమా సమయంలో తెలుగు పదాలను స్పష్టంగా పలకడంలో కొంత తడబడినప్పటికీ.. ఆమె ఒక్కో సినిమాతో భాషపై పట్టు పెంచుకుంది. ప్రస్తుతం తెలుగులో అలవోకగా మాట్లాడుతున్నది. ప్రేమమ్, శతమానంభవతి, ఉన్నది ఒకటే జిందగీ ఇలా ప్రతి సినిమాలో తన సొగసైన మాటలతో అభిమానుల్ని మంత్రముగ్ధులను చేసింది. 'తొలుత తెలుగు నేర్చుకోవడం కష్టమనిపించినా క్రమంగా అంతా సర్దుకుంది. తొలి సినిమా సమయంలో తెర మీద నా సంభాషణల్ని వింటున్నప్పుడు చాలా ఆనందం వేసింది. భాషపై పట్టు ఉంటేనే ఆ పాత్రను మరింతగా అర్థం చేసుకోవడంతో పాటు దానికి న్యాయం చేయగలమన్నది నా భావన' అని అంటున్నది అనుపమ పరమేశ్వరన్. 'ఛలో' సినిమాతో తెలుగులో చక్కటి శుభారంభాన్ని అందుకున్నది కన్నడ సొగసరి రష్మిక మందన. వినోదభరిత ప్రేమ కథగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె అభినయానికి ప్రశంసలు దక్కాయి. నటనతో పాటు సొంతంగా డబ్బింగ్ చెప్పి ప్రతిభను నిరూపించుకున్నది. 'కష్టమని భావించకుండా ఓ బాధ్యతగా భావించాను కాబట్టే సులువుగా తెలుగు నేర్చుకున్నాను. ఇకపై నేను నటించే ప్రతి తెలుగు సినిమాలో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటాను' అని తెలిపింది రష్మిక మందన.

అజ్ఞాతవాసితో..


'ఫిదా' సినిమాలో స్వచ్ఛమైన తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన సంభాషణలకు ఫిదా కానీ వారు లేరంటే అతిశయోక్తికాదు. స్వతహాగా తమిళ అమ్మాయి అయినా ఆమె తొలి సినిమాతోనే తెలుగులో డబ్బింగ్ చెప్పుకున్నది. పల్లెటూరి అమ్మాయిగా క్లిష్టతరమైన పాత్రకు గాత్రాన్ని అందించి ప్రశంసల్ని అందుకున్నది. 'భానుమతి ఒక్కటే పీస్ హైబ్రిడ్ పిల్లా' అంటూ చలాకీ మాటలతో ప్రేక్షకుల మనసుల్ని దోచుకున్నది. ఎంసీఏ చిత్రంలో కూడా సాయిపల్లవి స్వీయగళాన్ని వినిపించింది. తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళ సినిమాల్లో సొంత గొంతునే వినిపిస్తున్నది సాయిపల్లవి. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'అజ్ఞాతవాసి'లో కీర్తిసురేష్, అను ఇమ్మాన్యుయెల్ తొలిసారి తమ పాత్రలకు డబ్బింగ్ చెప్పుకున్నారు. వచ్చిరాని తెలుగులో వినూత్న యాసతో వీరు పలికిన సంభాషణలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చాయి. అలాగే ప్రచార వేడుకల్లో తెలుగులో మాట్లాడి ఆశ్చర్యపరిచారు. అలనాటి నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న 'మహానటి' సినిమాలో కీర్తిసురేష్ తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకోనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'తెలుగు అర్థం కాకపోవడంతో తొలినాళ్లలో చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు ఫర్వాలేదు. భవిష్యత్తులో స్పష్టమైన తెలుగులో మాట్లాడితీరుతాను' అని విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నది కీర్తిసురేష్. 'జెంటిల్‌మెన్'తో తెలుగు తెరకు పరిచయమైన కోలీవుడ్ సుందరి నివేథా థామస్ సైతం అరువు గొంతులపై ఆధారపడకుండా తొలి సినిమా నుంచే తన పాత్రలకు డబ్బింగ్ చెబుతున్నది. 'అర్జున్‌రెడ్డి' సినిమాలో షాలిని పాండే తన అమాయకపు మాటలతో ఆకట్టుకున్నది. తొలి ప్రయత్నంలోనే తడబాటు లేకుండా తన పాత్రకు తానే తెలుగులో డబ్బింగ్ చెప్పుకున్నది. వీరితో పాటు మరికొందరు తారలు తెలుగులో తొలి సినిమాలతోనే తమ గళాన్ని తెరపై వినిపించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అగ్రనాయికల తీరు మారుతోంది..

కొత్తగా ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న తారలంతా తొలి సినిమాతోనే తెలుగులో డబ్బింగ్ చెబుతుండటం, ప్రచార వేడుకల్లో అనర్గళంగా మాట్లాడుతుండటం సీనియర్ హీరోయిన్లను అంతర్మథనంలో పడేసింది. ఇన్నాళ్లు అరువు గొంతులపై ఆధారపడుతూ వచ్చిన వారు పునరాలోచనలో పడ్డారు. నిత్యామీనన్, తాప్సీతో పాటు ఒకరిద్దరూ మినహాయిస్తే సమంత, శ్రియ, శృతిహాసన్, నయనతార, కాజల్ అగర్వాల్, త్రిష, అనుష్కతో పాటు పలువురు కథానాయికలు చిత్ర పరిశ్రమలోకి వచ్చి దశాబ్ద కాలం దాటినా ఇప్పటివరకు తెలుగులో డబ్బింగ్ చెప్పలేదు. నవతరం తారలతో పోటీపడి నెగ్గుకురావాలంటే తెలుగు భాషపై పట్టుపెంచుకోవడం తప్పదనే నిర్ణయానికివచ్చారు కొందరు సీనియర్స్. తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించి సొంత గొంతు వినిపించాలని ఆరాటపడుతున్నారు. సీనియర్ కథానాయికల్లో తమన్నా తొలిసారి 'ఊపిరి' లో డబ్బింగ్ చెప్పింది. ఆ తర్వాత 'బాహుబలి'తో పాటు కొన్ని సినిమాల్లో ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. ఇటీవలే విడుదలైన 'స్కెచ్' తెలుగు అనువాదంలో తన పాత్రకు గళాన్ని అందించింది. అలాగే రకుల్ ప్రీత్ సింగ్ కూడా నాన్నకు ప్రేమతో, రారండోయ్ వేడుక చూద్దాం చిత్రాలకు సొంతంగా డబ్బింగ్ చెప్పింది. రాశీ ఖన్నా సైతం తొలిప్రేమ, టచ్‌చేసి చూడు సినిమాల కోసం తన గొంతును వినిపించాలని ఆరాటపడింది. కానీ సమయం లేకపోవడంతో డబ్బింగ్ చెప్పడం కుదరలేదని ఆమె పేర్కొన్నది. లావణ్య త్రిపాఠి సైతం ఇదే ఆలోచనలో ఉన్నది. వీరిబాటలోనే మరి కొందరు సీనియర్స్ అడుగులు వేస్తున్నారు.


అనుపమ పరమేశ్వరన్

పవర్‌ఫుల్ 'ఆఫీసర్'


'ఆఫీసర్' చిత్రంలో నాగార్జున

'శివ' చిత్రంతో నాగార్జున-రామ్‌గోపాల్‌వర్మ ద్వయం తెలుగు చిత్రసీమలో సంచలనాల్ని సృష్టించారు. సరికొత్త ట్రెండ్‌కు నాంది పలికారు. అనంతరం వీరిద్దరి కాంబినేషన్‌లో అంతం, గోవిందా గోవిందా వంటి వినూత్న కథా చిత్రలొచ్చాయి. దాదాపు 24ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో నాగార్జున ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. కంపెనీ పతాకంపై రామ్‌గోపాల్‌వర్మ , సుధీర్‌చంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. తాజాగా ఈ చిత్రానికి 'ఆఫీసర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మే 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు. ఈ సినిమా తాలూకు టైటిల్, మోషన్‌పోస్టర్‌ను మంగళవారం దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేశారు. ఈ సినిమాలో నాగార్జున పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించంబోతున్నారు. తుపాకీ పట్టుకొని రౌద్రంగా కనిపిస్తున్న నాగార్జున ఫస్ట్‌లుక్ పోస్టర్ అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ చిత్రంలో నాగార్జున పాత్ర చిత్రణ నవ్య పంథాలో వుంటుందని, పోరాట ఘట్టాలు రొమాంచితంగా సాగుతాయని చిత్ర బృందం చెబుతున్నది. 'రాజుగారి గది-2' తర్వాత నాగార్జున నటిస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నాగశౌర్య '@ నర్తనశాల'?


తల్లి ఉషా బహూకరించిన కారుతో నాగశౌర్య

'ఛలో' విజయోత్సాహంలో వున్న నాగశౌర్య తన తదుపరి చిత్రాన్ని కూడా సొంత నిర్మాణ సంస్థ ఐరా క్రియేషన్స్‌లోనే చేయడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. దర్శకుడు వంశీ పైడిపల్లి వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన చక్రవర్తి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి '@ నర్తనశాల' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు చిత్ర వర్గాల సమాచారం.

అమ్మ కానుక..

నాగశౌర్య నటించిన 'ఛలో' చిత్రానికి ఆయన తల్లి ఉషా ముల్పూరి నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ చిత్ర విజయాన్ని పురస్కరించుకుని కుమారుడు నాగశౌర్యకు పోర్షే 718 కేమెన్ లగ్జరీ కారును బహుమతిగా ఇచ్చారు. దీని విలువ 1.25 కోట్లు పైనే వుంటుందని తెలిసింది. ఈ సందర్భంగా నాగశౌర్య కుటుంబం కారుతో ఇంటి ముందు దిగిన ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.


ప్రియదర్శి, రిచాశర్మ

పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి, ఉన్నది ఒకటే జిందగీ వంటి చిత్రాలతో కమెడియన్‌గా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు ప్రియదర్శి. గత కొంత కాలంగా స్నేహితురాలు రిచా శర్మతో ప్రేమలో వున్న ఆయన తన ప్రేమను పెద్దలు అంగీకరించడంతో ఈ నెల 23న ప్రేమించిన రిచా శర్మను వివాహం చేసుకున్నారు. ఆగ్రాలో జరిగిన వీరి వివాహానికి ఇరుకుటుంబాలకు చెందిన బంధువులు, అత్యంత సన్నిహితులు హాజరయ్యారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, బంధువులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రయాణంలో పదనిసలు


'ఆనందం' చిత్రంలో ఓ దృశ్యం

'ఇండస్ట్రియల్ టూర్.. 4 రోజులు.. మూడు ప్రేమకథల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఆనందం'. అంతా కొత్త వాళ్లతో మలయాళంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్కడ అనూహ్య విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా భారీ వసూళ్లను సాధించింది' అన్నారు గురురాజ్. మలయాళంలో సక్సెస్ సాధించిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై గురురాజ్ తెలుగులో అందిస్తున్నారు. గణేష్ రాజ్ దర్శకుడు. మార్చిలో విడుదల కానుంది. నిర్మాత మాట్లాడుతూ 'ఆద్యంతం యూత్‌ఫుల్‌గా సాగే చిత్రమిది. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ చిత్రం దాదాపు 20కోట్ల కలెక్షన్లను రాబట్టింది. ఈ సినిమాలో నివిన్‌పాల్ అతిథి పాత్రలో నటించారు. గతంలో వచ్చిన 'హ్యాపీడేస్' చిత్రాన్ని గుర్తుచేస్తుంది' అన్నారు. అరుణ్ కురియన్, థామస్‌మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి, సంగీతం: సచిన్ వారియర్, సమర్పణ: ఆర్.సీతా రామరాజు, సహనిర్మాతలు: వీరా వెంకటేశ్వరరావు (పెదబాబు), వీఆర్‌బి రాజు, రవివర్మ చిలువూరు.

మూడురోజుల పెళ్లి?


శ్రియ

ఢిల్లీ సొగసరి శ్రియ పెళ్లి వార్తలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రష్యా క్రీడాకారుడు, వ్యాపారవేత్త ఆంద్రీ కొచీవ్‌తో ఈ సుందరి ఏడాదికాలంగా ప్రేమాయణం సాగిస్తున్నదని, త్వరలో ఈ జంట పెళ్లి చేసుకోబోతున్నారని ముంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. అయితే సినిమాలు తప్ప తన వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటానికి ఏమాత్రం ఇష్టపడని శ్రియ తన పెళ్లి వార్తల్ని ఖండిస్తూ వస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సుందరి వివాహం కోసం రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తున్నది. మార్చి 17నుంచి 19వరకు మూడురోజులు పెళ్లి వేడుకను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు శ్రియ సన్నిహితులు చెబుతున్నారు. పూర్తి హిందూ సంప్రదాయ పద్ధతుల్లో పెళ్లి తంతును నిర్వహించబోతున్నారని తెలిసింది. తన పెళ్లి గురించి మీడియాలో చర్చ జరగకూడదనే ఉద్దేశ్యంతోనే వివాహ విషయాన్ని శ్రియ గోప్యంగా ఉంచుతోందని అంటున్నారు. శ్రియ పెళ్లి తాలూకు వార్తల్లో నిజమెంతో తెలియాలంటే కొద్దిరోజులు ఆగాల్సిందేనని ఫిల్మ్‌నగర్ వర్గాలంటున్నాయి. శ్రియ నటించిన 'గాయత్రి' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది.



రాష్ట్రంలో ముదిరాజ్‌ల సంక్షేమానికి రూ.5 కోట్లను కేటాయించడంతోపాటు ఐదెకరాల్లో ముదిరాజ్ భవన్‌ను నిర్మిస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్‌లు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. సికింద్రాబాద్ గణపతి దేవాలయం చైర్మన్, అడ్డగుట్ట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం.

- అడ్డగుట్ట

ప్రభుత్వానికి స్వచ్ఛందసంస్థలు సహకరించాలి

ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేలా కృషిచేయాలి

ఆగాఖాన్ ఫౌండేషన్ సేవలు భేష్: గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వానికి స్వచ్ఛందసంస్థలు సహకరించాలని గవర్నర్ నరసింహన్ పిలుపునిచ్చారు. ఈక్రమంలో ఆగాఖాన్ ఫౌండేషన్ తన వంతు పాత్ర పోషిస్తున్నదని ప్రశంసించారు. అనేక ప్రాంతాల్లో చారిత్రక వారసత్వసంపదను కాపాడటంలోనూ ఫౌండేషన్ కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. మంగళవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో షియా ఇస్లామీ ముస్లీమ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ (ఏకేడీఎన్) చైర్మన్ ఆగాఖాన్ గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు. హైదరాబాద్‌లో కులీకుతుబ్‌షా సమాధుల రక్షణతో చారిత్రక వారసత్వసంపదను మెరుగుపరచడానికి ఆగాఖాన్ ఫౌండేషన్ కృషి చేస్తున్నదని గవర్నర్ పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, వైద్యాన్ని సామాన్యులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందుకు ఆగాఖాన్ వంటి సంస్థలు సహకరించాలని సూచించారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమాటిక్స్‌రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి తమ ఫౌండేషన్ చర్యలు తీసుకుంటున్నదని ఆగాఖాన్ వివరించారు. త్వరలో తెలంగాణలో సేవా కార్యక్రమాలను ప్రారంభించబోతున్నామన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో సమావేశమైన ప్రిన్స్ ఆగాఖాన్

నేడు కుతుబ్‌షాహి టూంబ్స్‌ను సందర్శించనున్న అమెరికా రాయబారి

అమెరికా రాయబారి కిన్నెత్‌జస్టర్ బుధవారం కుతుబ్‌షాహి టూంబ్స్‌లో ఆగాఖాన్ ఫౌండేషన్ సారథ్యంలో చేపడుతున్న అభివృద్ధిని పరిశీలించనున్నారు. టూంబ్స్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, పలు సలహాలు ఇవ్వనున్నారు.



పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌తో భేటీ అయిన ఎంపీ అసదుద్దీన్. చిత్రంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

చార్మినార్ వీధివ్యాపారులను ఆదుకోవాలి

ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు వల్ల ఉపాధి కోల్పోయిన వీధివ్యాపారులు, చిల్లర వర్తకులకు నయాపూల్ వద్ద ప్రత్యేకంగా మూడు బ్రిడ్జీలను నిర్మించాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న చిరువ్యాపారుల పునరావాసం కోసం సెంట్రల్ లైబ్రరీ నుంచి సాలార్జంగ్ మ్యూజియం వరకు రెండు బ్రిడ్జీలు, ఉస్మానియా దవాఖాన నుంచి ప్రభుత్వ మెటర్నిటీ దవాఖాన వరకు మరో బ్రిడ్జి నిర్మించాలని కోరారు.



ఎల్ ఈడీలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనిల్ వాలియా

ఎల్ ఈడీలతో సమస్యలేం లేవు

- నాణ్యమైన వాటినే వినియోగించాలి: అనిల్‌వాలియా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఎల్ఈడీ కాంతి వల్ల మానవ శరీరానికి ఎలాంటి ఇబ్బంది కలుగదని ఎల్ఈడీల కన్సల్టెన్సీ ప్రతినిధి అనిల్ వాలియా స్పష్టంచేశారు. ఎల్ఈడీ బల్బులతో కలిగే లాభనష్టాలపై మేధావులు, నిపుణులు మంగళవారం ఖైరతాబాద్‌లోని ఇంజినీర్స్ భవన్‌లో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఈడీ లైట్ల నుంచి వెలువడే కాంతిలో అతినీలలోహిత కిరణాలు కేవలం ఒక శాతం మాత్రమే ఉంటాయని, పరారుణ కిరణాలు అసలే ఉండవన్నారు. కాబట్టి ఎలాంటి హాని జరుగదని స్పష్టంచేశారు. ఎల్ఈడీ కాంతితో కండ్లు కొట్టుకుంటాయని, బైర్లు కమ్ముతున్నాయనే వాదన తప్పని, ఏ బల్బు కాంతి పడినా ఆ లక్షణాలే ఉంటాయన్నారు. నాణ్యమైన ఎల్ఈడీ బల్బులను వాడితే ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. ఎల్ఈడీలపై వస్తున్న అపోహలకు సమాధానం ఇస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కృష్ణారావు, నర్సింహాచారి, రాజశేఖర్, శ్రీనివాస్‌రావు, విజయ్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు.

ఎటువంటి నిర్మాణాలు చేపట్టొద్దు

భోజగుట్టలోని ముస్తఫాహిల్స్ హౌసింగ్ సొసైటీకి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఆసిఫ్‌నగర్ పరిధిలోని భోజగుట్ట భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ ముస్తఫాహిల్స్ హౌసింగ్ సొసైటీకి మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. సొసైటీకి కేటాయించిన ఆరు ఎకరాల భూమిని రద్దు చేయాలంటూ కలెక్టర్ చేసిన సిఫార్సులపై చేపట్టిన చర్యలను వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

మహిళల భద్రతకు పెద్దపీట

- 4న షీటీమ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 10కే రన్
- పౌరులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నదని, హైదరాబాద్ నగరాన్ని నేరరహిత రాజధానిగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నామని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, షీటీమ్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 4న నెక్లెస్‌రోడ్డులో.. 10కే, 5కే, 2కే రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ రన్‌లో విద్యార్థులు, పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రన్‌లో పాల్గొనేందుకు www.eventsnow.com వెబ్‌సైట్లో ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళల భద్రతకు తీసుకొంటున్న చర్యలు, షీటీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలను మంగళవారం డీజీపీ తన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మీడియాకు వివరించారు. మహిళలకు భద్రత కల్పించేందుకు 2014 అక్టోబర్ 24న 100 షీటీమ్స్‌ను ఏర్పాటుచేశామని, దశలవారీగా వీటిని అన్ని ప్రాంతాలకు విస్తరించినట్టు పేర్కొన్నారు.



షీటీమ్స్ 10కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు

మహిళల భద్రతకు పోలీస్‌శాఖ తీసుకొంటున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, షీటీమ్స్‌తోపాటు మనమంతా ఉన్నామన్న భరోసా కల్పించే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. షీటీమ్స్ ఆధ్వర్యంలో రన్‌తోపాటు వచ్చే నెల 3, 4 తేదీల్లో పీపుల్స్‌ప్లాజాలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో మహిళ భద్రతకు పోలీస్‌శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాలు, ఎన్జీవోలు తీసుకుంటున్న చర్యలను వివరిస్తామన్నారు. గతేడాది నిర్వహించిన రన్‌కు పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని, ఈ ఏడాది రన్‌లో ఏడువేల మంది పాల్గొనే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నామని డీజీపీ తెలిపారు. రన్ టీషర్టులు, పోస్టర్లు, మెడల్స్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ డీజీ అంజనీకుమార్, సీపీ శ్రీనివాసరావు, ఏసీపీ(క్రైమ్స్)స్వాతి లక్రా, డీసీపీ మహంతి, ఎస్పీ రమా రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: యువ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఓయూ జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్ బీ బాలస్వామి పర్యవేక్షణలో 'సపరేట్ స్టేట్‌హుడ్ ఫర్ తెలంగాణ: ఏ స్టడీ ఆన్ ది రోల్ ఆఫ్ మీడియా' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాదరి కిశోర్ జర్నలిజంలో పీజీ పూర్తి చేసిన అనంతరం పరిశోధన ప్రారంభించారు. యూజీసీ నిర్వహించే నెట్ పరీక్షలో 2013లో అర్హత సాధించారు. పరిశోధనా విద్యార్థిగా రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ పొందారు. మలి దశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొనడంతోపాటు టీఎస్‌జేఏసీ, ఓయూజేఏసీ స్థాపనలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఉద్యమంలో భాగంగా ఆయనపై దాదాపు 54 పోలీసు కేసులు నమోదయ్యాయి. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసి, 32 ఏండ్ల వయసులో ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థి నాయకులు అభినందించారు.

పైన బ్రాండ్.. లోపల లోకల్ మాల్

మొయినాబాద్‌లో అక్రమ దందా అడ్డాపై పోలీసుల దాడి

2 వేల క్వింటాళ్ల సన్నబియ్యం, 12 టన్నుల కందిపప్పు స్వాధీనం • విలువ రూ.కోటిపైనే ఉంటుందని అంచనా

మొయినాబాద్: బియ్యాన్ని, కందిపప్పును స్థానికంగా అగ్గువకు కొని మార్కెట్‌లో మంచి పేరున్న బ్రాండ్ బస్తాల్లో నింపి ఎక్కువ ధరకు అమ్ముతూ అడ్డంగా రూ.కోట్లు సంపాదిస్తున్న వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఓ గోదాం అడ్డాగా ఈ అక్రమ వ్యాపారం సాగుతున్నట్టు తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం దాడి చేశారు. బియ్యం, కందిపప్పు నిల్వలను స్వాధీనం చేసుకొని గోదాంను సీజ్ చేశారు. సీఐ ఎస్ సునీత తెలిపిన వివరాల మేరకు.. మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్‌కు వెళ్లేరోడ్డులో ముర్తుజాగూడ సమీపంలో బేగంబజార్‌కు చెందిన రాంనివాస్ సోలంకి ఒక గోదాంను నిర్మించాడు. అతడు మార్కెట్‌తోపాటు, పలు ప్రాంతాల్లో తిరిగి నాణ్యత తక్కువగా ఉండే బియ్యాన్ని అగ్గువకు కొని గోదాంకు తీసుకొచ్చేవాడు. మార్కెట్‌లో మంచి పేరున్న బియ్యం బ్రాండ్‌ల మాదిరిగా సంచులను తయారు చేయించి అందులో నాణ్యతలేని బియ్యాన్ని నింపి నిల్వ చేస్తున్నాడు. వాటిని క్రమంగా మార్కెట్‌లోకి వదులుతూ బ్రాండ్ పేరు చెప్పుకొని అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నాడు. బియ్యం మంచి సువాసన రావడానికి ఓ పౌడర్‌ను బస్తాల్లో కలిపేవాడు. అదేవిధంగా తక్కువ నాణ్యత ఉన్న కందిపప్పును తీసుకొచ్చి మార్కెట్‌లో పేరున్న కంపెనీల బ్రాండ్ సంచులు తయారు చేయించి అందులో నింపేవాడు. బేగంబజర్‌లో సొంతగా హోల్‌సేల్ దుకాణం పెట్టి వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఇలా మోసపూరిత వ్యాపారం చేస్తూ రూ.కోట్లు ఆర్జించాడు. విషయం తెలుసుకున్న సీఐలు ప్రవీణ్‌రెడ్డి, సునీత, ఏఎస్ఐ అంతిరెడ్డి బృందం, స్థానిక పోలీసులు మంగళవారం సాయంత్రం గోదాంపై దాడి చేశా. 2 వేల క్వింటాళ్ల సన్నబియ్యం, 12 టన్నుల కందిపప్పు, పెసర్లు, గోధుమపిండి, పచ్చి బఠాణి నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం, కందిపప్పు విలువ రూ. కోటికి పైగా ఉండవచ్చని పోలీసులు అంచనావేశారు. రాంనివాస్ సోలంకిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. గోదాంను సీజ్ చేశారు.



గోదాంలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న సీఐలు సునీత, ప్రవీణ్‌రెడ్డి

సుదర్శన్‌పై మళ్లీ పీడీ యాక్ట్

రేషన్ బియ్యం అక్రమ దందాలో రెండేండ్లలో ఇది రెండోది



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి వాటిని సరికొత్త బ్రాండ్‌తో మార్కెట్‌లో అమ్ముతూ అక్రమ దందా నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ ఎన్నిశెట్టి సుదర్శన్‌పై రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ పీడీ యాక్ట్‌ను విధించారు. సుదర్శన్‌పై ఇది రెండో పీడీ యాక్ట్. నల్లగొండ జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన ఎన్నిశెట్టి సుదర్శన్ డిగ్రీ వరకు చదివాడు. 1987లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 1985 నుంచి సుదర్శన్ రైసు మిల్లు వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. అహ్మద్‌గూడ, చీకటిమామిడి ప్రాంతాల్లో సొంతంగా రెండు రైసు మిల్లులను నడిపిస్తున్నాడు. భారీగా నగదును సంపాదించే ఆలోచనతో రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తూ వాటిని తన రైసు మిల్లులో పాలిష్ చేసి సన్నబియ్యంగా మారుస్తున్నాడు. వీటిని కొత్త బ్రాండ్ పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు. సుదర్శన్ అక్రమ దందాపై గతంలో ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 2016 మే నెలలో సైబరాబాద్ పోలీసులు సుదర్శన్‌పై పీడీ యాక్ట్‌ను విధించారు. ఈ యాక్ట్‌పై చర్లపల్లి జైలులో శిక్షను అనుభవించిన సుదర్శన్ తన బుద్ధిని మార్చుకోలేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా సొంతంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ రీసైక్లింగ్ చేస్తున్నాడు. ఇలా 2017-2018 మధ్య కాలంలో అతనిపై మరో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ నెల 15వ తేదీన పౌర సరఫరాసంబంధాలశాఖ, రాచకొండ పోలీసులు సంయుక్తంగా సుదర్శన్ రైసు మిల్లుల్లో సోదాలు చేసి దాదాపు 800 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని అతనిని అరెస్ట్ చేశారు. అతని బియ్యం అక్రమ దందాను అరికట్టేందుకు సీపీ మహేశ్‌భగవత్ మంగళవారం పీడీ యాక్ట్‌ను విధించారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

మూడోపేజీ తరువాయి...

కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు.. తెలంగాణలో కొనసాగుతున్న పథకాలను పరిశీలించి సంభ్రమాశ్చర్యాలను వ్యక్తంచేశారు. మైనార్టీల విద్య, అభివృద్ధికి తెలంగాణ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని కేంద్రమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ అభినందించారు. వివిధ సంక్షేమ పథకాలు బాగున్నాయని చెప్పారు. ఇంటింటికీ నల్లాల ద్వారా మంచినీటి సరఫరా పథకంలో తెలంగాణ అనుకున్న సమయానికి నాలుగేండ్ల ముందుగానే ఘనత సాధిస్తున్నదని కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అదనపు సలహాదారు దినేశ్‌చంద్ ప్రశంసించారు. ఇంటింటికీ నల్లాల ద్వారా మంచినీటి సరఫరాలో తెలంగాణ ప్రభుత్వాన్ని మోడల్‌గా అనుసరించాలని సూచించారు. పలు పథకాలకు కేంద్రం ఇచ్చిన నిధులను తెలంగాణ ప్రభుత్వం సమర్థంగా ఖర్చు చేసిందని, అందుకే ఈ ఏడాది రూ.41.10 కోట్లు ఇన్సెంటివ్ ఇస్తున్నట్టు ప్రకటించారు. మిషన్ భగీరథ.. ఓ చరిత్ర అని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు కొనియాడారు.

మిషన్ భగీరథ.. ఓ చరిత్ర

ప్రజల కనీస అవసరమైన మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు, ప్రతి పల్లెకు తాగునీరు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు పేర్కొన్నారు. మిషన్ భగీరథ పనులతో తెలంగాణ చరిత్ర సృష్టిస్తున్నదని అభినందించారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ వద్ద సంప్‌హౌస్ వివరాలను తెలుసుకొంటున్న కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు. చిత్రంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, కర్ణాటక మీడియా ప్రతినిధుల బృందం

తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిశీలించేందుకు ఆయన సారథ్యంలో వచ్చిన 30 మంది జర్నలిస్టుల బృందం మంగళవారం గజ్వేల్ మండలం కోమటిబండలో నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్‌ను పరిశీలించింది. ఫొటో ఎగ్జిబిషన్, వీడియో ప్రజెంటేషన్ అనంతరం.. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ కర్ణాటక జర్నలిస్టుల బృందానికి వివరించారు. సీఎం కేసీఆర్ నిబద్ధత అభినందనీయమని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ కొనియాడారు. మిషన్ భగీరథలో ఇంత భారీ పరిమాణంలో కట్టడాలను నిర్మించడం అద్భుతమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. మిషన్ భగీరథతో తెలంగాణ సమాజంలో ఆర్థిక, ఆరోగ్యరంగాల్లో మౌలికమైన మార్పు కచ్చితంగా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ రాజయ్య, కమలాకర్, డీఈ నాగార్జున, సీనియర్ జర్నలిస్టులు టంకశాల అశోక్, పల్లె రవికుమార్, ఇస్మాయిల్, మారుతీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో తెలంగాణ మోడల్

రాష్ర్టానికి రూ.41.10 కోట్ల ఇన్సెంటివ్ ప్రకటన



కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అడిషనల్ అడ్వయిజర్ దినేశ్‌చంద్‌కు మిషన్‌భగీరథపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

ఇంటింటికీ నల్లాల ద్వారా మంచినీటి సరఫరాలో తెలంగాణ ప్రభుత్వాన్ని మోడల్‌గా అనుసరించాలని కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అదనపు సలహాదారు దినేశ్‌చంద్ ప్రశంసించారు. ఢిల్లీలోని పర్యావరణ్ భవన్‌లో మంగళవారం జరిగిన 2018-19 వార్షిక తాగునీటి ప్రణాళిక సమావేశంలో మిషన్ భగీరథ పథకంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా దినేశ్‌చంద్ మాట్లాడుతూ 2022 నాటికి దేశంలోని ప్రతీ ఒక్కరికీ సురక్షిత తాగునీటిని అందించాలని కేంద్రం సంకల్పించిందని, మిగతా రాష్ర్టాల కంటే నాలుగేండ్ల ముందుగానే తెలంగాణలో ప్రతీ ఇంటికీ నల్లా నీటిని అందించనుండటం గొప్ప విషయమన్నారు. పలు పథకాలకు కేంద్రం ఇచ్చిన నిధులను తెలంగాణ ప్రభుత్వం సమర్థంగా ఖర్చు చేసినందుకుగానూ ఈ ఏడాది రూ.41.10 కోట్లు ఇన్సెంటివ్ ఇస్తున్నట్టు చెప్పారు. వీటిని వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి మిషన్ భగీరథపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య విభాగం అదనపు సలహాదారు రాజశేఖర్, ఎన్నార్డీడబ్ల్యూపీ కన్సల్టెంట్ నర్సింగరావు, ఈఈ మూర్తి పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీకి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం

మైనార్టీ గురుకులాలకు సాయం చేయండి

కేంద్ర మంత్రి నక్వీకి మంత్రి పోచారం విజ్ఞప్తి

రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన మైనార్టీ గురుకులాల్లో మౌలిక సదుపాయాలను పెంచేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం ఢిల్లీలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీతో భేటీ అయ్యారు. తెలంగాణలో మైనార్టీల సంక్షేమ కోసం చేపట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి నక్వీ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రశంసించారు. మైనార్టీల విద్య, అభివృద్ధి కోసం తెలంగాణ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని కొనియాడారు. భేటీ అనంతరం మంత్రి పోచారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోటగిరి, బాన్సువాడ, బిచ్కుంద కామారెడ్డి, లింగంపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మౌలిక వసతులు పెంచేందుకు నిధులివ్వాల్సిందిగా కోరామని, బాన్సువాడలో మైనార్టీ ఉర్దూ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, మల్టీ సెక్టోరియల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద మైనార్టీ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు.

జల్‌పల్లి పార్థివాడలో 'ప్రేమ' హోలీ



హోలీ వేడుకల్లో భాగంగా పూర్వీకుల సమాధులను ముస్తాబు చేస్తున్న పార్థీలు

- నేటి నుంచి మూడురోజులు సంబురాలు
- ఆరో నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీఖాన్, అమీరాబాయి ప్రేమకు గుర్తుగా వేడుకలు

పహాడీషరీఫ్: హోలీ వచ్చిందంటే రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలంలోని జల్‌పల్లి పార్థివాడలో మూడురోజులపాటు జాతర జరుగుతుంది. ఈ వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గతంలో ఇక్కడ నివసించి ప్రస్తుతం నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పార్థీలు(పిట్టలోళ్లు) ఇక్కడికి వచ్చి తమ పూర్వీకుల సమాధులను అలంకరించి పూజలు చేస్తారు. ఆరో నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీఖాన్, అమీరాబాయి ప్రేమకు గుర్తుగా ఈ జాతర నిర్వహిస్తుంటామని వారు చెప్తున్నారు. ఆరో నిజాం కాలంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పార్థీలు హైదరాబాద్‌కు వలస వచ్చారు. కానీ వారు నివాసం ఉండేందుకు నిజాం ఒప్పుకోలేదు. ఎన్ని విధాలా ప్రయత్నించినా ఒప్పుకోకపోవడంతో పార్థీలు తమ తెగలోకెల్లా సౌందర్యవతి, గుణవతి అయిన అమీరాబాయిని సభకు తీసుకొచ్చి నిజాంకు కనిపించేలా కూర్చోబెట్టారు. ఆమె అందానికి దాసోహమై ప్రేమలో పడిన ఆరో నిజాం.. పార్థీలు నివాసం ఉండేందుకు అనుమతించాడు. వారి ప్రేమకు గుర్తుగా అమీరాబాయికి అందమైన భవనం, ఈత కొలను నిర్మించాడు. ఆమె మరణించిన తర్వాత పార్థివాడలో నిర్మించిన సమాధి ఇప్పటికీ వారి ప్రేమకు మరో సాక్ష్యంగా నిలుస్తున్నది. వారి ప్రేమకు గుర్తుగా పార్థీలు ఏటా హోలీ సమయంలో ఇక్కడికి వచ్చి తమ పూర్వీకులకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్లు సిద్ధం!

మార్చిలో సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదర్‌గూడలో శాసన సభ్యుల కాలనీలోని బహుళ అంతస్తుల భవనాలను మార్చిలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు రోడ్లు భవనాలశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రూ.166 కోట్ల అంచనా వ్యయంతో మూడెకరాల స్థలంలో ఒక్కొక్కటి 2,500 చదరపుఅడుగుల వైశాల్యంతో 120 క్వార్టర్ల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇందులో క్లబ్ హౌస్, స్విమ్మింగ్‌పూల్, సిబ్బంది క్వార్టర్లు, వాణిజ్య సముదాయం వంటి ఆధునిక హంగులను సమకూర్చుతున్నారు.

హైదర్‌గూడ క్వార్టర్ల వివరాలు:

ప్రధాన భవంతి – మూడు సెల్లార్లు + గ్రౌండ్ ఫ్లోర్ + 12 అంతస్తులు

12 అంతస్తుల్లో 120 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు. రెండు సెల్లార్లలో 288 కార్లను పార్కింగ్ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 24 కార్యాలయ క్యాబిన్లు నిర్మిస్తున్నారు. 6,01,532 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. ఆరు అంతస్తుల్లో ఉద్యోగుల నివాసం కోసం 36 ఫ్లాట్లు నిర్మిస్తుండగా, సిబ్బంది నివాసాలను సైతం ఆరు అంతస్తుల్లో చేపడుతున్నారు.

పబ్లిక్‌సెక్టార్ సంస్థలు తెలంగాణకే దక్కాలి

- ఏపీ ప్రాంత ఉద్యోగులను తెలంగాణకు కేటాయించవద్దు
- షీలాబిడే కమిటీకి ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ స్థానికతగల ఉద్యోగులను తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ సంస్థలకు కేటాయించవద్దని తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు షీలాబిడే కమిటీని కోరారు. పబ్లిక్‌సెక్టార్ సంస్థలలో ఉద్యోగుల విభజన అంశంపై షీలాబిడే కమిటీ మంగళవారం పరిశ్రమభవన్‌లో సమావేశం నిర్వహించింది. పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ రాజేశం, జనరల్ సెక్రటరీ జీవన్, వ్యవస్థాపక చైర్మన్ సుధీర్, ప్రధాన సలహాదారు సింగం విజయమోహన్, అధికారులు, ఉద్యోగసంఘాల నేతలు హాజరై ఉద్యోగుల విభజనపై వాదనలను వినిపించారు. కమలనాథన్ కమిటీ మార్గదర్శకాలు పబ్లిక్‌సెక్టార్ సంస్థలలో వర్తించవని పేర్కొన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో ఆంధ్రాప్రాంతీయులే పబ్లిక్‌సెక్టార్ సంస్థలకు ఎండీలు, చైర్మన్లుగా పనిచేశారని, ఇష్టారాజ్యంగా ఏపీ ఉద్యోగులను నియమించారని వివరించారు. రాష్ట్ర విభజన తరువాత కూడా ఏపీ పాలకులు తెలంగాణలోని తొమ్మిదో షెడ్యూల్‌లోని 70 సంస్థలకు చెందిన విలువైన ఆస్తులను, ఆర్థికవనరులను కొల్లగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఎఫ్‌డీల ఆస్తులను విక్రయిస్తామని ఏపీ సర్కారు ప్రకటించిందన్నని వివరించారు. తెలంగాణలోని పబ్లిక్‌సెక్టార్ సంస్థల ఆస్తులన్నీ తెలంగాణకే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా ఉద్యోగులను స్థానికత ప్రకారం ఏపీకి పంపిస్తే తెలంగాణలో పెద్దసంఖ్యలో ఖాళీలు ఏర్పడుతాయని, పబ్లిక్‌సెక్టార్ సంస్థలను విస్తరించుకునేందుకు అవకాశాలు మెరుగుపుతాయని పేర్కొన్నారు. ఉద్యోగసంఘాల వాదనలకు షీలాబిడే కమిటీ సానుకూలంగా స్పందించారు. పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్-82 ప్రకారమే ఉద్యోగుల విభజన ఉంటుందని, తెలంగాణ స్థానికతకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆగ్రోస్, అటవీ, నీటిపారుదల అభివృద్ధి తదితర సంస్థల ఉద్యోగుల విభజనపై చర్చలు జరిగాయి.


స్టాంప్‌డ్యూటీతో సాదాబైనామా క్రమబద్ధీకరణ

- హెచ్ఎండీఏ, 'కుడా'కు మినహాయింపు
- త్వరలో జారీ కానున్న ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్టాంప్‌డ్యూటీ కట్టించుకొని సాదాబైనామా దరఖాస్తులను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి జిల్లా కలెక్టర్లకు మెమో ఉత్తర్వులు జారీచేశారు. భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను దీనిని వర్తింపజేస్తున్నారు. సాదాబైనామా క్రమబద్ధీకరణ నుంచి హైదరాబాద్ జిల్లాతోపాటు హెచ్ఎండీఏ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) పరిధిలోని ప్రాంతాలను మినహాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. భూరికార్డుల ప్రక్షాళనలో వెలుగుచూసిన దరఖాస్తులు దాదాపు మూడులక్షల వరకు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. ఈ ఉత్తర్వులతో భూములన్నీ క్రమబద్ధీకరణ అవుతాయని తెలిపారు. ఇప్పటికే క్రమబద్ధీకరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ వివిధ కారణాలవల్ల చట్టం అమలులోకి రాలేదు. మరో తేదీ నిర్ణయిస్తూ త్వరలో ఉత్తర్వులు రానున్నాయి.

వ్యవసాయ పథకాల్లో రాష్ట్రం టాప్

- ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పథకాల అమల్లో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందని, దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమానికి సీఎం పెద్దపీట వేస్తున్నారని, దీనిలోభాగంగా రైతు రుణమాఫీ కింద రూ. 16,400 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇంత భారీ మొత్తంలో ఏ రాష్ట్రం కూడా రుణమాఫీ చేయలేదన్నారు. పంట పెట్టుబడుల కింద ఏడాదికి ఎకరాకు రూ. 8 వేలు రైతులకు ప్రకటించి దేశంలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. దీనికోసం బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం ప్రకటించారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా సమగ్ర భూప్రక్షాళన సర్వేను సీఎం కేసీఆర్ చేపట్టారన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది కష్టాన్ని గుర్తించిన సీఎం.. వారికి ప్రోత్సాహకంగా ఒక మూలవేతనాన్ని ఇవ్వడం మంచి పరిణామమని పేర్కొన్నారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు: ఇంటర్‌బోర్డు స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లుపూర్తయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పరీక్షలను నిర్వహిస్తారు. విద్యార్థులు ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించేదిలేదని ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ చెప్పారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి రాష్ట్రవ్యాప్తంగా 9,63,546 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, వీరికోసం 1,294 పరీక్ష కేంద్రాలను సిద్ధంచేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి 25,395 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం బోర్డు కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశామని, 040-24655027కు ఫోన్‌చేయాల్సి ఉంటుందని బోర్డు అధికారులు తెలిపారు. ట్యూషన్ ఫీజులు చెల్లించలేదన్న సాకుతో విద్యార్థుల హాల్‌టికెట్లు నిలిపివేయొద్దన్నారు. https://tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, హాల్ టికెట్‌పై కాలేజీ ప్రిన్సిపాల్ సంతకం అవసరంలేదని స్పష్టంచేశారు.



రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి
- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి



పట్టుపురుగుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో పట్టు పరిశ్రమ ఏర్పాటుకు తెలంగాణ అనుకూలమని, మల్బరీ సాగుకు యోగ్యమైన భూములున్నాయని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, మల్బరీ సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారుల రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లావారీగా శాఖాపురోగతిని డైరెక్టర్ సమీక్షించారు. పట్టు పరిశ్రమల షెడ్ల నిర్మాణానికి రూ.4 లక్షల రుణం మంజూరు చేస్తున్నామని, దీనిలో రూ.లక్ష సబ్సిడీ ఉంటుందని డైరెక్టర్ చెప్పారు. దీనిపై రైతులకు ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారులు అవగాహన కల్పించాలని, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతిజిల్లాలో వెయ్యి ఎకరాల మల్బరీ సాగు లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సెరికల్చర్ విభాగంలో 750 ఖాళీలను త్వరలోనే భర్తీచేస్తామని ప్రకటించారు.

40 మంది చనిపోయారనడం అవాస్తవం

- శిశు మరణాలపై హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో శిశుగృహాల్లో పౌష్టికాహార లోపం, నిర్లక్ష్యం కారణంగా ఏడాదిలో 40 మంది చిన్నారులు చనిపోయారని ఆరోపణలు నిజంకావని ఉమ్మడి హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం నివేదించింది. గత ఏడాది జనవరి నుంచి 2018 జనవరి వరకు శిశు గృహాలకు సంబంధించి 18 మంది శిశువులు మరణించారని, వీటికి పౌష్టికాహార లోపం, నిర్లక్ష్యం కారణాలు కావని పేర్కొన్నది. మరణించిన శిశువులు వివిధ ప్రాంతాల్లోని చెత్తకుండీలు, మార్గాల్లో వదిలేసి దొరికారని, ఆ సమయంలోనే వారి ఆరోగ్య పరిస్థితులు విషమించి ఉన్నాయని వెల్లడించింది. శిశుగృహాల్లో నిర్లక్ష్యంతో చిన్నారులు చనిపోతున్నారని, నల్లగొండ జిల్లాలోనే 40 మంది చనిపోయారని హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది.

ఖమ్మం కొత్త కలెక్టరేట్ నిర్మాణంపై వ్యాజ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కలెక్టరేట్ కార్యాలయం వంటి మౌలిక వసతుల ప్రాజెక్టుల భూసేకరణ సమయంలో సామాజిక ప్రభావ అధ్యయనం నుంచి మినహాయించే అధికారం తమకు ఉంటుందని ప్రభుత్వం మంగళవారం హైకోర్టుకు నివేదించింది. ఖమ్మం కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి భూసేకరణలో నిబంధనలు పాటించలేదని దాఖలైన వ్యాజ్యంపై ప్రభుత్వం వివరణ సమర్పించింది.

పురుషోత్తంరెడ్డి ఆస్తులపై ఐటీ ఆరా!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులో విచారణను ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ మాజీ అధికారి పురుషోత్తంరెడ్డి ఆస్తులపై ఆదాయపుపన్ను(ఐటీ)శాఖ ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఆదాయం ఎలా సంపాదించారు, పన్ను చెల్లిస్తున్నారా అనే విషయాలపై విచారణ జరుగుతున్నది, తరువాత ఐటీ అధికారులు రంగంలోకి దిగే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా ఆరా తీయవచ్చని వారు చెప్తున్నారు.

తిరుమల కొండపై చిరుతల సంచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తిరుమల కొండపై చిరుతల సంచారంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఐదేండ్ల ఓ చిరుత బాలాజీనగర్‌లోకి చొరబడి కుక్కను ఎత్తుకెళ్లడం, తాజాగా ఆది, సోమవారం అదేప్రాంతంలో స్థానికులు కంట పడటం ఆందోళనకు గురిచేస్తున్నది. కాలిబాట మార్గాన వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉత్తమ టీచర్ల ఎంపిక బాధ్యత డీఈవోలదే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న దరఖాస్తు విధానానికి స్వస్తి పలుకుతూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇకనుంచి ఉత్తమ టీచర్ల ఎంపిక బాధ్యతలను డీఈవోలకే ఇవ్వనున్నారు.

మార్చి నెలాఖరులోగా డిగ్రీ కాలేజీల అఫిలియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమయ్యేనాటికి అఫిలియేషన్ పొందిన ప్రైవేటు డిగ్రీ కాలేజీల జాబితాను సిద్ధంచేయాలని రాష్ట్రంలోని ఆరు విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యామండలి మంగళవారం ఆదేశాలు జారీచేసింది. మార్చి నెలాఖరులోగా అన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ పూర్తి చేయాలని ఆదేశించింది.

ఎంటెక్ కాలేజీల్లో భారీగా తగ్గుతున్న సీట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఎంటెక్ కాలేజీల్లో ప్రవేశాలు పొందడానికి విద్యార్థులు ముందుకు రావడంలేదు. గతంలో మాదిరిగా అటెండెన్స్‌లేకుండా అడ్మిషన్లు ఇవ్వడానికి ప్రైవేటు యాజమాన్యాలు కూడా సిద్ధపడటంలేదు. గత విద్యాసంవత్సరం నుంచి బయోమెట్రిక్ విధానంలో అటెండెన్స్ అమలుపరుస్తుండటంతో మంచి ఫలితాలు వస్తున్నాయని జేఎన్‌టీయూహెచ్ అధికారులు తెలిపారు. ప్యాట్రోలింగ్ పాటు విద్యార్థుల అటెండెన్స్‌ను బయోమెట్రిక్ ద్వారా నమోదుచేస్తుండటంతో కళాశాలలకు అడ్మిషన్లకు చెక్ పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలో 30 వేలకు పైగా ఉన్న ఎంటెక్ సీట్ల సంఖ్య.. 2017-18విద్యా సంవత్సరంలో సగానికి తగ్గిందని వివరించారు.

దేవాదుల-తుపాకులగూడెం కార్పొరేషన్‌కు గ్రీన్‌సిగ్నల్

మూడో పేజీ తరువాయి...

సమీకరణలో వెలుసుబాటు కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న నీటిపారుదలశాఖ ప్రతిపాదనకు తాజాగా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అండ్ తుపాకులగూడెం బరాజ్ ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్' ఏర్పాటుకు సంబంధించిన జీవో త్వరలో విడుదల అవుతుందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది.

జలనిధి కోసం కార్పొరేషన్

ఏటా సాగునీటి రంగానికి రూ.25 వేల కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం ఆ మేరకు కేటాయింపులను సమకూర్చేందుకుగాను చర్యలు పట్టింది. ఇందులో భాగంగా దేవాదుల, తుపాకులగూడెం నిధుల సమీకరణ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న నీటిపారుదల శాఖ ప్రతిపాదనకు తాజాగా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ రూరల్, అర్బన్, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట జిల్లాల పరిధిలోని 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన దేవాదుల ప్రాజెక్టుకు గత సమైక్య ప్రభుత్వం అరకొర నిధి కేటాయింపులు చేసింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం 2015లో కేటాయింపులు 38.18 టీఎంసీల నుంచి 60 టీఎంసీలకు పెంచింది. రీడిజైనింగ్‌లో భాగంగా పలు మార్పులు చేయడంతోపాటు మల్కాపురం దగ్గర 10.78 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి కూడా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో దేవాదుల పూర్తికి సుమారు మరో రూ.8 వేల కోట్ల వరకు నిధులు అవసరం ఉన్నాయి. దీంతోపాటు దేవాదుల ఇన్‌టేక్ పాయింట్ వద్ద 365 రోజుల పాటు నీటి లభ్యత ఉండేందుకుగాను ప్రభుత్వం తుపాకులగూడెం దగ్గర బరాజ్ నిర్మాణాన్ని మొదలుపెట్టింది. రూ.2121 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ బరాజ్‌ను కూడా వచ్చే ఏడాది వానాకాలం నాటికి పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ క్రమంలో రెండు ప్రాజెక్టులకుగాను దాదాపు రూ.10వేల కోట్ల వరకు నిధులు అవసరమున్నాయి. అందుకే కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు వస్తుందని నీటిపారుదలశాఖ సూచించింది.

12,717 కోట్లటా!

పెరిగిన పీఎన్‌బీ కుంభకోణం విలువ

మరో రూ.1,323 కోట్ల మోసాన్ని గుర్తించిన బ్యాంకు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం విలువ మరింత పెరిగింది. మరో రూ.1,323 కోట్ల మోసపూరిత లావాదేవీలను గుర్తించామని పీఎన్‌బీ తాజాగా వెల్లడించింది. దీంతో ముందుగా అంచనా వేసినట్లుగా ఈ స్కాం విలువ రూ.11,394.02 కోట్ల (1.77 బిలియన్ డాలర్ల)ను మించిపోయి రూ.12,717.02 కోట్ల (దాదాపు 2 బిలియన్ డాలర్ల)కు చేరింది. ఇప్పటికే పీఎన్‌బీ కుంభకోణం.. దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణంగా రికార్డుకెక్కింది. ఈ క్రమంలో ఇంకో మోసం వెలుగులోకి రావడం ప్రాధాన్యతను సంతరించుకోగా, లోతుగా పరిశీలిస్తే మరిన్ని మోసాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీ హౌజ్ శాఖ నుంచి మోసపూరితంగా జారీ అయిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ లేదా అండర్‌స్టాండింగ్ (ఎల్‌వోయూ), ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లతోనే ఈ కుంభకోణం మొత్తం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎల్‌వోయూలు, ఎల్‌వోసీల ఆధారంగానే ఇతర దేశీయ బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల్లోగల పీఎన్‌బీ ఖాతాల (నోస్ట్రో అకౌంట్లు) నుంచి నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీల కంపెనీలు పెద్ద ఎత్తున రుణాలు పొందాయి. దీని వల్ల జరిగిన నష్టం దాదాపు రూ.11,400 కోట్లుగా పీఎన్‌బీ అంచనా వేసింది. అయితే మరిన్ని ఎల్‌వోయూలు బయటపడినట్లు పీఎన్‌బీ చెప్పింది. డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం వీటి విలువ రూ.1,323 కోట్లుగా ఉంటుందని సోమవారం రాత్రి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు బ్యాంక్ వెల్లడించింది. ఇక పీఎన్‌బీ తాజాగా కనుగొన్న ఎల్‌వోయూల్లో గీతాంజలి గ్రూప్ సంస్థలకు సంబంధించి మొత్తం రూ.1,251 కోట్ల విలువైన ఎల్‌వోయూలున్నట్లు సీబీఐ ధ్రువీకరించింది.

సీఏఎంలో సీబీఐ సోదాలు

పీఎన్‌బీ స్కాం విచారణలో భాగంగా ప్రముఖ న్యాయ సేవల సంస్థ సిరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ (సీఏఎం) కార్యాలయంలో సీబీఐ సోదాలు నిర్వహించింది. ముంబై ఆఫీసులో జరిగిన ఈ తనిఖీల్లో నీరవ్ మోదీకి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పీఎన్‌బీ కుంభకోణం వెలుగు చూడటానికి కొద్ది వారాల ముందు నీరవ్ జరిపిన ఓ బ్యాంకింగ్ ఆధారిత లావాదేవీని సీఏఎం పర్యవేక్షించింది. సీఏఎంకు నీరవ్ కొత్త క్లయింట్ అవగా, పీఎన్‌బీ మోసం నేపథ్యంలో ఆయన ఖాతాను సీఏఎం తొలిగించింది. మరోవైపు సీబీఐ సోదాల్ని సీఏఎం ఖండించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, ఎస్‌బీఐ వంటి అగ్రశ్రేణి ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలకు న్యాయ సలహాల్ని, సహాయాన్ని అందించే తమపై అనుమానం బాధాకరమన్నది.

పీఎస్‌బీలకు 15 రోజుల గడువు

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో సంస్థాగత, శాఖాపరమైన, సాంకేతిక అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఓ సుశిక్షిత కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని ప్రభుత్వ రంగ బ్యాంకర్ల (పీఎస్‌బీ)ను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 15 రోజుల్లోగా ఈ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించాలని దేశంలోని అన్ని పీఎస్‌బీలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గడువు విధించింది. బ్యాంకింగ్ మోసాలకు సంబంధించి ఆయా బ్యాంకుల్లో ఓ సీనియర్ అధికారిని జవాబుదారీగా కూడా చూపాలని ఈ సందర్భంగా ఆర్థిక శాఖ పేర్కొన్నది. ఈ మేరకు ప్రభుత్వ బ్యాంకుల్లోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీ), చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ల (సీటీవో)కు మంగళవారం ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు.

అమెరికాలో ఫైర్‌స్టార్ దివాలా పిటీషన్

పీఎన్‌బీ స్కాం ప్రధాన సూత్రధారి, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ.. అమెరికాలో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. ఈ సంస్థ లిస్టింగ్ ఆస్తులు, ఇతరత్రా 100 మిలియన్ డాలర్ల మేర ఉన్నాయని న్యూయార్క్ దక్షిణ జిల్లాలోని ఓ కోర్టు పేర్కొంది. అమెరికాతోపాటు, ఐరోపా, మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఫైర్‌స్టార్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కాగా, నకిలీ ఎల్‌వోయూలు, ఎల్‌వోసీలపై నీరవ్ మోదీ పీఎన్‌బీని వేల కోట్లు ముంచగా, ఈ ఏడాది ఆరంభంలోనే దేశం విడిచి పారిపోయినది తెలిసిందే. మరోవైపు పీఎన్‌బీ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. నీరవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ కోసం కోర్టుకు వెళ్లగా, పన్ను ఎగవేత కేసులో మరో కోర్టు నీరవ్‌కు సమన్లు జారీ చేసింది.

ఉషా అనంత సుబ్రమణ్యన్‌ను ప్రశ్నించిన సీబీఐ



దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పీఎన్‌బీ కుంభకోణం కేసులో ఆ బ్యాంకు మాజీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో, అలహాబాద్ బ్యాంక్ ప్రస్తుత సీఈవో, ఎండీ అయిన ఉషా అనంత సుబ్రమణ్యన్‌ను సీబీఐ మంగళవారం ప్రశ్నించింది. 60 ఏండ్ల ఉషా.. ఇటీవలే భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) చీఫ్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే పీఎన్‌బీలో ఈమె 2015 ఆగస్టు 14 నుంచి సీఈవో, ఎండీగా పనిచేశారు. 2017 మే 6న అలహాబాద్ బ్యాంక్ సీఈవో, ఎండీగా వచ్చారు. అంతకుముందు 2011 జూలై నుంచి 2013 నవంబర్ వరకు పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ క్రమంలోనే ఆమెను సీబీఐ విచారించింది. ఇక దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్ కణన్‌ను కూడా ప్రశ్నించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ తెలిపింది. కాగా, ఉషాను ముంబై సీబీఐ ఆఫీసులో ప్రశ్నించినట్లు ఓ సీబీఐ అధికారి తెలిపారు. మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్‌నకు నగదు పంపిన బ్యాంకుల కూటమికి ఐసీఐసీఐనే నేతృత్వం వహిస్తుండటంతో ఆ బ్యాంక్ ఈడీని కూడా ప్రశ్నించామన్నారు. పీఎన్‌బీ జనరల్ మేనేజర్లు నిహాల్ అషద్, విమ్లేశ్ కుమార్‌లను సైతం ప్రశ్నించినట్లు సీబీఐ చెప్పింది. ముగ్గురు స్టాచుటరీ ఆడిటర్లనూ ప్రశ్నించినట్లు వెల్లడించింది. ఈ కేసుతో సంబంధమున్న 12 మందిని ఇప్పటిదాకా సీఅరెస్టు చేసింది.

రూ.50 కోట్లకు మించిన ఎన్‌పీఏల్ని వదలొద్దు

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో మొండి బకాయిలపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్నది. రూ.50 కోట్లకు మించిన అన్ని నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) ఖాతాలపై విచారణ జరుపాలని బ్యాంకర్లకు సూచించింది. అంతేగాక సీబీఐకి మోసాలపై నివేదించాలని కూడా స్పష్టం చేసింది. రొటోమాక్ గ్రూప్, సింభౌలీ షుగర్స్ మాదిరిగా తీసుకున్న రుణాలను చెల్లించకపోతే దర్యాప్తు సంస్థల్ని ఆశ్రయించవచ్చని కూడా పీఎస్‌బీలకు తేల్చిచెప్పింది. ఈ మేరకు మంగళవారం పీఎస్‌బీల ఎండీలకు ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు. సంస్థాగతంగా మోసాల్ని గుర్తిస్తే.. వాటిని సీబీఐకి అప్పగించాలని చెప్పారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టవద్దన్నారు. పీఎంఎల్ఏ, ఫెమా లేదా ఎగుమతి, దిగుమతుల నిబంధనల ఉల్లంఘన జరిగితే ఈడీ, డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ)ల వద్దకూ వెళ్లండన్నారు. భారతీయ బ్యాంకింగ్ రంగంలో సుమారు రూ.11 లక్షల కోట్ల మొండి బకాయిలుండగా, ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందినవే దాదాపు రూ.8.5 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఈ ఏడాది వేతనాల్లో 9.4% వృద్ధి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ప్రస్తుత సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉద్యోగుల వేతనాల్లో వృద్ధి సరాసరిగా 9.4 శాతంగా ఉండనున్నదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. గతేడాది పెరిగిన స్థాయిలోనే ఈ ఏడాది ఉండనున్నట్లు ప్రముఖ హెచ్ఆర్ కన్సల్టెన్సీ అయాన్ హెవిట్స్ నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల జీతాల విషయానికి వస్తే మాత్రం 15.4 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొంది. దేశవ్యాప్తంగా 20 పారిశ్రామిక రంగాలకు చెందిన వెయ్యికి పైగా కంపెనీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా సంస్థ ఈ నివేదికను రూపొందించింది. సరాసరిగా భారత్‌లో ఉద్యోగుల జీతాలు 9.4 శాతం నుంచి 9.6 శాతం మధ్యలో పెరుగొచ్చని అభిప్రాయపడింది. 2017లో ఇది 9.3 శాతంగా ఉన్నది. అయినప్పటికీ ఆసియా-పసిఫిక్ దేశాల్లో భారత్‌లోనే అత్యధికంగా వేతనం పెరుగనున్నదని పేర్కొనడం విశేషం. చైనాలో సరాసరి ఉద్యోగి వేతన పెంపు 6.7 శాతంగా ఉంటుందని అంచనావేసిన సంస్థ..ఫిలిప్పీన్స్‌లో 5.8 శాతం, మలేషియాలో 5.1 శాతం, సింగపూర్‌లో 4 శాతం, ఆస్ట్రేలియాలో 3.2 శాతం, జపాన్‌లో 2.5 శాతంగా ఉండనున్నదని పేర్కొంది. దేశవ్యాప్తంగా నైపుణ్యం కొరత తీవ్రస్థాయిలో ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశమని, వీటిపై కార్పొరేట్ సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని అయాన్ ఇండియా కన్సల్టింగ్ భాగస్వామి ఆనందోరూప్ ఘోస్ సూచించారు. రంగాల విషయానికి వస్తే సేవలు, కన్స్యూమర్ ఇంటర్నెట్ కంపెనీలు, లైఫ్ సైన్స్, ఆటోమోటివ్, కన్స్యూమర్ ప్రొడక్ట్ విభాగాల్లో పనిచేస్తున్న వారి జీతభత్యాల్లో రెండంకెల వృద్ధి నమోదవనున్నదని తెలిపింది.

గీతాంజలిపై ఫోరెన్సిక్ ఆడిట్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌లో మోసం జరిగిందో లేదో తెలుసుకోవడానికి రెండు డజన్‌కు పైగా ఉన్న బ్యాంకింగ్ రంగ సంస్థలు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడానికి సిద్ధమవుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ నేతృత్వంలోని కన్సార్టియం గీతాంజలికి రూ.6 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చాయి. గీతాంజలిలో ఆర్థిక మోసం జరిగిందో తెలుసుకోవడానికి ఈ బ్యాంకుల కన్సార్టియం టీఆర్ ఛాధా అండ్ కోను నియమించుకున్నాయి. ఇచ్చిన రుణాన్ని వసూలు చేయడానికి ఈ ఆడిట్ దోహదం చేయనున్నదని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. ఈ గీతాంజలికి పీఎన్‌బీ 1,000 కోట్ల స్థాయిలో రుణం ఇవ్వగా, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.600 కోట్లు సమర్పించుకున్నాయి.

బకాయిల్ని చెల్లిస్తాం

సీబీఐ దెబ్బకు దిగొచ్చిన సింభౌలీ షుగర్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: రుణాల ఎగవేతపై సీబీఐ కేసుల దెబ్బకు సింభౌలీ షుగర్స్ దిగొచ్చింది. తమ బకాయిల్ని మొత్తం చెల్లిస్తామని మంగళవారం ముందుకొచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)కు చెల్లించాల్సిన రుణాలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. అంతేగాక తమకు రుణాలిచ్చిన ఇతర అన్ని బ్యాంకర్లతోనూ ఈ విషయమై సంప్రదింపులు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటామని చెప్పింది. సోమవారం రాత్రి పొద్దుపోయాక స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకూ ఈ విషయాన్ని సింభౌలీ తెలియపరిచింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని, వాటిని విధిగా చెల్లిస్తూ వచ్చామని, అయితే చక్కెర పరిశ్రమలో నెలకొన్న కాలానుగుణ ప్రతికూల పరిస్థితుల కారణంగా ఆ తర్వాత చెల్లించలేకపోయామన్నది. రూ.97.85 కోట్ల బ్యాంక్ లోన్ మోసం ఆరోపణలపై ఓబీసీ ఫిర్యాదుతో ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌కు చెందిన సింభౌలీ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కంపెనీ చైర్మన్ గుర్మిత్ సింగ్ మన్, డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్, ఇతరులపై ఎఫ్ఐఆర్ దాఖలు పరిచింది. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు గుర్పాల్ సింగ్ అల్లుడన్నది విదితమే.

హైదరాబాద్‌లో సర్వీస్‌నౌ కేంద్రం

500 మందికి ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ సర్వీస్‌నౌ.. హైదరాబాద్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. తన నూతన పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ మిట్చ్ యంగ్ చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాన్ని మార్చే మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందించేందుకు ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రస్తుతం తమ కార్యాలయంలో 500 మంది ఉద్యోగులు ఉన్నారని, తాజాగా పరిశోధన కేంద్రం ఏర్పాటుతో వీరిసంఖ్య వెయ్యి పైచిలుకు చేరుకోనున్నదని ఆయన వివరించారు. పలు నగరాలను పరిశీలించిన తర్వాత హైదరాబాద్ తమకు సరైన గమ్యస్థానమని భావించి ఎంచుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.



స్వల్పంగా తగ్గిన జీఎస్టీ వసూళ్లు

జనవరిలో రూ.86,318 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: వస్తు సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు మరింత తగ్గాయి. జనవరి నెలకుగాను(ఫిబ్రవరి 25 వరకు) రూ.86,318 కోట్ల మేర వసూలయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్‌లో నమోదైన రూ.86,703 కోట్లతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.14,233 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ కింద రూ.19,961 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.43,794 కోట్లు, కంపోనేషన్ సెస్ కింద రూ.8,331 కోట్లు వసూలయ్యాయి. మరో 200 ఉత్పత్తులపై పన్నును తగ్గించడంతో వరుసగా రెండు నెలలపాటు తగ్గుముఖం పట్టిన జీఎస్టీ వసూళ్లు డిసెంబర్‌లో మాత్రం పెరిగాయి. జీఎస్టీ కింద ఇప్పటి వరకు 1.03 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే ప్రతి మూడు నెలలకొకసారి 17.65 లక్షల కంపొసిషన్ డీలర్లు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, వీరిలో 1.23 లక్షల మంది ఈ స్కీం నుంచి వైదొలిగారు. ఈ నెల 25 వరకు 57.58 లక్షల మంది జీఎస్‌టీఆర్ 3బీ రిటర్నులు దాఖలు చేశారు. వీటిలో రూ.24,806 కోట్లను ఐజీఎస్టీ నుంచి సీజీఎస్టీ/ఎస్‌జీఎస్టీకి బదిలీ చేసినట్లు పేర్కొంది.

అత్యంత స్వేచ్ఛాయుతం

భారత్‌లో ఉన్నంత వ్యాపార స్వేచ్ఛ మరెక్కడా ఉండదు ■ ఇండో-కొరియా వ్యాపార శిఖరాగ్ర సదస్సులో మోదీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: వర్తక, వాణిజ్యాలకు భారత్ ప్రపంచంలోనే అత్యంత స్వేచ్ఛాయుతమైన గమ్యస్థానమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేందుకు విదేశీ నిధులు అవసరమని, దేశంలో పెట్టుబడులను పెంపొందించడంతో పాటు వాటికి తగినంత రక్షణ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), పారిశ్రామిక విధాన, అభివృద్ధి విభాగం (డీఐపీపీ) సంయుక్తంగా నిర్వహించిన భారత్-కొరియా వ్యాపార శిఖరాగ్ర సదస్సులో మంగళవారం ఆయన ప్రసంగిస్తూ.. దేశంలో సుస్థిరమైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించేందుకు, విధాన నిర్ణయాల విషయంలో నిర్హేతుకతను తొలగించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. 'వ్యాపారానికి భారత్ సిద్ధంగానూ, అత్యంత స్వేచ్ఛాయుతమైన గమ్యస్థానంగానూ ఉన్నది. ఇక్కడ ఉన్నంత స్వేచ్ఛను ప్రపంచంలోని ఇతర వర్ధమాన మార్కెట్లలో మీరు చూడలేరు' అని మోదీ పేర్కొన్నారు. ఆసియా ఖండంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మూడవదిగా ఉన్న భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు అనేక రంగాల్లో ద్వారాలు తెరిచామని, 90 శాతానికి పైగా అనుమతులను ఆటోమ్యాటిక్ మార్గంలోనే ఉంచామని ఆయన తెలిపారు. రక్షణ రంగంలో మినహా ఇతర రంగాల్లో, ముఖ్యంగా తయారీ రంగంలో పెట్టే విదేశీ పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సిన అవసరం దాదాపుగా లేదని, దేశంలో విదేశీ పెట్టుబడులను పెంపొందించడంతో పాటు వాటికి తగినంత భద్రత కల్పించేందుకు అవసరమై అన్ని



చర్యలూ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యానికి, వారు చేస్తున్న సేవలకు భారత్ ఎంతో విలువ ఇస్తున్నదని ప్రధాని పేర్కొంటూ.. 'వ్యక్తిగత స్థాయిలో ఎప్పుడు అవసరమైతే అప్పుడు మీకు పూర్తిస్థాయి తోడ్పాటును అందించేందుకు నేనూ సిద్ధంగా ఉన్నా' అని భరోసా ఇచ్చారు. కార్పొరేట్ రంగంలో పన్నులను తగ్గించే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని ఆయన చెప్పారు. 'కొనుగోలు శక్తి పరంగా భారత్ ఇప్పటికే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పరంగా కూడా మా దేశం అతిత్వరలోనే ప్రపంచంలోని ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడం ఖాయం. ప్రపంచంలో నేడు అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్ మాత్రమే' అని నరేంద్ర మోదీ వివరించారు.

8% వృద్ధిరేటు సాధ్యమే: జైట్లీ

అంతర్జాతీయంగా ప్రస్తుతమున్న సానుకూల పరిస్థితులతో పాటు దేశంలో చేపడుతున్న విధానపరమైన సంస్కరణలను ఆలంబనగా చేసుకుని 7-8 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటు సాధించే శక్తి భారత ఆర్థిక వ్యవస్థకు ఉన్నదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పునరుద్ఘాటించారు. భారత్-కొరియా ద్వైపాక్షిక వ్యాపార శిఖరాగ్ర సదస్సులో జైట్లీ ప్రసంగిస్తూ.. ప్రపంచంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ మరో 10 నుంచి 20 ఏండ్ల పాటు ముందుకు కొనసాగడం ఖాయమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ గత ఐదేండ్ల నుంచి భారత్ తన శక్తి ఏమిటో చాటుకుంటున్నది. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ సమస్యలను తనంతట తానుగా చక్కదిద్దుకుని వృద్ధి పథంలో వేగవంతంగా ముందుకు కొనసాగగలదని, ఇందుకోసం అవసరమైతే ఎంతటి కఠిన నిర్ణయాలైనా తీసుకోగలదని భారత్ నిరూపించుకున్నది' అని జైట్లీ స్పష్టం చేశారు. భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, ఆర్థిక నిర్ణయాలను రాజకీయ ఆమోదయోగ్యతతో ముందుకు తీసుకెళ్ల గల శక్తి భారత్‌కు ఉన్నదన్నారు.



సింగిల్ జీఎస్టీ రేటు సాధ్యం కాదు..

ప్రస్తుతానికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో ఒకే రేటు సాధ్యం కాదని ఆయన స్పష్టం చేస్తూ.. ముమ్మందు ప్రజలపై జీఎస్టీ భారాన్ని మరింత తగ్గిస్తామని చెప్పారు. వస్తు, సేవల పన్నును సరళతరం చేసి దానిని అన్ని వర్గాలకు అనువైనదిగా మార్చేందుకు జీఎస్టీ కౌన్సిల్ ఇప్పటికే పలుసార్లు ఆ పన్ను నిబంధనలను మార్చిన విషయాన్ని అరుణ్ జైట్లీ ఈ సందర్భంగా గుర్తు చేశారు.



2 లక్షల స్కూటర్లు!

భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న టీవీఎస్

రాష్ట్ర మార్కెట్లోకి సరికొత్త మోడల్ ఎంటార్క్

హైదరాబాద్, ఫిబ్రవరి 27: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా 2 లక్షల స్కూటర్లను విక్రయించాలనుకుంటున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) అనిరుధ్ హల్దార్ తెలిపారు. తెలుగు రాష్ర్టాలోకి టీవీఎస్ ఎంటార్క్ 125 సీసీ కలిగిన స్కూటర్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. లీటర్ పెట్రోల్‌కు 48 కిలోమీటర్ల మైలేజీ ఇచ్చే ఈ స్కూటర్ ధరను రూ.61,450గా నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేవలం తొమ్మిది సెకండ్లలో 90 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ స్కూటర్‌ను బ్లూటుత్ ద్వారా కనెక్ట్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు చెప్పారు. నావిగేషన్ సిస్టమ్ ద్వారా ఎక్కడికి ప్రయాణించాలో ముందస్తు సమాచారం ఇస్తే అక్కడికి దారిని చూపెట్టడం ఈ స్కూటర్ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. స్టైల్, పనితీరు, నూతన టెక్నాలజీని కోరుకుంటున్న యువతను దృష్టిలో పెట్టుకొని ఈ వాహనాన్ని రూపొందించినట్లు చెప్పారు. ప్రతియేటా 5.7 లక్షల స్కూటర్లు అమ్ముడవుతున్న దేశీయ మార్కెట్లో కంపెనీ 15.5 శాతం వాటా ఉందని, ఈ నూతన స్కూటర్‌తో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఈ నూతన స్కూటర్‌కు బుకింగ్‌లు ప్రారంభించినట్లు చెప్పిన ఆయన..మరింత సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు.



బ్రిటన్‌కు చెందిన లగ్జరీ బైకుల తయారీ సంస్థ ట్రయంఫ్ మోటార్‌సైకిల్.. దేశీయ మార్కెట్లోకి రూ.11.11 లక్షల విలువైన 'బోనవిల్లే స్పీడ్‌మాస్టర్' వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది

వైభవంగా అష్టోత్తరశతఘటాభిషేకం

యాదాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం అష్టోత్తర శతఘటాభిషేకాన్ని నిర్వహించారు. 108 కలశములలో పంచామృతాలు, పండ్ల రసాలు, పవిత్ర జలాలు ఉంచి ఆయా మంత్రములచే ఆయా దేవతలను ఆహ్వానించి ఆరాధించారు. పంచామృతములతో శ్రీస్వామి వారి మూలవరులకు అభిషేకం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విచ్చేసిన పారాయణీకులకు ఆలయ ఈవో గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి ఘనంగా సన్మానించారు. యాజ్ఞికులు సముద్రాల శ్రీనివాసాచార్యులు తదితరులను కూడా సత్కరించారు. శ్రీవారి బాలాలయంలో మంగళవారం రాత్రి శ్రీలక్ష్మీ నరసింహుడి శృంగార డోలోత్సవము కన్నుల పండువగా కొనసాగింది.


యాదాద్రిలో శ్రీవారికి అభిషేకం చేయడానికి ప్రధాన కలశాన్ని తీసుకెళ్తున్న అర్చకబృందం

కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ధర్మపురి టౌన్: జగిత్యాల జిల్లా ధర్మపురిలో లక్ష్మీ నృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం యోగ, ఉగ్ర లక్ష్మీనృసింహస్వామి, వెంకటేశ్వర స్వామివారల కల్యాణ మహోత్సవం కనుల పండువలా నిర్వహించారు. ముగ్గురుమూర్తులను ప్రధాన ఆలయాల నుంచి ప్రత్యేక పల్లకిపై వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలు, బాజాభజంత్రీలతో దేవస్థాన ప్రాంగణంలో అందంగా అలంకరించిన శేషప్ప కళా వేదికపైకి తీసుకొచ్చి ఆసీనులను చేశారు. అశేష భక్త జనం గోవిందనామ స్మరణ చేస్తూ తిలకిస్తుండంగా, వేద బ్రాహ్మణులు రమేశ్ శర్మ, వంశీశర్మ, దిలీప్‌శర్మ, నటరాజ్‌శర్మ మంత్రాలు, మంగళాష్టకాలు చదువుతుండగా పురోహితులు పురుషోత్తమాచారి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస చారి, మూర్తి, నేరెళ్ల శ్రీనివాసాచారి స్వామివారల కల్యాణోత్సవాన్ని నయనానందకరంగా జరిపారు. స్వామివారికి వెంగలాపూర్, చిల్వకోడూర్, రాజారం తదితర గ్రామాల నుంచి భక్తులు తలంబ్రాలు తీసుకొచ్చారు. బాచంపెల్లి సంతోష్‌శాస్త్రి వాఖ్యానం చేశారు. దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ దంపతులు, జగిత్యాల కలెక్టర్ శరత్ పట్టు వస్త్రాలు సమర్పించారు.


జగిత్యాల జిల్లా ధర్మపురిలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

భగవంతుడు సర్వాంతర్యామి : చినజీయర్ స్వామి

భగవంతుడు సర్వాంతర్యామి అని.. భక్తులు ఎలా ఆయనను కొలిస్తే అదేరూపంలో దర్శనమిస్తాడని త్రిదండి చిన జీయర్‌స్వామి పేర్కొన్నారు. లక్ష్మీనృసింహుడికల్యాణోత్సవంలో పాల్గొన్న ఆయన మంగళవారం రాత్రి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ధర్మపురి గొప్ప క్షేత్రమనీ, ఇక్కడ నృసింహుడిని దర్శించి కల్యాణోత్సవం కనులారా చూడడం తన పూర్వజన్మ సుకృతమన్నారు.

భవిష్యత్తుకు ప్రాజెక్టులే మెట్లు

తెలంగాణకు కాళేశ్వరం వరప్రదాయిని ● అన్ని ప్రాజెక్టులు, చెరువులకు కొత్త జీవం: నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత

ఎమ్మెల్యేలు, రైతులతో కలిసి మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పనుల పరిశీలన

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/మంథని, నమస్తే తెలంగాణ/మంథని రూరల్: భావితరాల భవిష్యత్తుకు సాగునీటి ప్రాజెక్టులే మెట్లు అవుతాయని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయినిగా ఆమె అభివర్ణించారు. ఎంపీ కవిత నేతృత్వంలో మంగళవారం నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని బాల్కొండ ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, టీఆర్‌ఎస్ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ సంజయ్‌కుమార్, వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్లు, మండల రైతు సమన్వయ సమితుల సభ్యులతో కలిసి భూపాలపల్లి జిల్లా పరిధిలోని మేడిగడ్డ బరాజ్, పెద్దపల్లి జిల్లా పరిధిలోని సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపుహౌస్‌ను సందర్శించి పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆర్టీసీ బస్సులు, కార్లలో దాదాపు 500 మంది వీటిని సందర్శించారు. వీరి వెంట మంథని ఎమ్మెల్యే పుట్ట మధు కూడా ఉన్నారు. మేడిగడ్డ వద్ద మహదేవ్‌పూర్, కాటారం, మహాముత్తారం తదితర మండలాల జెడ్పీటీసీలు హసీనాభాను, చల్ల నారాయణరెడ్డి, రాజిరెడ్డి, కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, మహదేవ్‌పూర్ ఎంపీపీ వసంతతో పాటు స్థానిక సర్పంచ్‌లు నిజామాబాద్ ఎంపీ కవిత బృందానికి ఘనస్వాగతం పలికారు.


భూపాలపల్లి జిల్లాలో మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న నిజామాబాద్ ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు, రైతులు

ఈ సందర్భంగా బృందం సభ్యులు ఇంజినీర్లతో మాట్లాడి ప్రాజెక్టు వివరాలు తెలుసుకున్నారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఎంపీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. కేవలం మూడేండ్లలో కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం నిరూపిస్తున్నదన్నారు. రూ.80వేల కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటికే మూడేండ్లలో రూ.20 కోట్లపైచిలుకు ఖర్చు చేశామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలోని 18లక్షలకు పైగా ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించుకోబోతున్నామన్నారు. తాగునీటి అవసరాల కోసం ఈ ప్రాజెక్టు ద్వారా 36 టీఎంసీల నీరు నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇది హైదరాబాద్ మహానగరం సహా తెలంగాణ ప్రజలకు 2050వ సంవత్సరం వరకు తాగునీటి సరఫరాకు సరిపోనున్నదని ఎంపీ కవిత పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా తరఫున సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే పుట్ట మధు ప్రాజెక్టు నిర్మాణం కోసం సైనికుడిలా పనిచేస్తున్నారని ప్రశంసించారు.


ఎంపీ కవిత నేతృత్వంలోని బృందానికి పనుల వివరాలను వివరిస్తున్న ఇంజినీర్


భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పల్లెలకు బైక్‌పై వెళ్తున్న స్పీకర్

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా

స్పీకర్ మధుసూదనాచారి

టేకుమట్ల/భూపాలపల్లిటౌన్: భూపాలపల్లి నియోజకవర్గంలోని పల్లెపల్లెనా తిరిగి సమస్యలను పరిష్కరిస్తానని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లిలోని భీంపల్లి రాజేందర్ ఇంట్లో పల్లెప్రగతి నిద్ర చేశారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామస్థులతో కలిసి చలిమంట కాచుకున్నారు. గర్మిళ్లపల్లి శివారు పల్లెలైన కొత్తపల్లి, బోయినపల్లి, కలికోటపల్లి బైక్‌పై వెళ్లారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలికోటపల్లికి 25 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. 50 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు శంకుస్థాపన చేశారు. భూపాలపల్లిలోని కూరగాయల మార్కెట్‌లో అగ్నిప్రమాదంతో కాలిపోయిన దుకాణాలను పరిశీలించి, బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


జనగామ జిల్లా రాజవరంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

నెలరోజుల్లో 'మల్కాపూర్'కు టెండర్లు

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడి

చిలుపూరు: ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీడుభూములను సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన మల్కాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి నెల రోజుల్లో టెండర్లు పిలువనున్నట్టు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జనగామ జిల్లా చిలుపూరు మండలం రాజవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవరాల్లో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ మల్కాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతించినట్టు చెప్పారు. 10.78 టీఎంసీల సామర్థ్యంతో రూ.3250 కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయర్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి 90 రోజులపాటు నేరుగా మల్కాపూర్ రిజర్వాయర్‌కు నీటిని లిఫ్ట్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.


నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం లోతుకుంటలో మిషన్ కాకతీయ నాల్గో విడుత పనులు ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

ఉనికి కోసమే కాంగ్రెస్ బస్సు యాత్ర

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

కల్వకుర్తి, నమస్తే తెలంగాణ/జడ్చర్ల నమస్తే తెలంగాణ: ఉనికిని కాపాడుకోవడానికే కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్ర చేపడుతున్నారని వైద్యఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లిలో మిషన్ కాకతీయ నాల్గో విడుతలో రూ.22 లక్షల వ్యయంతో చేపట్టనున్న లోతుకుంట పనులను, జకినాలపల్లి-ఇప్పపహాడ్ మధ్య రూ.1.45 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెనను మంత్రి ప్రారంభించారు. జకినాలపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. 70లక్షల మంది రైతులకు వ్యక్తిగత బీమా కల్పిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదని పేర్కొన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకే కాంగ్రెస్ నాయకులు బస్సుయాత్ర చేపడుతున్నారని మండిపడ్డారు.


హత్తీఘాట్ పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

చనాక-కొరాట ప్రాజెక్టు నిర్మాణ పనులపై సమీక్ష

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: చనాక-కొరాట ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా జైనథ్ మండలం హత్తీఘాట్ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకుంటామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు హెచ్చరించారు. మంగళవారం సీఎం కేసీఆర్ చనాక కొరాట ప్రాజెక్టు పనులను పరిశీలించిన వెళ్లిన తరువాత మంత్రి హరీశ్‌రావు పంప్‌హౌస్ పనులను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. ఏజెన్సీ నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి మూడు నెలల్లో పంప్‌హౌస్ పనులను పూర్తి చేయాలని సూచించారు. నిధులను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నా పనుల్లో జాప్యం జరుగుతున్నదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణానికి అవసరమైన యంత్రాలను ఎక్కువగా సమకూర్చుకోవాలని, కూలీల సంఖ్యను సైతం పెంచాలని సూచించారు. పంప్‌హౌస్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులను ఆయన అభినందించారు. సమావేశంలో ఎస్‌ఈ అంజద్ హుస్సేన్, డీఈలు తులసీరాం, గణేశ్ పాల్గొన్నారు.

గులాబీ పార్టీలో భారీగా చేరికలు


నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో మంత్రి జూపల్లి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు


వనపర్తి జిల్లా పెబ్బేరులో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన నవ దంపతులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అధికార టీఆర్‌ఎస్‌లోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు మంగళవారం పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం పసుపుల జనుంపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. అమ్రాబాద్ మండలం ఈగలపెంట గ్రామంలోని 60 మంది మత్స్యకారులు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో పార్టీలో చేరారు.

వనపర్తి జిల్లా పెబ్బేరులో నాలుగు రోజుల కిందట పెండ్లి చేసుకున్న నూతన జంట రుషికుమార్, పూజిత రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గోసాన్‌పల్లిలో దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో కొమురవెల్లి మండల కేంద్రంలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరారు.

రైతన్నల సంబురాలు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సీఎం కేసీఆర్ రూ.5లక్షల ప్రమాద బీమా ప్రకటించడంతో రైతులు సంబురాలు జరుపుకొన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. సీఎంతోపాటు మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు కూడా క్షీరాభిషేకాలు నిర్వహించారు. రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్‌ను దీవించాలని కోరుతూ పలుచోట్ల ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతులకు నిరంతర విద్యుత్‌తోపాటు సాగు పెట్టుబడులు ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంతోపాటు, చొప్పదండి మండలంలోని మంగళపల్లిలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేటలో, వరంగల్ రూరల్ జిల్లా పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో, కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాల వ్యాప్తంగా రైతులు సంబురాలు జరుపుకొన్నారు.


కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతు సమన్వయ సమితి సభ్యులు, టీఆర్‌ఎస్ నాయకులు


పెద్దపల్లి జిల్లా సుందిళ్ల బ్యారేజీ పనులను కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధిరాజుకు వివరిస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

మా ప్రాజెక్టులు దేశానికే ఆదర్శం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

తెలంగాణలో అభివృద్ధి బాగుంది: కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధిరాజు

మంథని, నమస్తే తెలంగాణ/మంథని రూరల్: తెలంగాణ ప్రజల ఆకలి, దప్పులు తీర్చేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న నీటి పథకాలు దేశానికే ఆదర్శమని, గోదావరి నదిపై ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ జీవనాడి అని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురంలో నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ పనులను కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ ఎం సిద్ధిరాజు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు జర్నలిస్టులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. గోదావరి నదిపై నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌లు, అండర్ టన్నెళ్లు చారిత్రాత్మకమైనవన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు భేష్: కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధిరాజు

తెలంగాణ రాష్ట్రం అనతి కాలంలోనే బాగా అభివృద్ధి జరిగిందని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ ఎం సిద్ధిరాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అనుసరణీయమన్నారు. రూ.1కిలో బియ్యం పథకం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉచిత రవాణా, వ్యవసాయ పథకాలు బాగున్నాయని కితాబిచ్చారు. కర్ణాటక సైతం కృష్ణా బేసిన్‌పై ఆధారపడి ఉన్నదని.. ఈ నీటిని సద్వినియోగం చేసుకొనేందుకు ఏటా తమ ప్రభుత్వం రూ.6వేల కోట్లను కేటాయిస్తున్నదని చెప్పారు. తెలంగాణలో గోదావరి నదిపై నిర్మిస్తున్న కాళేశ్వరం తరహా ప్రాజెక్టును తమ రాష్ట్రంలో నిర్మించేందుకు అవకాశం ఉందో లేదో పరిశీలిస్తున్నట్టు తెలిపారు. తమ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆర్థికమంత్రి సైతం ఈ విషయంలో ప్రత్యేక చొరవతో ఉన్నారని పేర్కొన్నారు. వీరి వెంట జర్నలిస్టు నాయకులు పల్లె రవి తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

వనపర్తి, నమస్తే తెలంగాణ: వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం రాయికోడ్ గ్రామానికి చెందిన నవీన్(17) వనపర్తిలోని ఓ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటూ ఫస్టియర్ చదువుతున్నాడు. నవీన్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో అతని తండ్రి బాలకృష్ణ మంగళవారం ఉదయం వనపర్తికి వచ్చి దవాఖానకు తీసుకెళ్లాడు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో హాస్టల్‌లోని బాత్రూమ్ పైప్ లైన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు వెంటనే పోలీసులకు సమాచామిచ్చారు. మృతదేహాన్ని దవాఖానకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన అమ్మాయితో పెండ్లి చేయండి

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు.. రెండు గంటలపాటు ఉద్రిక్తత

సిర్పూర్(యూ): తాను ప్రేమించిన అమ్మాయితో పెండ్లి చేయాలంటూ ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కడంతో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ) లో ఉద్రిక్తత నెలకొన్నది. తాను ఓ అమ్మాయిని ప్రేమించాననీ, ఆమె కూడా తనను ప్రేమిస్తున్నదని వెంటనే పెండ్లి జరిపించాలని సిర్పూర్(యూ)కు చెందిన షేక్ షారూక్ మంగళవారం ఓ సెల్ టవర్ ఎక్కాడు. సమాచారమందుకున్న సీఐ సాదిక్‌పాషా, ఎస్సై గౌతం టవర్ వద్దకు చేరుకొని అమ్మాయి, అబ్బాయి తండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలను అక్కడికి పిలిపించి ఇరువర్గాలతో మాట్లాడి పెండ్లికి ఒప్పించడంతో దిగివచ్చాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జల సవ్వడులు

సూర్యాపేట జిల్లాలో శరవేగంగా మిషన్ భగీరథ పనులు

90 శాతం పనులు పూర్తి.. 379 పల్లెలకు ట్రయల్ రన్

నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 66 గ్రామాలకు చేరనున్న నీరు

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పనులు సూర్యాపేట జిల్లాలో అత్యంత వేగంగా సాగుతున్నాయి. రూ.1485 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు 90 శాతం పూర్తి కాగా మిగిలి పనులు మార్చి 10 నాటికి పూర్తిచేయనున్నారు. అందుకనుగుణంగా గ్రామాల్లో ఇంట్రా విలేజ్ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలోని 379 పల్లెలకు నీటిని అందించేందుకు వీలుగా ట్రయల్‌రన్ పూర్తిచేశారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తరుచూ అధికారులతో సమీక్షలు చేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం చిల్పకుంట్ల వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి 66 పల్లెలకు నీటిని విడుదల చేయనున్నారు.

సూర్యాపేట జిల్లాకు ఓ పక్క కృష్ణా, మరో పక్క గోదావరి నదులు ప్రవహిస్తున్నాయి. వాటి ద్వారా గడపగడపకూ నీటిని అందించేలా పథకాలు రూపొందించగా యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ నుంచి సూర్యాపేట వరకు నీటిని సరఫరా చేసే పనులు 90శాతం పూర్తయ్యాయి. టెయిల్‌పాండ్ వద్ద 1040 హెచ్‌పీ మోటర్లు మూడింటిని బిగించి నేరుగా అవంతీపురం వరకు రోజుకు 185 ఎంఎల్‌డీల నీటిని తరలిస్తారు. వీటిలో 90 ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేసి 1100 హెచ్‌పీ మోటర్‌తో సమీపంలోని కాలువపల్లి గుట్టపైకి పంపించి నల్లగొండ జిల్లా మిర్యాలగూడతోపాటు హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు ఇంటింటికీ తాగునీటిని అందిస్తారు. మిగిలిన నీటిని అవంతీపురం నుంచి 1250 హెచ్‌పీ మోటర్లతో సూర్యాపేట మండలం ఇమాంపేటలోని సంప్‌లోకి పంపిస్తారు. ఇమాంపేట ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నీటిని శుద్ధిచేసిన అనంతరం 900 హెచ్‌పీ మోటర్లతో పక్కనే ఉన్న ఉండ్రుగొండ గుట్టపైకి నీటిని ఎక్కించి 65వ నంబర్ జాతీయ రహదారికి దక్షిణం పక్కన ఉన్న సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని ప్రతి ఇంటికీ నీటిని గ్రావిటీ ద్వారా అందిస్తారు. మిగిలిన పది శాతం పనులు మార్చి 10 నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

చిల్పకుంట్లలో ఫిల్టర్ బెడ్‌కు వెళ్తున్న నీరు


నేడు సూర్యాపేటలో మంత్రి కేటీఆర్ పర్యటన

రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి బుధవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంతోపాటు తుంగతుర్తి నియోజకవర్గంలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో మంత్రుల పర్యటన సాగనున్నది. నల్లగొండ, భువనగిరి ఎంపీలు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ పర్యటనలో పాల్గొననున్నారు. సాయంత్రం 5.25 గంటలకు మద్దిరాల క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించనున్నారు.

నమస్తే తెలంగాణ

ఆట

[హైదరాబాద్]

బుధవారం 28 ఫిబ్రవరి 2018



ఇంటర్ యూనివర్సిటీ టీటీ విజేత ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఆల్ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం జట్టు విజేతగా నిలిచింది. అసోం రాజధాని గువాహటిలో జరుగుతున్న చాంపియన్‌షిప్‌లో ఓయూ జట్టు అపజయమెరుగకుండా బంగారు పతకం అందుకుంది. జట్టులోని సభ్యులందరికీ స్వర్ణ పతకాలతోపాటు ఓవరాల్ ట్రోఫీని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ద్యుతీచంద్ 'పసిడి' పరుగు

పటియాల: భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీచంద్ మళ్లీ మెరిసింది. సీజన్ తొలి టోర్నీ ఇండియన్ గ్రాండ్‌ప్రీ మహిళల 100మీ రేసును 11.57 సెకన్లలో ముగించి పసిడి పతకం ఒడిసిపట్టుకుంది. హిమదాస్(11.74 సె), రజీనా ప్రకాశ్(11.76సె) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు పురుషుల 100మీటర్ల రేసులో రాష్ర్టానికి చెందిన సుధాకర్ యాదవ్(10.71 సె) కాంస్య పతకంతో ఆకట్టుకున్నాడు. ఇదే పోటీలో విద్యాసాగర్(10.65సె), అనురూప్ జాన్(10.70సె) స్వర్ణ, రజత పతకాలు దక్కించుకున్నారు. జావెలిన్ త్రో విభాగంలో నీరజ్ చోప్రా 82.88 మీటర్ల దూరం విసిరి స్వర్ణ పతకంతో సత్తాచాటాడు. ఇదే పోటీలో



విపిన్ కసాన(80.04మీ) రజతం దక్కించుకోగా, అమిత్‌కుమార్(77.33మీ) కాంస్య పతకం సాధించాడు. దాదాపు మూడు నెలల తర్వాత బరిలోకి దిగిన నీరజ్..ప్రత్యర్థులను అలవోకగా అధిగమిస్తూ టాప్‌లో నిలిచాడు.

మిథాలీకే పగ్గాలు

- ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం భారత మహిళల జట్టును మంగళవారం ప్రకటించారు. 15 మందితో కూడిన జట్టుకు హైదరాబాద్ అమ్మాయి మిథాలీ రాజ్ నాయకత్వం వహించనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్ వచ్చే నెల 12 నుంచి 18 వరకు వడోదరలో జరుగనుంది. ఇది ముగిసిన వెంటనే ముక్కోణపు టీ20 సిరీస్ కూడా జరుగుతుంది. దీనికి కూడా ఇదే జట్టును కొనసాగిస్తామని బీసీసీఐ పేర్కొంది.

జట్టు వివరాలు: మిథాలీ రాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్, స్మృతి మందన, పూనమ్ రౌత్, జెమీమా రొడ్రిగ్వేజ్, వేదా, మోనా, సుష్మ, ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్, రాజేశ్వరి, శిఖా పాండే. సుకన్య, పూజా, దీప్తి శర్మ.

రాజస్థాన్ బౌలింగ్ కోచ్‌గా బహుతులే



ముంబై: రాజస్థాన్ రాయల్స్ జట్టు తమ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులేను నియమించుకుంది. స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో రెండేండ్ల నిషేధం అనంతరం ఈ సీజన్‌లో బరిలోకి దిగుతున్న రాజస్థాన్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నది. ఇప్పటికే జట్టు మెంటార్‌గా దిగ్గజ స్పిన్నర్ షేన్‌వార్న్, కెప్టెన్‌గా స్టీవ్‌స్మిత్‌ను ఎంపిక చేసుకుంది. స్పిన్ కోచ్ నియామకంపై స్పందిస్తూ 'రాజస్థాన్ జట్టు కోచింగ్ బృందంలో సభ్యున్ని కావడం సంతోషంగా ఉంది. మెంటార్ షేన్‌వార్న్‌తో కలిసి పనిచేసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నాను. నాకున్న పరిజ్ఞానాన్ని ఆటగాళ్లతో పంచుకునే ప్రయత్నం చేస్తా' అని సాయిరాజ్ అన్నాడు. భారత్ తరఫున రెండు టెస్ట్ మ్యాచ్‌లు, ఎనిమిది వన్డేలు ఆడిన సాయిరాజ్‌కు ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో అద్భుతమైన రికార్డు ఉన్నది. ముంబై జట్టుకు 188 మ్యాచ్‌లాడిన ఈ ఆఫ్‌స్పిన్నర్ 26 సగటుతో 630 వికెట్లు పడగొట్టాడు.

మయాంక్ మెరుపులు

కర్ణాటకదే విజయ్ హజారే ట్రోఫీ ■ ఫైనల్లో సౌరాష్ట్రపై 41 పరుగుల తేడాతో గెలుపు ■ పుజార శ్రమ వృథా



మయాంక్ (90)

న్యూఢిల్లీ:

మయాంక్ అగర్వాల్ (79 బంతుల్లో 90; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులకు తోడు.. బౌలర్ల స్ఫూర్తిదాయక పోరాటంతో కర్ణాటక జట్టు విజయ హజారే ట్రోఫీని కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో కర్ణాటక 41 పరుగుల తేడాతో సౌరాష్ట్రపై గెలిచింది. టాస్ గెలిచి సౌరాష్ట్ర ఫీల్డింగ్ ఎంచుకోవడంతో.. బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక 45.5 ఓవర్లలో 253 పరుగులు చేసింది. 17 బంతుల తేడాలో కెప్టెన్ కరుణ్ నాయర్ (0), లోకేశ్ రాహుల్ (0) వికెట్లు పడటంతో కర్ణాటక పీకల్లోతు కష్టాల్లో పడింది. అప్పటికి జట్టు స్కోరు 5/2. ఈ దశలో మయాంక్, రవి కుమార్ సమర్థ్ (65 బంతుల్లో 48; 1 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 21.5 ఓవర్లలో 136 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను కుదుట పర్చారు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన మయాంక్.. లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర జడేజా బౌలింగ్‌లో లాంగాఫ్, ఎక్స్‌ట్రా కవర్స్‌లో కొట్టిన సిక్సర్లు మ్యాచ్‌కే హైలెట్. అయితే అదే జోరులో మయాంక్‌ను 25వ ఓవర్‌లో బోల్తా కొట్టించి సెంచరీ కాకుండా అడ్డుపడి ప్రతీకారం తీర్చుకున్నాడు. కానీ ఏడు బంతుల తర్వాత సమర్థ్ కూడా ఔటయ్యాడు. స్టువర్ట్ బిన్నీ (5) విఫలమైనా.. దేశ్‌పాండే (60 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్), గోపాల్ (31) ఆరో వికెట్‌కు 41 పరుగులు జత చేశారు. లోయర్ ఆర్డర్‌లో చిన్న భాగస్వామ్యాలు నమోదుకావడంతో కర్ణాటక సవాలు విసిరే స్కోరును సాధించింది.

లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర 46.3 ఓవర్లలో 212 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ చతేశ్వర్ పుజార (127 బంతుల్లో 94; 10 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరిపోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. కర్ణాటక బౌలర్లు ప్రసిద్ కృష్ణ (3/37), గౌతమ్ (3/27)లు ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను శాసించారు. బరోత్ (30), పుజార మూడో వికెట్‌కు 62 పరుగులు జత చేశారు. రవీంద్ర జడేజా (15) వైఫల్యం జట్టుపై తీవ్ర ప్రభావం చూపింది. జానీ (22), మక్వానా (20) ఓ మాదిరిగా ఆడినా.. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పడంలో విఫలమయ్యారు. మయాంక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.





అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఎల్బీ ఇండోర్ స్టేడియంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న టీఎన్‌జీవో అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షులు రేచల్, రాజేందర్ తదితరులు

మాథ్యూస్ ఔట్



కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్ మొదలుకాకముందే శ్రీలంకకు ఎదురుదెబ్బ తగిలింది. కాలిపిక్క గాయం కారణంగా కెప్టెన్ మాథ్యూస్ ఈ టోర్నీకి దూరమయ్యాడు. దీంతో దినేశ్ చండిమల్ లంక జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. మార్చి 6 నుంచి జరిగే ఈ టోర్నీలో భారత్, లంకతోపాటు బంగ్లాదేశ్ బరిలోకి దిగుతున్నది. బంగ్లాదేశ్‌తో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో గాయపడిన మాథ్యూస్ ఇంతవరకు కోలుకోలేదు. ఈ టోర్నీ కోసం 15 మందితో కూడిన జట్టును బుధవారం ప్రకటిస్తారు.

భారత్-ఎ కెప్టెన్‌గా అశ్విన్



న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా వన్డే జట్టులో స్థానం కోసం ఎదురుచూస్తున్న స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడే అవకాశం దక్కింది. మార్చి 4 నుంచి 8 వరకు ధర్మశాలలో జరుగనున్న దేవధర్ ట్రోఫీలో పాల్గొనే భారత ఏ జట్టుకు కెప్టెన్‌గా అశ్విన్ నియమితుడయ్యాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో వన్డే జట్టులో స్థానం దక్కించుకోవాలంటే ఈ టోర్నీలో అశ్విన్ సత్తా చాటాల్సిందే. భారత్ ఏ జట్టులోఅశ్విన్‌తో పాటు జట్టులో మహ్మద్ షమీ, అండర్-19 కెప్టెన్ పృథ్వీషా, శుభ్‌మన్ గిల్, కృనాల్ పాండ్య వంటి కీలక ఆటగాళ్లున్నారు. భారత్-బి జట్టుకు శ్రేయాస్ అయ్యర్, రెస్టాఫ్ ఇండియా జట్టుకు కరుణ్ నాయర్ కెప్టెన్లుగా ఎంపికయ్యారు.

నియంతృత్వం చెల్లదు సుమీ!

- చైనాలో జిన్‌పింగ్ శాశ్వత అధినాయకత్వం ప్రతిపాదనపై పెను దుమారం
- సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న నిరసనలు



బీజింగ్, ఫిబ్రవరి 27: ప్రతిపక్షమంటూ లేని చైనాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాగళాలు విచ్చుకుంటున్నాయి. ప్రస్తుత చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను జీవితకాలంపాటు అధ్యక్షుడిగా కొనసాగించాలనే ప్రతిపాదనపై దేశంలో దుమారం రేగుతున్నది. ఈ ప్రతిపాదనపై ప్రజల్లో అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతున్నది. తాజాగా ఓ ప్రముఖ రాజకీయ విశ్లేషకురాలు, వ్యాపారవేత్త జిన్‌పింగ్‌ను శాశ్వత అధ్యక్షుడిగా చేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించాలని చట్టసభల సభ్యులకు లేఖలు రాశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల పదవీకాలంపై ఉన్న పరిమితి నిబంధనలను తొలిగించేందుకు అధికార కమ్యూనిస్టు పార్టీ ఆదివారం ఓ ప్రతిపాదనను విడుదల చేసింది. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పలువురు వ్యక్తపరిచిన అభిప్రాయాలు చైనాలో ప్రజాదరణ పొందిన సామాజిక మాధ్యమ యాప్ 'వీచాట్'లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే చైనా యూత్ దినపత్రిక మాజీ ఎడిటర్ లీ డాటాంగ్ సోమవారం 'చైనా రబ్బర్‌స్టాంప్ పార్లమెంట్ సభ్యులకు' అని పేర్కొంటూ వీచాట్ యాప్‌లో ఓ లేఖ రాశారు. పదవీకాలంపై ఉన్న పరిమితులను తొలిగించడం అంటే గందరగోళపు విత్తనాలు చల్లినట్లేనని పేర్కొన్నారు. ఒక దేశ అధ్యక్ష పదవిపై పరిమితులు గనుక లేకపోతే.. అది రాచరికానికి దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు. 'మేం మావో తరాన్ని చూశాం. ఆ కాలం ముగిసింది. మళ్లీ ఆ కాలానికి ఎలా వెళ్లగం'? అని మహిళా వ్యాపారవేత్త వాంగ్ యింగ్ పేర్కొన్నారు. కాగా ఈ బహిరంగ లేఖల గురించి తమకు తెలియదని సమాచారశాఖకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. జిన్‌పింగ్ పదవీకాలంపై పరిమితులు తొలిగించాలంటే వచ్చే నెలలో సమావేశం కానున్న చైనా కాంగ్రెస్.. రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది.

అద్భుతమైనవాడు.. అందమైనవాడు!

- మోదీపై ట్రంప్ వ్యంగ్య వ్యాఖ్యలు
- హార్లే మోటర్‌సైకిళ్లపై 50% పన్ను తగ్గింపుతో ఎటువంటి లాభం లేదు
- 'ఫ్లోరిడా' వంటి ఘటనల నివారణకు టీచర్లకు ఆయుధాలు
- గవర్నర్ల సమావేశంలో అమెరికా అధ్యక్షుడు



గవర్నర్ల సమావేశంలో మాట్లాడుతున్న ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 27: ప్రధాని నరేంద్రమోదీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'అద్భుతమైనవాడు.. అందమైనవాడు' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. వైట్‌హౌస్‌లో మంగళవారం జరిగిన గవర్నర్ల సమావేశంలో ట్రంప్ మరోసారి హార్లే డేవిడ్‌సన్ మోటర్‌సైకిళ్ల అంశాన్ని లేవనెత్తారు. ఆ మోటర్‌సైకిళ్లపై భారత్ కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడం వల్ల తమకు కలుగుతున్న లాభమేదీ లేదని చెప్పారు. ఉభయ దేశాల మధ్య వాణిజ్యం సరళమైనదిగా, పరస్పర ప్రయోజనకారిగా ఉండాలన్నారు. అమెరికా నుండి ఒక మోటర్‌సైకిల్ భారత్‌కు వెళితే వంద శాతం పన్ను చెల్లించాల్సి వస్తున్నదని చెప్పారు. ఇటీవల ప్రధాని మోదీ తనకు ఫోన్‌చేసి 50 శాతం పన్ను తగ్గిస్తున్నట్టు చెప్పారని తెలిపారు. మోదీతో జరిగిన సంభాషణను ఆయన వివరిస్తూ 'ప్రధాన మంత్రి, చాలా అద్భుతమైనవాడనుకుంటా.. నాకు ఫోన్ చేశారు. 50 శాతం తగ్గిస్తున్నానని చెప్పారు. నేను ఓకే అన్నాను. కానీ ఇంతవరకు మనకు దక్కిందేమీ లేదు. కానీ ఆయన మాత్రం 50 శాతం లాభం పొందుతున్నారు. వారు మనకేదో ఉపకారం చేస్తున్నామనుకుంటున్నారు. కానీ అది ఉపకారం కాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'నాకు నమ్మకం కుదరలేదు – ఆయన చాలా అందంగా చెప్పాడు.. ఆయన అందమైనవాడు.. మేము 75 శాతానికి తగ్గిద్దామనుకున్నాము.. కానీ 50 శాతానికి తగ్గించాము అని చెప్పాడు. నేను ఓహ్! అన్నాను.. అంతకన్నా ఏం చెప్పగలను?.. నేను పులకరించిపోయాననుకుంటున్నారా? అలా చేయటం మనకు మంచిది కాదు. ఇటువంటి ఒప్పందాలు ఇంకా చాలా ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌కు చెందిన మోటర్‌సైకిళ్లు అమెరికాలో అమ్ముడు పోవడం వల్ల కూడా తమకు ఎటువంటి లాభం చేకూరడం లేదని చెప్పారు.

హంతకుడిని ఆయుధం లేకుండా ఎదుర్కొనేవాడిని

ఫ్లోరిడా పాఠశాలలో కాల్పులకు తెగబడిన హంతకుడి నుంచి విద్యార్థులను కాపాడేందుకు తానైతే ఆయుధం లేకుండా వట్టి చేతులతో వెళ్లేవాడినని ట్రంప్ చెప్పారు. ఆ రోజు పాఠశాల వద్ద భద్రతా విధులలో ఉన్న డిప్యూటీ షరీఫ్ (పోలీస్ అధికారి) ఆయుధం ఉన్నప్పటికీ అచేతనంగా ఉండిపోయాడని విమర్శించారు. ఆ అధికారి తీరు అవమానకరంగా ఉందన్నారు. ఈ నెలారంభంలో ఆ స్కూల్‌కు చెందిన మాజీ విద్యార్థి విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడి 17మందిని పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. సెమి ఆటోమేటిక్ రైఫిళ్ల కొనుగోలుకు వయో పరిమితి పెంపు, తనిఖీల వ్యవస్థను పటిష్ఠం చేయటం, టీచర్లకు ఆయుధాలు అందించే ప్రతిపాదనలకు ట్రంప్ మద్దతు తెలిపారు.

సానుకూల వాతావరణంలోనే ఉత్తరకొరియాతో చర్చలు

ఉత్తరకొరియాతో సానుకూల వాతావరణం ఏర్పడితేనే ఆ దేశంతో చర్చలకు ముందుకు వస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలు జరిపేందుకు దక్షిణ కొరియా ద్వారా ఉత్తర కొరియా పంపిన సందేశంపై ట్రంప్ స్పందించారు. అమెరికాతో చర్చలు జరుపడం వెనుక ఉత్తరకొరియాకు అనేక ఉద్దేశాలు ఉన్నాయని అన్నారు.

ప్రధాని విదేశీ ప్రయాణాల ఖర్చు వెల్లడించాలి

- విదేశాంగ శాఖకు సమాచార కమిషన్ ఆదేశం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి విదేశీ పర్యటనల సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలకైన ఖర్చు వివరాలను వెల్లడించాలని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) విదేశాంగ మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ప్రధాని విదేశీ పర్యటనలకు సంబంధించిన వివరాలు వేర్వేరు రికార్డులు, ఫైళ్లలో ఉన్నాయని, వాటన్నింటినీ వెతకాలంటే కొంతమంది అధికారులను కేటాయించాల్సి ఉంటుందని మంత్రిత్వ శాఖ చేసిన వాదనను సీఐసీ తోసిపుచ్చారు. 2013-14 నుంచి 2016-17 మధ్య ప్రధాని విదేశీ పర్యటనలకు సంబంధించిన ఖర్చుల వివరాలను మాజీ సైన్యాధికారి లోకేశ్ బాత్రా కోరారు. సమాచార హక్కు చట్టం కింద తాను చేసిన దరఖాస్తుకు సదరు మంత్రిత్వ శాఖ అందించిన వివరాలు అసమగ్రంగా ఉన్నాయని బాత్రా సీఐసీకి తెలిపారు. ఆ బిల్లులు ఎవరి వద్ద ఉన్నాయి, ఇంకా చెల్లించవలసిన బిల్లులు ఎన్నో సామాన్య ప్రజలకు తెలియాల్సి ఉందని అన్నారు. ఎయిర్ ఇండియా ఇప్పటికే నష్టాల్లో ఉందని, దానికి చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుందని, అదంతా ప్రజల సొమ్మేనని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న సీఐసీ ఆర్కే మాథుర్ దరఖాస్తుదారుడు కోరిన వివరాలను ఇవ్వాల్సిందేనని ఆదేశించారు.

సిద్దరామయ్యది డబ్బులకు పనిచేసే సర్కార్



సభలో రైతులిచ్చిన ధాన్యాన్ని సంచిలో పోసుకుంటున్న ప్రధాని మోదీ

- కర్ణాటక ప్రభుత్వంపై మోదీ విమర్శలు

దావనగె, ఫిబ్రవరి 27: కర్ణాటకలోని సీఎం సిద్దరామయ్య ప్రభుత్వం డబ్బులిస్తేనే పనిచేస్తుందని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఒక్క నిమిషం కూడా కొనసాగనివ్వరాదని చెప్పారు. దావనగెరెలో మంగళవారం జరిగిన రైతు సభలో ఆయన మాట్లాడుతూ, సిద్దరామయ్య ప్రభుత్వం పోవడం ఖాయమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యెడ్యూరప్ప 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సభను ఏర్పాటు చేశారు. కర్ణాటకలో ఏ పని జరుగాలన్నా ధర చెల్లించాల్సి వస్తున్నదని మోదీ విమర్శించారు. డబ్బుకు పనిచేసే ప్రభుత్వం వల్ల సామాన్యులకు న్యాయం జరుగుతుందా అని ఆయన సభికులను ప్రశ్నించారు. కర్ణాటకలో నిజాయితీగల ప్రభుత్వం రావాలని అన్నారు. కాంగ్రెస్ నేతల పాపాల వల్ల కర్ణాటకనే కాదు సొంత పార్టీని కూడా కాపాడుకోలేరని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రజలకు ఎప్పుడు అవకాశం లభించినా కాంగ్రెస్‌ను తొలిగిస్తున్నారని చెప్పారు. నెల రోజుల వ్యవధిలో మోదీ కర్ణాటకలో పర్యటించడం ఇది మూడోసారి.

సోహ్రాబుద్దీన్ కేసులో మరో జడ్జి బలిపశువు




హుబ్లీలోని ఓ చర్చిలో పిల్లలతో రాహుల్

- బీజేపీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో మరో జడ్జి బలిపశువుగా మారారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పరోక్షంగా బీజేపీపై తీవ్ర విమర్శలు సంధించారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్ల విచారణను బాంబే హైకోర్టులోని మరో సింగిల్ జడ్జి ధర్మాసనానికి బదిలీ చేయడంపై ఆయన మంగళవారం ట్విట్టర్‌లో స్పందించారు. మీడియాలో వచ్చిన కథనాలను ఆయన ట్వీట్ చేశారు. కేసును మొదట విచారణ జరిపిన సీబీఐ జడ్జి బీజీ లోయా మృతి అంశాన్ని ప్రస్తావిస్తూ 'లోయా ఎలా చనిపోయారు'? అని ప్రశ్నించారు. 'సోహ్రాబుద్దీన్ కేసులో మరో జడ్జి బలిపశువుగా మారారు. సీబీఐని ప్రశ్నించిన జస్టిస్ రేవతి డేరెను తొలిగించారు. తమ ఎదుట హాజరుకావాలని అమిత్‌షాను ఆదేశించిన జడ్జి జేటీ ఉత్పట్‌ను తొలిగించారు. జడ్జి లోయా కఠినమైన ప్రశ్నలు అడిగినందుకు చనిపోయారు' అని రాహుల్ పేర్కొన్నారు. సోహ్రాబుద్దీన్ కేసులో పలు పిటిషన్లపై గత మూడువారాలుగా జస్టిస్ రేవతి డేరె రోజువారీ పద్ధతిలో విచారణ చేపడుతున్నారు. తాజాగా ఈ పిటిషన్లను కొత్తగా మరో ఏకసభ్య ధర్మాసనానికి బదిలీచేశారు.

పార్టీ ప్రారంభోత్సవానికి వచ్చిన వారికి వణక్కం

- కృతజ్ఞతలు తెలిపిన ఎంఎన్‌ఎం పార్టీ అధినేత కమల్‌హాసన్



చెన్నై: గతవారం మదురైలో తాను ఏర్పాటుచేసిన మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) పార్టీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సుమారు లక్ష మంది ప్రజలకు నటుడు, ఆ పార్టీ అధినేత కమల్‌హాసన్ మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 21న ప్రారంభించిన పార్టీ కార్యక్రమానికి హాజరైన ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహా ప్రజలకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 'తన పార్టీ ప్రారంభోత్సవంలో భాగస్వాములై, సహకరించిన సుమారు లక్ష మంది ప్రజలకు పేరుపేరున పెద్ద వణక్కం (నమస్కారం)' అని పేర్కొన్నారు. సభలో పాల్గొన్న వారంతా తమకు బలాన్ని అందించారని, క్రమశిక్షణతో వ్యవహరించారని తెలిపారు.

9 ట్రాక్టర్లకు నక్సల్స్ నిప్పు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని తీవ్రవాద ప్రభావిత బస్తర్ జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లకు నక్సలైట్లు నిప్పంటించారు. మార్దం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రాయ్‌పూర్‌కు సుమారు 450 కిలోమీటర్ల దూరంలో కకునూర్, బర్సూర్ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం జరుగుతున్నదని పోలీసులు వెల్లడించారు. సాయుధులైన నక్సలైట్లు ఘటన స్థలానికి చేరుకొని, కార్మికులను వెళ్లిపోవాలని హెచ్చరించి ట్రాక్టర్లకు నిప్పంటించారని పేర్కొన్నారు.


'పీఎంఎల్-ఎన్' తాత్కాలిక అధ్యక్షుడిగా షాబాజ్ షరీఫ్

లాహోర్: పాకిస్థాన్‌లోని అధికార పార్టీ పీఎంఎల్-ఎన్ తాత్కాలిక అధ్యక్షుడిగా షాబాజ్ షరీఫ్ ఎన్నికయ్యారు. ఆయన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సోదరుడు. అవినీతి కేసులో నవాజ్ షరీఫ్ ప్రధాని పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే. అంతేగాక పార్టీ అధ్యక్షుడిగా నవాజ్ కొనసాగటానికి వీలులేదని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో పార్టీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) షాబాజ్ షరీఫ్‌ను ఎన్నుకుంది.

సరిహద్దులో మళ్లీ పాక్ కాల్పులు

జమ్ము: పాకిస్థాన్ సైన్యం మంగళవారం సరిహద్దులోని భారత సైనిక శిబిరాలు, గ్రామాలు లక్ష్యంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు బీఎస్‌ఎఫ్ జవాన్లు గాయపడ్డారు. నియంత్రణ రేఖ వెంట ఉన్న పూంచ్, రాజౌరీ జిల్లాలోని భింభర్ గలి, మంజకోటె సెక్టార్లపై ఈ కాల్పులు జరిగాయి. మంజకోటె సెక్టార్‌లో ఓ పశువుల కొట్టం పూర్తిగా ధ్వంసమైందని పేర్కొన్నాయి. పాక్ కాల్పులకు భారత బలగాలు కూడా ధీటుగా సమాధానమిచ్చాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

కశ్మీర్లో ఐఎస్ ఆనవాళ్లు లేవు: డీజీపీ వైద్



జమ్ము: కశ్మీర్‌లో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థకు సంబంధించిన ఆనవాళ్లు ఏమీలేవని జమ్ముకశ్మీర్ డీజీపీ ఎస్పీ వైద్ స్పష్టంచేశారు. అయితే, ఒంటరి ఉగ్రవాదులు దాడులుచేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆదివారం జరిగిన పోలీస్ కానిస్టేబుల్ హత్యకు తామే బాధ్యులమని ఐఎస్ ఉగ్రవాదులు ప్రకటించడం ఆందోళన కలిగించే అంశమేనని, అయితే దీనిని పరిశీలించాల్సి ఉన్నదని మంగళవారం ఆయన మీడియాకు చెప్పారు. కానిస్టేబుల్‌ను హత్యచేసి ఆయన సర్వీస్ రైఫిల్‌తో ముష్కరులు పారిపోయారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారని వైద్ చెప్పారు.

అంగారకుడిపై జీవం..

- ఆశలు రేపిన ప్రత్యేక బ్యాక్టీరియా
- వందల ఏండ్లు నిద్రావస్థలో ఉండే సూక్ష్మజీవులను కనుగొన్న శాస్త్రవేత్తలు


అటకామా ఎడారి

వాషింగ్టన్, ఫిబ్రవరి 27: అంగారక గ్రహంపై జీవం మనుగడకు సంబంధించి ఓ బ్యాక్టీరియా సరికొత్త ఆశలు కల్పించింది. దక్షిణ అమెరికాలోని అటకామా ఎడారిలో ఉన్న ప్రపంచంలోనే అత్యంత పొడి ప్రాంతంలో వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు నిర్వహించింది. ఈ ప్రాంతంలో కొన్ని దశాబ్దాలుగా వర్షం పడిన దాఖలాలు లేవు. ఇంతటి పొడి ప్రాంతంలో చిన్నపాటి వర్షం పడగానే కొన్ని ప్రత్యేకమైన బ్యాక్టీరియా జాతులు వృద్ధి చెందడాన్ని గుర్తించారు. ఈ ప్రాంతంలో ఉన్న పొడి వాతావరణం అంగారకుడి ఉపరితలంపై ఉన్న వాతావరణం దాదాపు సమానంగా ఉంటుందని, కాబట్టి మార్స్‌పై ఇలాంటి బ్యాక్టీరియా జీవించి ఉండే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అంగారకుడిపై గతంలో నీరు ఉండేదని ఇప్పటికే శాస్త్రవేత్తలు నిర్ధారించిన సంగతి తెలిసిందే. అంగారకుడి ఉపరితల పొరల్లో నీరు మంచు రూపంలో ఉన్నదని, అంగారకుడు తన భూమ్యాకర్షణ శక్తిని కోల్పోయినప్పుడు నీరంతా ఆవిరై అంతరిక్షంలోకి వెళ్లిపోయిందనే సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. ఒకవేళ నీరంతా ఆవిరైపోయినా ఇలాంటి బ్యాక్టీరియా జీవించి ఉండే అవకాశం ఉన్నదని అమెరికా శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



రాజ్‌భవన్‌లో మంగళవారం సాయంత్రం గవర్నర్ నరసింహన్‌ను కలుసుకున్న మంత్రి జగదీశ్ రెడ్డి దంపతులు, నమస్తే తెలంగాణ సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి దంపతులు. మంత్రి జగదీశ్‌రెడ్డి మేనకోడలు, కట్టా శేఖర్‌రెడ్డి కుమార్తె స్ఫూర్తి వివాహం గ్రంధి భాస్కర్‌రావు కుమారుడు ఆశిష్‌తో మార్చి 4వ తేదీన జరుగనున్న నేపథ్యంలో గవర్నర్ దంపతులను వారు ఆహ్వానించారు.

దక్షిణ సుడాన్ నుంచి స్వదేశానికి తిరిగొచ్చిన
200 మంది సైనికులు

ఐరాస శాంతి మిషన్‌లో భాగంగా అక్కడ విధుల నిర్వహణ

ముంబై, ఫిబ్రవరి 27: దక్షిణ సుడాన్‌లో శాంతిస్థాపన కోసం అక్కడికి వెళ్లి విధులు నిర్వర్తించిన 200 మంది భారత సైనికులు స్వదేశానికి చేరుకున్నారు. 2011లో సుడాన్ నుంచి దక్షిణ సుడాన్ విడిపోయిన తర్వాత అక్కడ అశాంతి నెలకొంది. తర్వాత 2013లో అంతర్యుద్ధం తలెత్తడంతో శాంతిస్థాపన కోసం ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో భారత బలగాలు దక్షిణ సుడాన్ వెళ్లాయి. అధికార వర్గాలు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి శాంతి మిషన్‌లో భాగంగా కొంతమంది భారత సైనికులు దక్షిణ సుడాన్‌లో విధులు నిర్వర్తించారని, ఇప్పటి వరకు 200 మంది సైనికులు ఢిల్లీకి చేరుకున్నారని తెలిపాయి. త్వరలో మరో 60 మంది సైని కులు భారత్‌కు తిరిగిరానున్నారని పేర్కొన్నాయి. శాంతి స్థాపన మిషన్‌లో పాల్గొన్న మేజర్ అభిషేక్ మిశ్రా మాట్లాడుతూ దక్షిణ సుడాన్‌లో విధులను విజయవంతంగా పూర్తి చేసుకొని స్వదేశానికి తిరిగిరావడం సంతోషంగా ఉన్నదని తెలిపారు.



అసద్ బుర్జ్ సందర్శనకు జూన్ నుంచి అనుమతి



న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోటలో ఉన్న అష్టభుజ కోట అసద్ బుర్జ్ సందర్శనకు పర్యాటకులను అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ కోటను పర్యాటకులు చూసేందుకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ మేరకు ఆర్కియాలజిస్టులు కోట సంరక్షణ చర్యలను చేపడుతున్నారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అసద్ బుర్జ్ సంరక్షణ చర్యలను చేపట్టడంతోపాటు ఇప్పటివరకు సందర్శకులకు అందుబాటులోలేని ఎర్రకోటలోని పలు ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నది. కొత్తగా గుర్తించిన ప్రాంతాల్లో ఉద్యానాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు.

రైల్వేకోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్

విద్య, ఉద్యోగ సమాచారం

రైల్వేకోచ్ ఫ్యాక్టరీ (టెక్నికల్ ట్రెయినింగ్ సెంటర్) పలు ట్రేడ్‌లలో అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

కపుర్తలాలోని రైల్వేకోచ్ ఫ్యాక్టరీలో ప్రస్తుత ఖాళీలు ఉన్నాయి.

- మొత్తం ఖాళీల సంఖ్య – 195

ట్రేడ్‌ల వారీగా ఖాళీల సంఖ్య...

- ఫిట్టర్ – 55. వీటిలో జనరల్ – 28, ఎస్సీ – 8, ఎస్టీ – 4, ఓబీసీ – 15.
- వెల్డర్ (జీ అండ్ ఈ) – 50. వీటిలో జనరల్ – 25, ఎస్సీ – 8, ఎస్టీ – 4, ఓబీసీ – 13.
- మెషినిస్ట్ – 17. వీటిలో జనరల్ – 9, ఎస్సీ – 2, ఎస్టీ – 1, ఓబీసీ – 5.



- రైల్వేల్లో అప్రెంటిస్
- పదోతరగతి + ఐటీఐ ఉత్తీర్ణులకు అవకాశం
- అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఎంపిక
- రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం స్టయిఫండ్

- పెయింటర్ (జీ) – 9. వీటిలో జనరల్ – 5, ఎస్సీ –1, ఎస్టీ –1, ఓబీసీ – 2.
- కార్పెంటర్ – 16. వీటిలో జనరల్ – 9, ఎస్సీ – 2, ఎస్టీ –1, ఓబీసీ –4.
- మెకానికల్ (మోటార్ వెహికిల్) – 6. వీటిలో జనరల్ – 3, ఎస్సీ – 1,ఓబీసీ – 2.
- ఎలక్ట్రీషియన్ – 28. వీటిలో జనరల్ – 14, ఎస్సీ – 4, ఎస్టీ – 2, ఓబీసీ – 8.
- ఎలక్ట్రానిక్ మెకానిక్ – 4. వీటిలో జనరల్ – 2, ఎస్సీ – 1, ఓబీసీ – 1.
- ఏసీ & రిఫ్రిజిరేషన్ మెకానిక్ – 10. వీటిలో జనరల్ – 5, ఎస్సీ – 2, ఎస్టీ – 1, ఓబీసీ – 2.
- **వయస్సు:** 2018, ఫిబ్రవరి 17 నాటికి 15– 24 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ లేదా సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. పదోతరగతి + ఐటీఐ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

నోట్ మార్కులు సమానంగా ఉంటే వారి వయస్సునుబట్టి ఎంపికచేస్తారు.

- **స్టయిఫండ్, శిక్షణ:** 1961 యాక్టు ప్రకారం శిక్షణనిస్తారు. స్టయిఫండ్ రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం చెల్లిస్తారు.
- ఎంపికైన వారికి ఎటువంటి హాస్టల్ సౌకర్యం కల్పించరు.
- రైల్వేకోచ్ ఫ్యాక్టరీ నిర్వహించే వైద్యపరీక్షల్లో అర్హత సాధించినవారికి మాత్రమే తుది ఎంపికలో స్థానం కల్పిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 13
- **ఫీజు:** రూ. 100/–

నోట్ ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఎటువంటి ఫీజు లేదు.

- **వెబ్‌సైట్:** http://rcf.indianrailways.gov.in

ఎన్ఐఈపీఐడీలో ఫ్యాకల్టీ పోస్టులు

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్ (ఎన్ఐఈపీఐడీ-దివ్యజ్ఞాన్) ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

ఎన్ఐఈపీఐడీ సికింద్రాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో, నోయిడా, నవీ ముంబై, కోల్‌కతాలో ఉన్న ప్రాంతీయ కేంద్రాల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తుంది.

టీచింగ్/ప్రొఫెషనల్ పోస్టులు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ (రిహాబిలిటేషన్ సైకాలజీ, స్పెషల్ ఎడ్యుకేషన్, మెడికల్ సైన్స్), ప్రోగ్రామర్ (సాఫ్ట్‌వేర్), లెక్చరర్ (రిహాబిలిటేషన్ సైకాలజీ, స్పెషల్ ఎడ్యుకేషన్, మెడికల్ సైన్స్, ఫిజియోథెరపీ), రిహాబిలిటేషన్ థెరపిస్ట్ (స్పీచ్, ఫిజియోథెరపీ, ఎర్లీ ఇంటర్వెన్షన్, ఈసీఎస్ఈ టీచర్), స్పెషల్ ఎడ్యుకేటర్ లెవల్, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అసిస్టెంట్ లైబ్రేరియన్, హెడ్‌మాస్టర్, టీచర్స్ (జనరల్, మ్యూజిక్, డ్యాన్స్), ఫార్మాసిస్ట్



నాన్ టీచింగ్ పోస్టులు

- సెక్షన్ ఆఫీసర్, డాటా ఎంట్రీ ఆపరేటర్
- **అర్హతలు:** ఒక్కో పోస్టుకు ఒక్కో విధంగా ఉన్నాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీలు:** నోయిడాలో మార్చి 5, 6, నవీ ముంబైలో మార్చి 8, 9న, కోల్‌కతాలో మార్చి 12, 13న, సికింద్రాబాద్‌లో మార్చి 19, 20 తేదీల్లో.
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

ఈసీఐఎల్‌లో వాక్‌ఇన్

హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

Electronics Corporation of India Limited

వివరాలు

భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన ఈసీఐఎల్ విశాఖపట్నంలోని బ్రాంచీలో ఈ పోస్టులను భర్తీ చేయనుంది. ఇంటర్వ్యూల ద్వారా మూడేండ్ల కాలపరిమితికి ఎంపిక చేస్తారు.

- **మొత్తం ఖాళీలు:** 14
- టెక్నికల్ ఆఫీసర్– 8 (జనరల్ – 4, ఓబీసీ – 2, ఎస్సీ –1, ఎస్టీ – 1)
- **అర్హతలు:** ఇంజినీరింగ్ డిగ్రీలో ఈఈఈ, ఈసీఈ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సీఎస్ఈ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఏడాది అనుభవంతోపాటు 2018, జనవరి 31 నాటికి 30 ఏండ్లు నిండినవారై ఉండాలి.
- సైంటిఫిక్ అసిస్టెంట్–ఏ: 6 (జనరల్ – 3, ఓబీసీ– 1, ఎస్సీ –1, ఎస్టీ – 1)
- **అర్హతలు:** బీటెక్‌లో ఈఈఈ లేదా ఈసీఈ 60 మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు ఏడాది అనుబవం, 2018, జనవరి 31 నాటికి 25 ఏండ్లు నిండినవారై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, రాత లేదా ట్రేడ్ పరీక్ష ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో. వెబ్‌సైట్‌లో నిర్ణీత నమూనాలో ఉన్న దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి, సంబంధిత సర్టిఫికెట్లను జతచేసి నేరుగా ఇంటర్వ్యూకి హాజరుకావాలి.

ఇంటర్వ్యూ: ECIL, 47-9-28, MUKUND SUVASA APARTMENTS, 3rd LANE, DWARAKA NAGAR, VISAKHAPATNAM–530016, Ph.No.0891–2755836

- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

తెలంగాణ పీఈసెట్-2018

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి గాను బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్‌పీఈసెట్) నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు

ఈ ఏడాది పీఈసెట్‌ను నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తున్నది. ఈ కోర్సులు రెండేండ్ల కాలవ్యవధి కలిగి ఉంటాయి.

- **కోర్సులు:** బీపీఈడీ, డీపీఈడీ
- **అర్హతలు:** బీపీఈడీ కోర్సుకు ఏదైనా మూడేండ్ల డిగ్రీ లేదా తత్సమాన కోర్సు, డీపీఈడీకి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి. 2018, జూలై 1 నాటికి బీపీఈడీకి 19 ఏండ్లు, డీపీఈడీకి 16 ఏండ్లు నిండి ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 800, ఎస్సీ, ఎస్టీలకు రూ. 400
- **దరఖాస్తుల ప్రారంభం:** ఫిబ్రవరి 28
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.pecet.tsche.ac.in

పీహెచ్‌డీ స్కాలర్‌షిప్స్

ముంబైలోని ఐఐటీబీ-మోనాష్ రిసెర్చ్ అకాడమీ సంయుక్తంగా వివిధ విభాగాల్లో పరిశోధన చేయడానికి రిసెర్చ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ (2018 జూన్‌లో ప్రారంభమయ్యే పీహెచ్‌డీ) కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఈ పీహెచ్‌డీ స్కాలర్‌షిప్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బాంబే), మోనాష్ యూనివర్సిటీ (ఆస్ట్రేలియా) సంయుక్తంగా అందిస్తున్నాయి.

IITB-Monash Research Academy
MONASH University
PhD Scholarships

- **ప్రోగ్రామ్ పేరు:** పీహెచ్‌డీ స్కాలర్‌షిప్స్
- **విభాగాలు:** సైన్స్, టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఇంజినీరింగ్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత ఇంజినీరింగ్ విభాగంలో మాస్టర్ డిగ్రీ/ డిగ్రీలో ఉత్తీర్ణత. గేట్, జీఆర్ఈ, సీఎస్ఐఆర్ నెట్, జామ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 11
- **వెబ్‌సైట్:** www.iitbmonash.org

సైంటిస్టు పోస్టులు

డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

ఐఐఆర్ఎస్ అనేది ఇస్రో పరిధిలో పనిచేస్తుంది. రిమోట్ సెన్సింగ్, జియో ఇన్ఫర్మాటిక్స్, జీపీఎస్ టెక్నాలజీ తదితర విభాగాల్లో ఈ సంస్థ సేవలు అందిస్తుంది.

- **పోస్టు:** సైంటిస్ట్/ఇంజినీర్ (ఎస్‌డీ)

ఖాళీల సంఖ్య – 2

- **అర్హతలు:** బాటనీ/ఫారెస్ట్రీ లేదా ఎకాలజీ/ ప్లాంట్ సైన్స్ లేదా తత్సమాన సబ్జెక్టుల్లో పీహెచ్‌డీతోపాటు సంబంధిత సబ్జెక్టులో ప్రథమశ్రేణిలో పీజీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** వయోపరిమితి లేదు.
- **పేస్కేల్:** ఏడో పే కమిషన్ ప్రకారం ప్రారంభవేతనం నెలకు రూ. 67,700/– వరకు వస్తుంది. ఇతర అలవెన్సులు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** http://recruitment.iirs.gov.in